www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

పేజీలు: 16 + 20 +32 | వెల: రూ. 8.00 | సంపుటి: 15 సంచిక: 181

ఆదివారం | 6-1-2019

శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ. 6.58 తదుపరి శు. పాడ్యమి; నక్షత్రం: పూర్వాషాఢ సా. 5.43 తదుపరి ఉత్తరాషాఢ ; వర్జ్యం: రా. 2.41-4.28; దుర్ముహూర్తం: సా. 4.24-5.08; అమృతఘడియలు: మ. 12.24-2.11; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.52

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



ఐఏఎస్ అధికారిణి చంద్రకళ



తెలంగాణకు చెందిన ఐఏఎస్

చంద్రకళ ఇంట్లో సీబీఐ సోదాలు

యూపీలో ఇసుక తవ్వకాల్లో ప్రమేయంపై ఆరోపణలు

అఖిలేశ్‌పై కేంద్రం గురి?

16

అనుభవించు రాజా..!



బాక్సర్ మేవెదర్ వైభోగం

వందకు పైగా లగ్జరీ కార్లు.. 3 విమానాలు

ఓ కారు ఖరీదు రూ.33 కోట్లు

రూ.126 కోట్ల వజ్రాల వాచీ

నిక్కర్ల ఖర్చు ఏటా రూ.4.5 లక్షలు

14

హైదరాబాద్‌లో చిరుతలు

రెండు పులులు సంచరిస్తున్నట్లు నిర్ధారణ

సైబరాబాద్‌లో ఒకటి, రాచకొండలో మరోటి


ఎయిర్‌పోర్టు రన్‌వే పైనా సంచారం

సెంట్రల్, వ్యవసాయ వర్సిటీల్లో కదలికలు

యాచారంలో వరుసగా మూడోసారి దాడి

ఆందోళనలో శివారు గ్రామస్థులు

2



మే 3 నుంచి ఎంసెట్

8, 9వ తేదీల్లో అగ్రికల్చర్ పరీక్ష

11న ఈసెట్.. 23, 24న ఐసెట్

వివిధ ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

పీఈసెట్ మినహా అన్నీ ఆన్‌లైన్‌లోనే

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):ఇంజనీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు మే 3 నుంచి ఎంసెట్ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఇంజనీరింగ్ కోర్సులకు మే 3, 4, 6వ తేదీల్లో, అగ్రికల్చర్ కోర్సులకు మే 8, 9వ తేదీల్లో ఎంసెట్ నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి వెల్లడించారు. మే 5న నీట్ పరీక్ష ఉన్న నేపథ్యంలో ఆ రోజు ఎంసెట్ పరీక్ష లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. నీట్‌కు హాజరైన విద్యార్థులు అగ్రికల్చర్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు 7వ తేదీ కూడా వెసులుబాటు కల్పించామన్నారు. ఈ మేరకు వివిధ సెట్ల షెడ్యూళ్లను ఆయన ప్రకటించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్(పీఈసెట్-2019) మినహా మిగతా పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో

మిగతా 2వ పేజీలో...

8,9 తేదీల్లో మళ్లీ బ్యాంకు ఉద్యోగుల సమ్మె

12

ముహూర్తం 17న

ఉత్తరాయణ పుణ్యకాలం ఏకాదశి రోజున కొత్త అసెంబ్లీ



ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్‌ఖాన్



నాలుగు రోజులపాటు సమావేశాలు


17న శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం

18న స్పీకర్ ఎన్నిక.. 19న గవర్నర్ ప్రసంగం

20న ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చ

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెండో అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 17వ తేదీ బుధవారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన 38 రోజులకు ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నాలుగు రోజుల పాటు అంటే 20వ తేదీ వరకూ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. డిసెంబరు ఏడో తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగగా.. 11న ఫలితాలు వచ్చిన విషయం తెలిసిందే. 13వ తేదీన సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత.. అసెంబ్లీ ఎప్పుడు సమావేశమవుతుంది!? ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ఎప్పుడు ఉంటుందనే ఆసక్తి అటు రాజకీయ నాయకుల్లోనూ ఇటు ప్రజల్లోనూ నెలకొంది. సంక్రాంతి తర్వాతే అసెంబ్లీ సమావేశం ఉంటుందనే ప్రచారమూ జరిగింది. ఈ నేపథ్యంలోనే, తెలంగాణ ప్రజలు గొప్ప మెజారిటీతో తమను గెలిపించారని, ఆ స్ఫూర్తితో ఉత్తరాయణ పుణ్యకాలంలో ఏకాదశినాడు శాసనసభ కార్యకలాపాలు ఆరంభించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారని ఆ ప్రకటనలో

మిగతా 5వ పేజీలో...



సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటన

18న మంత్రివర్గం!

మినీ కేబినెట్‌లో ఆరేడుగురికే చోటు

కేటీఆర్, హరీశ్ పేర్లపై అనుమానాలు

లోక్‌సభ తర్వాతే పూర్తిస్థాయి విస్తరణ

స్పీకర్ పదవిపై పలువురి అనాసక్తి

5



నల్లగొండ లేదా మెదక్

లోక్‌సభకు కేసీఆర్ ఎక్కడి నుంచి?

మరోసారి 'అసెంబ్లీ ఫార్ములా'కే మొగ్గు

అత్యధిక స్థానాల్లో సిట్టింగ్‌లకే చాన్స్

మల్కాజిగిరి, చేవెళ్లల్లో పోటాపోటీ

పెద్దపల్లిలో అంతర్గత కుమ్ములాట

టీఆర్ఎస్ శ్రేణుల్లో రసవత్తరంగా చర్చ

5

పొగుడుతారు.. పైసలివ్వరు



తెలంగాణపై బీజేపీది సవతి తల్లి ప్రేమ

ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారు?

వైఖరి మారకపోతే డిపాజిట్లు కూడా రావు

బాబు తెలంగాణకు మళ్లీ రారనుకుంటున్నా

16 ఎంపీ స్థానాలను గెలుచుకుంటాం

కాంగ్రెస్‌ది అభ్యర్థులు దొరకని పరిస్థితి

కేసీఆర్ ఎంపీగా పోటీచేయాల్సిన అవసరమేంటి?.. కేటీఆర్ వ్యాఖ్యలు

ఆంధ్రజ్యోతి

పాఠకులకు గమనిక



నేటి సంచికతో పాటు ఆదివారం అనుబంధానికి బదులుగా 2019 పంచాంగం క్యాలండర్ ఉచితంగా అందుకోండి

\- మేనేజింగ్ డైరెక్టర్

నో బిల్స్

రాష్ట్రంలో అన్ని శాఖల బిల్లులూ పెండింగ్

రూ.12 వేల కోట్ల వరకూ బకాయిలు జామ్

ఏడు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు

మూడు శాఖల్లోనే రూ.10 వేల కోట్లు

సచివాలయం చుట్టూ కాంట్రాక్టర్ల చక్కర్లు

చేతులు పైకి చూపిస్తున్న ఉన్నతాధికారులు

రెండున్నర నెలలుగా వైద్య చికిత్సలు బంద్

సంక్షేమ పథకాలకు మళ్లింపుతో సమస్య



6



ఆగని అల్లర్లు!

16

అట్టుడుకుతున్న కేరళ

బీజేపీ ఎంపీ ఇంటిపై బాంబుదాడి

లెఫ్ట్ నేతల ఇళ్లపైనా బాంబులు

ఇప్పటికి 3178 మంది అరెస్టు

సంఘ్-బీజేపీ వల్లే హింస: లెఫ్ట్

లెఫ్ట్ గూండాల విధ్వంసం: బీజేపీ

నేనొచ్చేశా!

అమెరికా నుంచి తిరిగొస్తున్న మనోళ్లు

కొందరిలో కరుగుతున్న డాలర్ డ్రీమ్స్

స్వచ్ఛను కోరుతూ మరికొందరు

భారత్‌లో పెరుగుతున్న అవకాశాలు

ట్రంప్ దెబ్బకు దిన దినగండం

11

ఎప్పుడైనా తిరిగి రాకతప్పదనే భావన





గాంధీభవన్‌లో జరిగిన సమీక్షలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, కుంతియా తదితరులు

పొత్తు వల్లే ఓటమి

ప్రజాఫ్రంట్ వస్తే బాబు వస్తాడన్న ప్రచారాన్ని జనం నమ్మారు

లోక్‌సభ ఎన్నికలకు పొత్తులొద్దు: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చంద్రబాబు వల్ల కొంత లాభమే: భట్టి.. ఓటమిపై కాంగ్రెస్ సమీక్ష

6



పరంజ్యోతి

కోతులు పుట్టిందెందుకురా..

కోతులు పుట్టిందెందుకురా.. కొమ్మలు తుంచేటందుకురా
కొమ్మలు తుంచేదెందుకురా.. రథములు చేసేటందుకురా
రథములు చేసేదెందుకురా.. రాముడు తోలేటందుకురా
రాముడు తోలేదెందుకురా.. లంకకు చేరేటందుకురా
లంకకు చేరేదెందుకురా.. రావణు చంపేటందుకురా
రావణు చంపేదెందుకురా.. సీతను తెచ్చేటందుకురా
సీతను తెచ్చేదెందుకురా.. అయోధ్య చేరేటందుకురా
అయోధ్య చేరేదెందుకురా.. భజనలు చేసేటందుకురా
భజనలు చేసేదెందుకురా.. ముక్తిని పొందేటందుకురా

పగలంతా పనీపాటా చేసి అలసిసొలసిపోయిన పామర జనం సాయంత్రానికి దేవాలయం దగ్గర గుమికూడి పారవశ్యంతో పాడుకునే పాట ఇది. ఒకప్పుడు గ్రామాల్లో ఇలాంటి దృశ్యాలు, పాటలు విస్తృతంగా కనిపించేవి, వినిపించేవి. ఆ తాళాలతో భక్తులంతా తన్మయత్వంలో తనువులు మరచి రామాయణాన్ని గానం చేసేవారు. ఇందులో పైకి కనిపించే అర్థం రామాయణమే. అంతరార్థం వేరే ఉంది. అదేంటంటే.. ఈ పాటలోని కోతులం మనమే. మనం ఎందుకు పుట్టామంటే.. కొమ్మలనే ఇంద్రియాలను తొలగించుకోవడానికి. ఆ తొలగించబడిన ఇంద్రియాలతో ఈ శరీరం అనే రథం సిద్ధంజేసి భగవంతుని స్వాధీనం చేసి అందులో అతుక్కుపోయిన కామమనే రావణాసురున్ని సంహరించాలి. అంతరార్థం అనే సీతను తెచ్చి, ధర్మబద్ధమైన అయోధ్య అనే మనసుతో ఆ భగవంతుని గురించి భజనలు చేసి ముక్తిని ప్రసాదించమని వేడుకోవాలి. చదువు వచ్చినవారు భాగవత, రామాయణాలు చదివి తెలుసుకుంటారేమోగానీ.. పల్లెల్లో చదువు రానివారికి ఇవే ధర్మోపదేశాలు. నిత్యమూ టీవీల్లో చెప్పే ఉపన్యాసాలు, ఉపదేశాలు, వేదాలు, ఉపనిషత్తుల సారాన్ని వింటూ, అంతా తమకు అర్థమైపోయిందని భ్రమిస్తూ.. ఏళ్లు గడిచినా ధర్మాన్ని గురించి తెలుసుకోలేని అర్థజ్ఞానులకంటే.. నిర్మలమైన మనసుతో ఇలా భజనలు చేసేవారంటేనే భగవంతునికి ప్రీతి.

'సంతుష్ట సతతం యోగీ యతాత్మ ధృడనిశ్చయః
మయ్యర్పిత మనోబుద్ధిఃయో మద్భక్తస్సమే ప్రియః

..అన్నాడు గీతచార్యుడు. నిశ్చయ బుద్ధితో, ఆ పరమాత్మయందే మనస్సును అర్పణ చేసినవారే ఆ భగవంతునికి ఇష్టులు. ఆయనకు ఎంతో ప్రియమైనవారు.



- తిప్పలూరు జయచంద్రరావు, 9985356648



హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన నెమళ్ళు (ఫైల్)

కాపాడకున్నా.. బతికేవేమో!

- కిన్నెరసాని పార్కులో నెమళ్ల అదృశ్యం
- 22 జాతీయ పక్షులకు మిగిలింది రెండే



పాల్వంచ రూరల్, జనవరి 5: భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో నెమళ్లు మాయమయ్యాయి. ఇక్కడికి 22 నెమళ్లను తీసుకురాగా.. రెండే మిగిలి ఉండటం గమనార్హం. 2017 ఫిబ్రవరిలో వరంగల్ కాకతీయ సెంట్రల్‌పార్క్ నుంచి ఆరు నెమళ్లను .. అదే ఏడాది మార్చిలో హైదరాబాద్ కోకాపేటలో ఓ ఫామ్‌హౌస్ నుంచి 10 నెమళ్లను.. నిరుడు డిసెంబరులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీ నుంచి ఆరు నెమళ్లను ఈ పార్కుకు తరలించారు. సంరక్షణ తీరు సరిగా లేకపోవడంతో.. రెండు నెమళ్లు చనిపోయాయి. మిగతా 20లో ప్రస్తుతం మిగిలింది రెండే. అవన్నీ ఎలా అదృశ్యమయ్యాయనేది మిస్టరీగా మారింది. ఎవరైనా వేటాడారా? స్మగ్లర్లు చేతివాటం ప్రదర్శించారా? అనే ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా.. హైదరాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్, ప్రైవేటు కంపెనీలో నెమళ్లు ఉన్నప్పుడు వాటి ఆలనాపాలనా చూడటానికి ప్రత్యేక ఏర్పాట్ల కారణంగా.. అవి అక్కడే ఉన్నా బతికి ఉండేవనే అభిప్రాయాలు పార్కు సిబ్బందిలో వ్యక్తమవుతున్నారు.

హైదరాబాద్‌లో చిరుతలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): అడవుల్లో ఉండాల్సిన చిరుతలు హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌లో సంచరిస్తున్నాయి. ప్రజల్లో తీవ్ర అలజడి రేకెత్తిస్తున్నాయి. శుక్రవారం రాత్రి యాచారం మండలంలో ఓ ఆడ చిరుత మూడోసారి మేకల మందపై దాడి చేసింది. దాని ఆచూకీ కోసం గాలిస్తున్న అటవీశాఖ అధికారులు.. మరో కొత్త విషయాన్ని గుర్తించారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు.. శివారు ప్రాంతాల్లో రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు నిర్ధారించారు. సైబరాబాద్ పరిధిలో ఒకటి.. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరోటి సంచరిస్తున్నట్లు గుర్తించాయి. రెండున్నర నెలల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్టు రన్‌వే సమీపానికి ఓ చిరుత వచ్చింది. ఈ విషయం బయటకు పొక్కలేదు. యాచారం మండలంలోని కొత్తపల్లిలో చిరుత వరుసదాడుల నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చిరుత కదలికలను కొనుగొన్నారు. బోడుప్పల్‌లో కూడా చిరుత జాడలు లభ్యమయ్యాయి. నిర్మాణంలో ఉన్న ఓ ఇంటికి సమీపానికి చిరుత వచ్చింది. ఇంటి వద్ద అరుగు కోసం అదే రోజు ప్లాస్టింరింగ్ చేశారు. దానిపైన పడ్డ కాలిముద్రలు చిరుతవేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇలా రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు నిర్ధారించారు. ఒకటి యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, మెయినాబాద్, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, శేరిలింగంపల్లి మండలాల పరిధిలో తిరుగుతున్నట్లు గుర్తించారు. హయత్‌నగర్, ఉప్పల్, ఘట్‌కేసర్, పరిసర ప్రాంతాల్లో మరో చిరుత సంచరిస్తున్నట్లు కనుగొన్నారు.

కాగా యాచారం పరిసర గ్రామాల్లో చిరుత పులుల దాడులు రెండేళ్లుగా వరుసగా జరుగుతూనే ఉన్నాయి. కొత్తపల్లిలో మేకల మందలపై వరసగా వారంలో మూడోసారి చిరుత దాడి చేసింది. రెండేళ్ల క్రితం తాడిపర్తిలో అడవి జంతువుల దాడిలో ఓ ఆవు, ఓ దూడ మృత్యువాత పడ్డాయి.

నాలుగు కెమెరాల ఏర్పాటు

చిరుత ఆచూకీ కొనుగునేందుకు కొత్తపల్లిలో నాలుగు కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి జానకీరామ్ తెలిపారు. కొన్ని చోట్ల బోన్లు ఏర్పాటు చేశామన్నారు. రాత్రి పూట సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిరుతల దాడి కారణంగా పశు సంపద నష్టపోయిన వారికి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.



యాచారంలో మూడోసారి దాడి

యాచారం, జనవరి 5: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లి గ్రామాన్ని వారంగా చిరుతపులి వణికిస్తోంది. శుక్రవారం రాత్రి కొత్తపల్లికి చెందిన బైకని వెంకటయ్య పొలం వద్ద మేకను కట్టేసి ఇంటికొచ్చాడు. రాత్రి పొలానికి వెళ్లేసరికి చిరుత పులి మేకను చంపి కొంత భాగం తినేసింది. చిరుత పులి వెంకటేశ్వర గుట్టపైకి వెళ్లడం చూసిన వెంకటయ్య భయంతో ఇంటికి చేరుకున్నాడు. గుట్టపైకి వెళ్లే సమయంలోనూ చిరుత ఓ అడవి పందిని చంపి, కొంతభాగాన్ని తిని వదేలిసింది. శనివారం అటవీశాఖ రేంజర్ సత్యంతోపాటు బీట్ అధికారి వెంకటయ్య సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. చిరుత పాదముద్రలు, అడవి పంది మాంసం ఆనవాళ్లను సేకరించారు. ఇది ఆడ చిరుత అయి ఉంటుందని భావిస్తున్నారు. చిరుత అడుగులు, విసర్జించిన మలాన్ని ల్యాబ్‌కు పంపించారు. అనంతరం ఇవి చిరుత దాడులేనని నిర్ధారించారు.

వైద్యం వికటించి శిశువు మృతి!

- ఆస్పత్రి, మందుల షాపుపై కుటుంబీకుల దాడి



తూప్రాన్, జనవరి 5: వైద్యం వికటించడంతోనే తమ బిడ్డ మృతి చెందాడనే ఆగ్రహంతో కుటుంబసభ్యులు ఆస్పత్రి, మెడికల్ షాపుపై దాడిచేశారు. ఫర్నిచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ పరిధిలోని పోతరాజుపల్లిలో శనివారం ఈ ఘటన జరిగింది. మనోహరాబాద్ మండలం పాలాటకు చెందిన పల్లపు మల్లేశ్, స్వరూప దంపతుల బిడ్డ నందకిశోర్ (3నెలలు) అస్వస్థతకు గురవడంతో శిశువును పోతరాజుపల్లిలో ఆర్ఎంపీ నరేశ్ నిర్వహిస్తున్న కిషన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. శిశువు శ్వాస పరంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో నెబిలైజేషన్ చేసినట్లు చెబుతున్నారు. కొద్దిసేపటికి కోలుకోవడంతో బిడ్డను ఇంటికి తీసుకెళ్లారు. శిశువు మళ్లీ అస్వస్థతకు గురవడంతో నరేశ్ వద్దకు తీసుకొచ్చారు. కొద్దిసేపటికే శిశువు మృతి చెందినట్లు చెబుతున్నారు. వైద్యం వికటించడంతోనే బిడ్డ మృతిచెందాడని కుటుంబీకులు ఆరోపించారు.

డాక్టర్ లేక.. 108 రాక.. నిండుప్రాణం బలి

- 18 కి.మీ దూరంలోని ఆస్పత్రికి బైక్‌పై తరలించేలోగా..
- పురుగుమందు తాగిన యువకుడి మృతి

వాజేడు, జనవరి 5: పురుగుమందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని పీహెచ్‌సీకి తీసుకెళితే డాక్టర్ లేడన్నారు.. 108కు ఫోన్ చేస్తే మీ ఊరికి సర్వీసు లేదన్నారు.. చేసేది లేక బాధితుడు బోదెబోయిన కార్తీక్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాజేడు నుంచి బైక్‌పై 18 కిలోమీటర్ల దూరంలోని ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించేలోగా పరిస్థితి చేయిదాటింది. సకాలంలో వైద్యం అందక కార్తీక్ కన్నుమూశాడు. 108 వాజేడుకు వచ్చి బాధితున్ని ఏటూరునాగారం దవాఖాన దాకా చేర్చకపోవడంతో ఓ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. అంతకుముందు శనివారం ఉదయం కార్తీక్ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగానే వాజేడు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యుడు లేకపోయినా అందుబాటులో ఉన్న సిబ్బంది విషం కక్కించారు. ఒకవేళ వైద్యుడు అందుబాటులో ఉండి ఉంటే అతడి ప్రాణం నిలిచేదని గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు తెలిపారు. జిల్లా పరిధిలోని మారుమూల గ్రామాలకు 108 సర్వీసులను విస్తరించాలని కోరారు.



బాధితున్ని బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

మే 3 నుంచి ఎంసెట్

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనున్నారు. త్వరలోనే ఈ సెట్ల నిర్వహణకు కన్వీనర్లను నియమించనున్నారు. అనంతరం పరీక్షల నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది.

2019 ప్రవేశ పరీక్షల షెడ్యూలు

సెట్ పేరు	నిర్వహించే వర్సిటీ	పరీక్ష తేది	సమయం
ఎంసెట్	జేఎన్‌టీయూహెచ్	మే 3,4,6 (ఇంజనీరింగ్) మే 8,9 (అగ్రికల్చర్)	ఉదయం 10 నుంచి 1 గంట వరకు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు
ఈసెట్	జేఎన్‌టీయూహెచ్	మే 11	ఉదయం 10 నుంచి 1 గంట వరకు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు
పీఈ సెట్	ఎంజీయూ	మే20	
ఐ సెట్	కేయూ	మే 23, 24	ఉదయం 10 నుంచి 12.30 వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 5 వరకు
లా సెట్	ఓయూ	మే 26	ఉదయం 11 నుంచి 12.30 వరకు
పీజీ ఎల్ సెట్	ఓయూ	మే 26	మధ్యాహ్నం 2.30 నుంచి 4 వరకు
పీజీ ఈసెట్	ఓయూ	మే 27, 28, 29	ఉదయం 10 నుంచి 12 గంట వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు
ఎడ్ సెట్	ఓయూ	మే 30, 31	ఉదయం 11 నుంచి 1 గంట వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు

ఒక్క మెసేజ్‌తో 71 లక్షలు హంఫట్

- రూ.6 కోట్ల ప్రైజ్‌మనీ పేరుతో మోసం
- 4 నెలలుగా అజ్ఞాతంలో బాధితుడు

బచ్చన్నపేట, జనవరి 5: 'కంగ్రాట్స్... కోకాకోలా లాటరీలో మీరు కోట్ల రూపాయలు గెలుచుకున్నారు. ఐటీ క్లియరెన్స్ కోసం కొంత డబ్బు పంపితే చాలు. రూ.కోట్లు మీ ఖాతాలో పడిపోతాయి' అంటూ ఊరించి రూ.71లక్షలు కాజేసిన ఘటన జనగామ జిల్లాలో జరిగింది. సైబర్ మాయగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మోసపోయిన ఆ యువకుడు తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి, అవి చెల్లించలేక నాలుగు నెలలుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కుమారుడు కనిపించడం లేదంటూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన కరికె అయిలయ్య కుమారుడు భరత్ బీటెక్ పూర్తి చేశాడు. 2018 ప్రారంభంలో కోకాకోలా కంపెనీ నిర్వహించిన క్విజ్ పోటీల్లో రూ. 6 కోట్లు ప్రైజ్‌మనీ గెలుచుకున్నట్లు అతని సెల్‌కు ఓ మెసేజ్ వచ్చింది. అది చూసి సంబరపడిన భరత్.. వారితో మాటలు కలిపాడు. ముందుగా లావాదేవీలు సాగిస్తున్నట్టు నమ్మించిన కేటుగాళ్లు.. విదేశాల నుంచి ఐటీ తదితర క్లియరెన్సుల కోసం కొంత డబ్బును ఖాతాలో జమ చేయాలని కోరారు. ఆ మాటలు నమ్మిన భరత్ అప్పులు చేసి సుమారు రూ. 71 లక్షలు వారి ఖాతాలో జమ చేశాడు. తర్వాత మోసపోయానని గుర్తించాడు. అప్పులు ఇచ్చిన వారు నిలదీయడంతో దిక్కుతోచక నాలుగు నెలల నుంచి అజ్ఞాతంలోకి వెళ్లాడు. దీంతో భరత్ తండ్రి బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కొడుకు ఆచూకీ కనుగొని, సైబర్ మాయగాళ్లను గుర్తించి న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నాడు. కాగా, భరత్‌కు అప్పు ఇచ్చిన సమీప బంధువు ఒకరు.. తనకు డబ్బులు తిరిగి వచ్చేలా లేవనే బెంగతో మృతి చెందినట్లు తెలుస్తోంది.

అలసిపోయాం.. కాన్పు చేయలేం!

- గర్భిణి విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం.. మూత్రశాలలోనే ప్రసవం
- కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరో ఘటన

సుభాష్‌నగర్, జనవరి 5: ఆస్పత్రి వార్డులో గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుంటే సిబ్బంది పట్టించుకోలేదు. విషయం చెప్పేందుకు వెళ్లిన ఆమె తల్లితో 'మేం రోజంతా ప్రసవాలు చేసి అలసిపోయాం అక్కడికి రాలేం' అని సమాధానమిచ్చారు. బాధితురాలు కొద్దిసేపటికి మూత్రశాలకు వెళ్లగా ఆమెకు అక్కడే ప్రసవం జరిగింది. కరీంనగర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది నిర్లక్ష్యమిది. గత 10 రోజుల్లో ఇక్కడ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం రెండోసారి. బాధితురాలి తల్లిదండ్రుల వివరాల ప్రకారం సల్మాబీ (21)ని మొదటి కాన్పు కోసం తల్లిగారి ఊరు సిరిసిల్ల జిల్లా తడగొండలో ఉంచారు. ఈ నెల 3న ఆమెకు నొప్పులు రావడంతో కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. 4న రాత్రి 8 గంటల నుంచి నొప్పులు అధికమవడంతో ఆమె తల్లి.. సిబ్బందికి తెలియజేసింది. కాగా మూత్రశాలలో ప్రసవించిన విషయాన్ని సిబ్బందికి తెలియజేయడానికి ఆమె బంధువులు వెళ్లగా సిబ్బంది తలుపేసుకున్నారు. ఇతర సిబ్బంది అక్కడికి చేరుకొని తల్లీబిడ్డను వార్డుకు తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.



సల్మాబీ, శిశువు

అమ్మా.. నువ్వు లేని బతుకెందుకు!

- తల్లి అనారోగ్యంపై కొడుకు ఆందోళన.. రైలు కింద పడి ఆత్మహత్య

నల్లగొండ క్రైం, జనవరి 5: కన్నతల్లి ఇక ఎన్నో రోజులు బతకదని తెలిసి ఆ కొడుకు తల్లడిల్లిపోయాడు. తల్లిని విగతజీవిగా చూసేకన్నా చావడమే మేలనుకున్నాడు. దూసుకొస్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయవిదారక ఘటన నల్లగొండ జిల్లా అప్పాజీపేటలో శనివారం జరిగింది. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. మర్రి భానుమతి (75) పుట్టుకతోనే బదిరురాలు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు, ప్రకాశ్ (28) సంతానం. భర్త చంద్రయ్య మృతిచెందేనాటికి ప్రకాశ్‌కు ఏడాది వయసే! కొన్నాళ్లుగా భానుమతి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ప్రకాశ్ ఆమెకు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. శనివారం తెల్లవారుజామున ఆమె ఆరోగ్యం పూర్తిగా విషమించింది. ఆమెను ఆ స్థితిలో చూసి తట్టుకోలేకపోయిన ప్రకాశ్.. శేరుబాయిగూడెం శివారు వద్ద రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి దూసుకొస్తున్న రైలుకు ఎదురెళ్లాడు. అతడిపై నుంచి రైలు వెళ్లడంతో శరీరం ముక్కలు ముక్కలైంది. సమాచారం కొడుకు ఆత్మహత్య చేసుకున్న కొద్దిసేపటికే తల్లి భానుమతి కూడా ప్రాణాలు విడిచింది.



మర్రి ప్రకాశ్ (ఫైల్)

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	11.0	31.0
రామగుండం	12.4	30.2
హైదరాబాద్	14.8	30.0
వరంగల్	16.0	30.0
నల్లగొండ	16.0	29.4

అండమాన్ సముద్రంలోకి తుఫాన్

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్ పరిసరాల్లో ఆవరించి ఉన్న 'పబాక్' తుఫాన్ శనివారం ఉదయం అండమాన్ సముద్రంలో ప్రవేశించింది. తర్వాత పశ్చిమ వాయవ్యంగా పయనించి సాయంత్రానికి పోర్టు బ్లెయిర్‌కు 550 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది పశ్చిమంగా పయనించి ఆదివారం అండమాన్ దీవుల్లో తీరం దాటుతుందని వాతావరణ శాఖ తెలిపింది.



కాంగ్రెస్‌కు రామ మందిరం ముఖ్యం కాదు

కాంగ్రెస్‌కు రామ మందిరం ప్రాధాన్యమైన అంశం కాదు. రాముడి ఉనికిపై వారికి విశ్వాసం లేదు. ఈ విషయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీయే వెల్లడించారు. రాముడి ఉనికి ఉందని నిరూపించడానికి సాక్ష్యం ఏమీ లేదని, రామ మందిరానికి అంత ప్రాధాన్యం లేదని పేర్కొంటూ గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాయి.

- స్మృతి ఇరానీ, కేంద్ర మంత్రి



రామ మందిరం, ట్రిపుల్ తలాక్‌తో ఎన్డీఏకు నష్టం!

వివాదాస్పద అంశాలైన రామ మందిరం, ట్రిపుల్ తలాక్‌తో ఎన్డీఏ కూటమికి నష్టం జరగవచ్చు. అభివృద్ధే కూటమి లక్ష్యం కావాలి. అభివృద్ధి అజెండాగానే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలి. ఇలా అయితేనే బిహార్‌లో మా కూటమికి 35 కన్నా ఎక్కువ సీట్లు వస్తాయి. అభివృద్ధిపైనే పోరు ఉంటుందని ఆశిస్తున్నా.

- చిరాగ్ పాసవాన్, ఎల్‌జేపీ నేత

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.72.60	పాత ధర 67.88
కొత్త ధర రూ.72.60	కొత్త ధర 67.88

మార్పులేదు



జంక్‌ఫుడ్‌తో మానసిక ఆందోళన!

మాంచెస్టర్, జనవరి 5: మానసిక ఆందోళన లేదా నిరాశకు జంక్‌ఫుడ్ కారణమని తాజా సర్వే పేర్కొంది. మాంచెస్టర్ మెట్రోపాలిటన్స్ బయోసైన్స్ రిసెర్చ్ సెంటర్ ప్రతినిధులు ఈ సర్వే నిర్వహించారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్, మధ్యప్రాచ్యానికి చెందిన 1,01,950 మంది ఆహారపు అలవాట్లను పరిశీలించారు. అధిక కొవ్వు, పిండిపదార్థాలు కలిగిన జంక్‌ఫుడ్ తీసుకోవడంవల్ల మానసిక ఆందోళన చెందుతున్నట్లు తెలుసుకొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై పేరెంట్స్ ఒత్తిళ్ల ప్రభావం

హూస్టన్, జనవరి 5: వృత్తి, ఉద్యోగాల్లో తల్లిదండ్రులు ఒత్తిడికి గురైతే అది వారి పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తాజా సర్వే పేర్కొంది. ఈ విషయంలో పేరెంట్స్ మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది. వృత్తిపరమైన జీవితాన్ని అదుపులో ఉంచుకోగల సమర్థత ఉంటే అది పిల్లల ఆరోగ్యానికి దోహదపడుతుందని ఈ సర్వే నిర్వహించిన యూనివర్సిటీ ఆఫ్ హూస్టన్ ప్రతినిధులు తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కారు యజమానులు, డ్రైవర్లు

కిరాయి చెల్లించరా?

» కోదాడలో కారు డ్రైవర్లు, యజమానుల ధర్నా

కోదాడ రూరల్, జనవరి 5: శాసనసభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న తమకు డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేయడంతో శనివారం కారు డ్రైవర్లు, యజమానులు సూర్యాపేట జిల్లా కోదాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం 13 వాహనాలను 56 రోజుల పాటు కిరాయికి తీసుకున్నారన్నారు. రోజుకు రూ. 1,600 కిరాయి, రూ. 400 బేటా చొప్పున చెల్లించాల్సి ఉండగా, ఇంతవరకు చెల్లించలేదన్నారు. వీడియో, ఫోటోగ్రాఫర్లకు కూడా డబ్బులు చెల్లించలేదని వారు కూడా వీరికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు.

వ్యంగ్యం, విమర్శ కలిస్తేనే కార్టూన్: అల్లం



నర్సింహను సన్మానిస్తున్న అల్లం నారాయణ, పత్రికల ఎడిటర్లు

హైదరాబాద్‌సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒక సమస్యపై స్పందించే పద్ధతుల్లో విమర్శ, వ్యంగ్యం రెండూ కలగలిపి ప్రయోగించే కార్టూన్ విషయంలో నేటి పత్రికలు వెనుకంజ వేస్తున్నాయని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. శనివారం జరిగిన ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు గ్రహీత నర్సింహ అభినందన సభలో ఆయన 'రాజకీయాలు-పత్రికల్లో రాజకీయ కార్టూన్లు' అనే అంశంపై మాట్లాడారు. మామూలు కార్టూన్లకు, రాజకీయ కార్టూన్లకు తేడా ఉంటుందన్నారు. పత్రికల్లో ధైర్యంగా రాజకీయ కార్టూన్లు వేసిన కార్టూనిస్టులు జైలుపాలయిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. నర్సింహ కేవలం కార్టూనిస్టే కాకుండా క్యారికేచర్ ఆర్టిస్టు కావడం గొప్పవిషయమన్నారు. అవార్డు గ్రహీత నర్సింహ మాట్లాడుతూ బాల కార్మికుడిగా జీవితం ప్రారంభించినా..చివరికి కార్టూనిస్టుగా స్థిరపడ్డానన్నారు. కార్టూన్లకు కూడా ప్రాముఖ్యముందని ఈ అవార్డు నిరూపించిందన్నారు. నేటి జర్నలిజంలో కార్టూన్ స్థానం చాలా ముఖ్యమైనదన్నారు. కార్టూన్‌లకు పూర్వవైభవం తీసుకొని రావల్సిందిగా కోరారు. కార్టూనిస్టులు అవుదామనుకునే వారికి సరైన ప్రోత్సాహం లేనికారణంగా తరువాతి తరంలో కార్టూనిస్టులు లేకుండా పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కే.శ్రీనివాసరెడ్డి, కట్టా శేఖర్ రెడ్డి, ఎస్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు

ఆవిష్కరణలు ప్రగతికి దోహదపడాలి

» చెకుముకి సంబరాల్లో ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



వరంగల్ అర్బన్ ఎడ్యుకేషన్, జనవరి 5: శాస్త్ర సాంకేతిక రంగాల ద్వారా జరుగుతున్న నూతన ఆవిష్కరణలు మానవ ప్రగతికి దోహదపడాలని ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలను శనివారం ఆయన వరంగల్ 'నిట్'లో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొన్ని ఆవిష్కరణలు మానవాళి వినాశనానికి దారి తీస్తున్నాయని, ఇలాంటి వాటి పట్ల శాస్త్రవేత్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక శ్రేయస్సును కాంక్షించి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి, సామాజిక అభివృద్ధికి తోడ్పాటు అందించే ఆవిష్కణలు చేయాలని కోరారు.

రాఫెల్.. రూ.30వేల కోట్ల

కుంభకోణం: చాడ

సిరిసిల్ల జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాఫెల్‌లో రూ.30 వేల కోట్ల కుంభకోణం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాఫెల్ డీల్ పార్లమెంట్‌ను కుదుపేస్తోందని, జేపీసీ (జాయింట్ పార్లమెంట్ కమిటీ) వేయడానికి మోదీ ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. రాఫెల్ డీల్‌పై ప్రతిపక్షాల నోరు నొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ రిజర్వేషన్లపై పునరాలోచించాలని సూచించారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

మేడారం/చంద్రుగొండ : అప్పుల బాధతో శనివారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం ఎల్బాకలో సంపత్(37) అప్పులు చేసి వరిపంట సాగు చేయగా పంట దిగుబడి రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం అన్నారం తండాకు చెందిన బాలు(40) అప్పులు చేసి పత్తి, మిరప సాగు చేశాడు. పంటలు దెబ్బతినడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఉరేసుకున్నాడు.

వేంపల్లి వీఆర్వో సస్పెన్షన్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మల్లాపూర్, జనవరి 5: రెవెన్యూ రికార్డులను సరిచేస్తానని డబ్బులు తీసుకుని రైతులకు ప్రామిసరీ నోట్లు రాసిచ్చిన జగిత్యాల జిల్లా వేంపల్లి వీఆర్ఓ ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ శనివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ శరత్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 4న 'లంచానికి ప్రామిసరీ నోట్లు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మెయిన్ పేజీలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మల్లాపూర్ తహసీల్దార్ రమేశ్ వేంపల్లిలో విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక సమర్పించడంతో వీఆర్వోపై చర్య తీసుకున్నారు.

ఎన్‌డీ నేత వీరభద్రం అరెస్టు

» జనశక్తి నక్సలైట్‌కూ అరదండాలు

మహబూబాబాద్ క్రైం / జగిత్యాల, జనవరి 5 : భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల జిల్లాల్లో పోలీసులు శనివారం ఇద్దరు నక్సలైట్లను అరెస్టు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న వర్గం కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సింగనబోయిన వీరభద్రం అలియాస్ రామన్న.. వెన్నారం గ్రామ శివారు చెరువు కట్ట మహబూబాబాద్ పోలీసులకు చిక్కాడు. బయ్యారం మండలం బాలాజీపేటకు చెందిన వీరభద్రం 22 ఏళ్లుగా 4హత్య కేసులు, రెండుసార్లు ఎదురు కాల్పుల్లో పాల్గొన్నాడని జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి విలేకరులకు తెలిపారు. అతని వద్ద నుంచి ఎస్ఎల్ఆర్ ఆయుధం, తూటాలు, లాప్‌టాప్, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే, పిస్టల్ చూపిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న జనశక్తి దళ సభ్యుడు సాయి కుమార్(24) అలియాస్ గణేష్‌ను జగిత్యాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఆయన వద్ద నుంచి పాయింట్ 32 ఎంఎం పిస్టల్‌తో పాటు 19 తూటాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.



ఆర్కే RK

కొత్తపలుకు

ఏపీలో ఏ మాత్రం బలం లేని తెలంగాణ రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి పేరిట చంద్రబాబుపై యుద్ధం చేయడానికి సిద్ధపడుతున్నాయి. రానున్న ఎన్నికలలో చంద్రబాబును ఓడించి జగన్మోహన్‌రెడ్డికి పట్టం కట్టడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలూ పనిచేయడం మొదలుపెట్టాయి. ఈ క్రమంలో జగన్మోహన్‌రెడ్డికి ఆర్థిక సహాయం చేయడంతోపాటు రాజకీయంగా సలహాలు, సూచనలు ఇవ్వడం కూడా మొదలైంది.

ఏపీ వార్‌లో కేసీఆర్, మోదీ!

తెలుగు రాష్ట్రాలలో రాజకీయాలు చిత్ర విచిత్రమైన మలుపులు తీసుకుంటున్నాయి. ప్రధాన ప్రతిపక్షాలు తెర వెనక్కుపోయి సంబంధం లేనివారు తెరపైకి వస్తున్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బద్ధ శత్రువులుగా మారి కత్తులు దూసుకుంటున్నారు. తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నందుకు ప్రతీకారంగా ఏపీలో జరగనున్న ఎన్నికలలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాయత్తం అవుతున్నారు. తెలంగాణలో జరిగిన ఎన్నికలలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ప్రధాన శత్రువుగా ప్రొజెక్ట్ చేసి సెంటిమెంట్ రగిలించడం ద్వారా కేసీఆర్ రాజకీయంగా లబ్ధి పొందారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఆంధ్రావాళ్లు మళ్లీ కబళించబోతున్నారని కేసీఆర్ అండ్ కో చేసిన ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు నమ్మారు. ఫలితంగా ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వచ్చాయి. దీంతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తన దృష్టిని ఇప్పుడు ఏపీ రాజకీయాలపై కేంద్రీకరించారు. ఏపీలో ప్రధాన ప్రతిపక్షం అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమర్థవంతంగా వ్యవహరించడం లేదంటున్న కేసీఆర్, ఇకపై ప్రతిపక్ష పాత్రను తాను పోషిస్తానని చెప్పుకొచ్చారు కూడా! ఏపీలో ఏ మాత్రం బలం లేని తెలంగాణ రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి పేరిట చంద్రబాబుపై యుద్ధం చేయడానికి సిద్ధపడుతున్నాయి. రానున్న ఎన్నికలలో చంద్రబాబును ఓడించి జగన్మోహన్‌రెడ్డికి పట్టం కట్టడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలూ పనిచేయడం మొదలుపెట్టాయి. ఈ క్రమంలో జగన్మోహన్‌రెడ్డికి ఆర్థిక సహాయం చేయడంతోపాటు రాజకీయంగా సలహాలు, సూచనలు ఇవ్వడం కూడా మొదలైంది. నిజానికి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలతో తెలంగాణ రాష్ట్ర సమితికి ఏ మాత్రం సంబంధం ఉండకూడదు. ప్రస్తుత తమ దుస్థితికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా కారణమన్న భావన ఏపీ ప్రజలలో ఉండాలి. అయితే ఏపీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా చంద్రబాబు వ్యతిరేకులకు కేసీఆర్ ఆశాదీపంగా కనిపిస్తున్నారు. చంద్రబాబును అత్యంత దారుణంగా దూషించిన కేసీఆర్ చిత్రపటాలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు కూడా ఏర్పాటుచేయగలిగారంటే ఏపీలో నెలకొన్న పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును దారుణంగా ఓడిస్తామని కేసీఆర్ బాహాటంగానే ప్రకటించారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఏపీకి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, ఎన్నికల తరవాత ఏపీలో మార్పు ఉంటుందనీ, చంద్రబాబును ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనీ చెప్పారు. ఏపీలో చంద్రబాబును ఓడిస్తే కేసీఆర్‌కు, నరేంద్ర మోదీకి ఏమిటి లాభం అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. ఎందుకంటే ఇప్పుడున్న పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదు. అలాగే కేసీఆర్ కూడా ఏపీలో సొంతంగా పోటీ చేయలేరు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో పొత్తు కూడా పెట్టుకోలేరు. అయినా అటు నరేంద్ర మోదీ, ఇటు కేసీఆర్ కూడా ఏపీ రాజకీయాల పట్ల ఎందుకంత ఉత్సాహం చూపిస్తున్నారు? జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే వారికి వచ్చే లాభం ఏమిటి? అనే సందేహాలు తలెత్తవచ్చు గానీ, వారికి స్పష్టమైన లక్ష్యం ఉంది. జాతీయ స్థాయిలో తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలో కూటమి కట్టడానికి ప్రయత్నిస్తున్న చంద్రబాబును దెబ్బకొట్టాలన్న కసితో ప్రధాని మోదీ ఉన్నారు. ఈ కారణంగానే గత ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డి గెలిస్తే ఆంధ్రప్రదేశ్ స్కామాంధ్రప్రదేశ్ అవుతుందని విమర్శించిన మోదీ, రెండు రోజుల క్రితం పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ చంద్రబాబును అవినీతిపరుడిగా చిత్రించడానికి ప్రయత్నించారు. ఈ చర్య ద్వారా చంద్రబాబు కంటే జగన్మోహన్‌రెడ్డి నయం అనే భావన కలిగించడానికి మోదీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. స్థానిక బీజేపీ నాయకులు ఇప్పటికే చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. ప్రజల దృష్టిలో చంద్రబాబును పలుచన చేయడం ద్వారా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించడానికి బీజేపీ కంకణం కట్టుకుంది. ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలిస్తే తమకే మద్దతు ఇస్తుందని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. తనను ఇబ్బందుల పాల్జేసిన కాంగ్రెస్ పార్టీ పట్ల ఆగ్రహంగా ఉన్న జగన్ కూడా బీజేపీకి సన్నిహితంగా మెలుగుతున్నారు. ఇక కేసీఆర్ విషయానికి వస్తే చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే జాతీయ రాజకీయాలలో తనకు పోటీ అవుతారు కనుక జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడానికి ఆయన తన శక్తియుక్తులను అందించడానికి నిర్ణయించుకున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 15 వరకు లోక్‌సభ స్థానాలు లభిస్తే వారు తనతోనే ఉంటారు కనుక ఎన్నికల తర్వాత కేంద్రంలో చక్రం తిప్పవచ్చుననీ, 30 మంది సభ్యుల బలాన్ని చూపించి ఉప ప్రధాని పదవి అందుకోవాలన్నది కేసీఆర్ వ్యూహంగా చెబుతున్నారు. దీన్నిబట్టి అటు మోదీ, ఇటు కేసీఆర్ రాజకీయ ఆకాంక్షలు నెరవేరడానికి ఆంధ్రప్రదేశ్ ఒక ప్రయోగశాల కాబోతున్నదని స్పష్టమవుతోంది. తెలంగాణలో 16 స్థానాలను గెలుచుకున్నా ఆ బలంతో కేసీఆర్ జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయలేరు. కనీసం 30 మంది ఎంపీలు చేతిలో ఉంటే ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వంలో తాను కీలకం కావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. ఈ కారణంగానే చంద్రబాబునాయుడికి తాను ఇవ్వబోయే గిఫ్ట్ అద్భుతంగా ఉండబోతోందని కేసీఆర్ ప్రకటించారు. దీన్నిబట్టి రానున్న ఎన్నికలలో ఏపీలో చంద్రబాబు ఓడిపోతే రాజకీయంగా కేసీఆర్ లాభపడతారన్న మాట! తెలంగాణ ప్రజలు ఆయనకు మళ్లీ అధికారం అప్పగించగా, జాతీయ రాజకీయాలలో కేసీఆర్ ప్రధాన పాత్ర పోషించడానికి ఏపీ ప్రజలు ఇచ్చే తీర్పు కీలకం అవుతుంది. తెలంగాణలో తన ప్రభుత్వం సాధించిన విజయాలకు సంబంధించిన ప్రకటనలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా పత్రికలకు విడుదల చేయడం వెనుక కేసీఆర్ లక్ష్యం ఏమిటో తెలుస్తూనే ఉంది. చంద్రబాబు ప్రభుత్వం కంటే తన ప్రభుత్వం గొప్పగా పనిచేస్తున్నదని ఏపీ ప్రజలు భావించాలన్నది కేసీఆర్ అభిమతంగా కనిపిస్తున్నది. 'ఆంధ్రప్రదేశ్ వార్తలను తెలంగాణలో ప్రచురితమవుతున్న పత్రికలలో ఎందుకు ఇస్తున్నారు? ఆ దరిద్రం మాకు ఎందుకు?' అని విలేకరుల సమావేశంలో ప్రశ్నించిన కేసీఆర్, తన ప్రభుత్వ విజయాలకు సంబంధించిన ప్రకటనలను మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో ప్రచురితం అవుతున్న పత్రికలకు ఇచ్చుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పాత్ర పోషిద్దామనుకుంటున్న కేసీఆర్‌కు అక్కడి దరిద్రం తెలంగాణ నుంచి ప్రచురితమవుతున్న పత్రికలలో ప్రచురితం కాకపోతే ఏపీలో ఏమి జరుగుతుందో ఎలా తెలుస్తుంది? చంద్రబాబును ఓడించాలనుకుంటున్న కేసీఆర్‌కు ఈ పాయింట్ ఎందుకు తట్టలేదో? 'ఆడవారి మాటలకు అర్థాలు వేరులే..' అని ఒక సినీ కవి అన్నారు కానీ.. 'రాజకీయ నాయకుల మాటలకు అర్థాలు వేరులే..' అని మనం ఇప్పుడు సవరించుకోవాలి. ఏపీలో ప్రతిపక్ష పాత్ర పోషించడానికి తాను సిద్ధంగా ఉన్నానని కేసీఆర్ ప్రకటించినందున, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజకీయ ప్రత్యర్థుల సంఖ్య ఊహించినట్టుగానే పెరుగుతోంది. బయటి శక్తుల నుంచి జగన్మోహన్‌రెడ్డికి అయాచితంగా మద్దతు లభిస్తోంది. నరేంద్ర మోదీ, కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి.. అనే ముగ్గురు బలమైన ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే సవాళ్లను చంద్రబాబు ఎదుర్కోవలసి ఉంటుంది. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలన్న కేసీఆర్, మోదీ కోర్కెను ఆంధ్రప్రదేశ్ ప్రజలు తీరుస్తారా? లేదా? అన్నది ఎన్నికల తరువాత తేలుతుంది. అయితే అప్పటివరకు ఏపీ రాజకీయాలను అటు మోదీ, ఇటు కేసీఆర్ ప్రభావితం చేస్తూనే ఉంటారు.

ఇంగితం ఉండాల్సింది ఎవరికి?

ఇక గతవారం విలేకరుల సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి వాడిన భాష, చేసిన హెచ్చరికలు అత్యంత అభ్యంతరకరంగా ఉన్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తనను ఓడించడానికి ప్రయత్నించారన్న ఉద్దేశంతో చంద్రబాబుపై కేసీఆర్ తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. కేసీఆర్‌కు అనుగ్రహం వచ్చినా, ఆగ్రహం వచ్చినా పట్టుకోవడం కష్టం. తన రాజకీయ ప్రత్యర్థులను దూషణ భూషణలతో సత్కరించడం కేసీఆర్‌కు అలవాటే! అయితే ఈ పర్యాయం ఆయన వాడిన భాష శ్రుతి మించింది. చంద్రబాబుపై ఆయనకు ఎంత కోపం ఉందో ఆయన వాడిన భాషను బట్టి అర్థమవుతోంది. తమ ముఖ్యమంత్రిని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నోటికొచ్చినట్టు తిట్టడాన్ని ఆంధ్రప్రదేశ్‌లో మెజారిటీ ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నుంచి మాత్రం కేసీఆర్‌కు మద్దతు లభించింది. జగన్మోహన్‌రెడ్డి సొంత మీడియా కూడా కేసీఆర్‌కు అండగా నిలబడింది. కేసీఆర్ స్థానంలో చంద్రబాబు ఉండి, కేసీఆర్‌ను అంతలా దూషించి ఉంటే తెలంగాణ సమాజం ఒక్కటిగా నిలిచేది. చంద్రబాబును తెలంగాణ ప్రజలు చీల్చి చెండాడేవారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో నెలకొన్న వైషమ్యాలు, కుల పోరాటాల కారణంగా అంతగా తిట్టినా కేసీఆర్‌కు ఒక వర్గం మద్దతు లభించింది. పనిలో పనిగా మీడియాను కూడా కేసీఆర్ టార్గెట్ చేసుకున్నారు. రాజశేఖర్‌రెడ్డి తరహాలో 'ఆ రెండు పత్రికలు' అంటూ నిందించడం మొదలుపెట్టారు. ఇటు మీడియాను, అటు ప్రశ్నించే గొంతుకలను అణచివేయడమనే క్రీడను తెలంగాణ ఉద్యమ సమయం నుంచీ కేసీఆర్ అండ్ కో ఆచరిస్తూ వస్తోంది. ఉద్యమ సమయంలో వ్యవహరించినట్టుగానే రెండో పర్యాయం ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా కేసీఆర్ అదే ధోరణిని అనుసరించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రతిపక్షాలకు సంబంధించిన వార్తలేవీ పత్రికలలో రాకూడదని కేసీఆర్ కోరుకుంటున్నారు. అన్ని పత్రికలు తన సొంత పత్రిక నమస్తే తెలంగాణను అనుసరించాలని ఆయన భావిస్తుంటారు. ముఖ్యమంత్రిగా కూడా ఆయన అలాగే వ్యవహరించడం దురదృష్టమనే చెప్పాలి. తాజాగా జరిగిన ఎన్నికలలో టీఆర్ఎస్ ప్రభంజనం వీచినా కేసీఆర్‌కు వ్యతిరేకంగా 53 శాతం మంది ఓటర్లు నిలబడ్డారు. అలాంటప్పుడు ఆ ఓటర్ల మనోభావాలకు మీడియాలో ప్రాతినిధ్యం ఉండొద్దంటే ఎలా? నాయకులు వాడే భాషను యథాతథంగా ప్రచురించడానికి మీడియాకు ఇంగితం ఉండాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆ మధ్య విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. మీడియాకు ఇంగితం ఉందా? లేదా? అన్న విషయం తర్వాత చూద్దాం. అత్యంత అభ్యంతరకర భాష వాడుతున్న నాయకుల సంగతి ఏమిటి? నిన్నగాక మొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ వాడిన భాష పట్ల సభ్య సమాజం నుంచి అభ్యంతరాలు వ్యక్తంకాలేదా? విలేకరుల సమావేశాలను ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్న ఈ రోజుల్లో దేన్నీ దాచలేం. మీడియాకు ఇంగితం ఉండాలని కోరుకుంటున్న కేటీఆర్... తన తండ్రి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆ ముక్క చెప్పగలరా? నిజానికి తెలంగాణలో దాదాపుగా మీడియా అంతా అధికార పార్టీకి అనుకూలంగానే వ్యవహరిస్తూ వస్తోంది. అయినా అది మాత్రమే చాలదు.. బానిసలుగా ఉండాలని అధికార పార్టీ కోరుకుంటున్నట్టు ఉంది. తెలంగాణలో ఇవ్వాళ కేసీఆర్, కేటీఆర్‌లు తిరుగులేని శక్తులుగా అవతరించి ఉండవచ్చు. అంత మాత్రాన అన్ని వ్యవస్థలూ సాగిలపడాలనుకోవడం సమర్థనీయం కాదు. నేను గతంలో ఇదే కాలమ్‌లో రాసినట్టుగా తెలంగాణలో మీడియా ఒత్తిడిలో పనిచేస్తోంది. ఇకపై ఈ ఒత్తిడి మరింత పెరగవచ్చు. 'పవర్ టెండ్స్ టు కరెప్ట్.. అబ్జల్యూట్ పవర్ కరెప్ట్స్ అబ్జల్యూట్‌లీ' అన్నట్టుగా పరిస్థితి మారకూడదని కోరుకుందాం! తెలంగాణలో ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశ్నించేవారే లేరు. ఎన్నికల ఫలితాలు వెల్లడై నెల రోజులు కావస్తున్నా శాసనసభ ఏర్పాటు కాలేదు. పూర్తి మంత్రివర్గం ఏర్పాటు కాలేదు. అయినా ఇదేమిటని ప్రశ్నించేవారే లేరు. గతంలో ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 31 మంది మంత్రులను తొలగించిన తర్వాత మూడు రోజులపాటు ముఖ్యమంత్రిగా తాను ఒక్కరే ఉన్నారు. దీంతో అప్పట్లో ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మంత్రులను తొలగించిన తర్వాత నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొనడానికి ఉత్తరప్రదేశ్ వెళ్లి ఢిల్లీ తిరిగివచ్చిన ఎన్‌టీఆర్‌పై మంత్రివర్గం లేకుండా ఏమిటంటూ విలేకరులు ప్రశ్నల వర్షం కురిపించారు. రాజ్యాంగంలో మంత్రిమండలి అని పేర్కొన్నారనీ, ముఖ్యమంత్రి ఒక్కరే ఉంటే అది మంత్రిమండలి ఎలా అవుతుందనీ న్యాయ నిపుణులు చర్చకు తెర తీశారు. కేవలం మూడు రోజులపాటు మంత్రులు లేనందుకే అప్పుడు అంత చర్చ జరిగింది. ఇప్పుడు 25 రోజులుగా ఆ ఇద్దరు తప్ప మంత్రిమండలి లేదు. అదేమిటని ప్రశ్నించే సాహసం తెలంగాణలో మీడియాకు కూడా లేదు. ఫలితాలు వెల్లడై ఇన్ని రోజులు అవుతున్నా శాసనసభను ఎందుకు ఏర్పాటు చేయలేదో ఎవరికీ తెలియదు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకోవడానికి వీలుగా శాసనసభను ఏర్పాటు చేయలేదని చెబుతున్నారు. అయితే ఈ వాదనలో హేతుబద్ధత లేదు. కొత్తగా ఎన్నికైన వారు శాసనసభ్యులుగా మాత్రమే ప్రమాణ స్వీకారం చేస్తారు గానీ ఫలానా పార్టీ తరఫున అని ప్రమాణ స్వీకారం చేయరు. ఎవరు ఏ పార్టీ తరఫున ఎన్నికైనదీ బీఫారాల ఆధారంగా రిటర్నింగ్ అధికారులు సర్టిఫై చేస్తారు. ఆ సర్టిఫికెట్లలో ఫలానా వారు ఫలానా పార్టీ తరఫున ఎన్నికయ్యారని ఉంటుంది. దీన్నిబట్టి శాసనసభను ఏర్పాటుచేయకపోవడానికి ఇంకేదో కారణం ఉండి ఉండాలి. అది కేసీఆర్ చెప్పరు.. ఎవ్వరూ అడగలేరు! కేసీఆర్ వేసే ప్రతి అడుగులోనూ రాజకీయం ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు ఇటీవల వెళ్లిన కేసీఆర్, అక్కడ పనులు వేగంగా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే ఆయన వ్యక్తంచేసిన ఆగ్రహం వెనుక వేరే కారణం ఉందని అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు. నిజానికి ప్రాజెక్ట్ పనులు వేగంగానే జరుగుతున్నాయనీ, అయితే నిన్నటి వరకు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఫెయిల్ అయ్యారని చెప్పడానికే కేసీఆర్ ప్రాజెక్టుల సందర్శన ఎంచుకున్నారనీ చెబుతున్నారు. ఇదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు వరకు హరీశ్‌రావును సందర్భం వచ్చినప్పుడల్లా ఆకాశానికి ఎత్తేవారు. అంతఃపుర రాజకీయాల కారణంగా ఇప్పుడు హరీశ్‌రావు పరిస్థితి కంటే సాధారణ ఎమ్మెల్యేల పరిస్థితి మెరుగ్గా ఉంది. వారు ప్రగతిభవన్‌లో తిరగగలుగుతున్నారు.

నోరు జారితే...

ఇక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా చోటుచేసుకున్న సన్నివేశాలు ప్రధాని నరేంద్ర మోదీ ఔన్నత్యాన్ని తగ్గించేవిగా ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి సోము వీర్రాజు అనే నాయకుడు 'లుచ్చా' అని దూషించినప్పుడు నరేంద్ర మోదీ చిరునవ్వులు చిందించడం రోతగా ఉంది. నరేంద్ర మోదీ ఇప్పుడు దేశ ప్రధాని. ఆ పదవికి తగ్గట్టుగా ఆయన హుందాతనాన్ని ప్రదర్శించాలి. తన సమక్షంలో తన పార్టీ నాయకుడు ఒక ముఖ్యమంత్రిని 'లుచ్చా' అనడాన్ని మోదీ ఆక్షేపించి ఉండవలసింది. అలా చేసి ఉంటే ఏపీ ప్రజలలో ఆయనపై ఎంతో కొంత గౌరవం పెరిగేది. అలా కాకుండా చిరునవ్వులు చిందించడాన్ని చూసినవారు ముక్కున వేలేసుకుంటున్నారు. చంద్రబాబుపై మోదీకి ఎంత కోపం ఉన్నప్పటికీ ఆయనొక ప్రధానమంత్రి! ఆ పదవిలో ఉన్నవారు ఎలా వ్యవహరించాలో అలాగే వ్యవహరించడం ప్రధానమంత్రి పదవికి వన్నె తెస్తుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాఫెల్ వ్యవహారంలో ప్రధాని మోదీని 'చోర్' అనడాన్ని బీజేపీ నాయకులు తప్పుబడుతున్నారు. నిజమే ప్రధానమంత్రిని పట్టుకుని 'చోర్' అని అనడం సమర్థనీయం కాదు. అలాగే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని 'లుచ్చా' అని అనడం కూడా సమర్థనీయం కాదు. ఎన్నికలలో గెలుపు వల్లనే గౌరవం రాదు. అత్యున్నత పదవులు అలంకరించిన వారి వ్యవహార శైలిని బట్టి ప్రజల్లో వారిపట్ల గౌరవం ఏర్పడుతుంది. 'కాలు జారితే వెనక్కి తీసుకోవచ్చు గానీ.. నోరు జారితే వెనక్కి తీసుకోలేం' అన్న సూక్తిని నాయకులు గుర్తుంచుకోవడం మంచిది. ఇటు ముఖ్యమంత్రి కేసీఆర్ అయినా అటు ప్రధాని నరేంద్ర మోదీ అయినా హుందాతనాన్ని అలవరుచుకుంటే వారికే గౌరవం పెరుగుతుంది. ఈ ఇరువురికీ చంద్రబాబు శత్రువు కావచ్చు గాక.. అలా అని సభ్య సమాజం హర్షించని భాషను, పదాలను వాడటం, వాడే వారిని కట్టడి చేయకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. రాజకీయ వ్యూహ–ప్రతివ్యూహాలతో ప్రత్యర్థులను చిత్తుచేయాలని ఆలోచించాలే గానీ, తిట్లు, శాపనార్థాలతో కాదని కేసీఆర్, నరేంద్ర మోదీకి ఎవరో చెప్పాల్సిన అవసరం ఏర్పడకూడదు!



> **తెలంగాణలో దాదాపుగా మీడియా అంతా అధికార పార్టీకి అనుకూలంగానే వ్యవహరిస్తూ వస్తోంది. అయినా అది మాత్రమే చాలదు.. బానిసలుగా ఉండాలని అధికార పార్టీ కోరుకుంటున్నట్టు ఉంది. తెలంగాణలో ఇవ్వాళ కేసీఆర్, కేటీఆర్‌లు తిరుగులేని శక్తులుగా అవతరించి ఉండవచ్చు. అంత మాత్రాన అన్ని వ్యవస్థలూ సాగిలపడాలనుకోవడం సమర్థనీయం కాదు. నేను గతంలో ఇదే కాలమ్‌లో రాసినట్టుగా తెలంగాణలో మీడియా ఒత్తిడిలో పనిచేస్తోంది. ఇకపై ఈ ఒత్తిడి మరింత పెరగవచ్చు.**

> **'ఆంధ్రప్రదేశ్ వార్తలను తెలంగాణలో ప్రచురితమవుతున్న పత్రికలలో ఎందుకు ఇస్తున్నారు? ఆ దరిద్రం మాకు ఎందుకు?' అని విలేకరుల సమావేశంలో ప్రశ్నించిన కేసీఆర్, తన ప్రభుత్వ విజయాలకు సంబంధించిన ప్రకటనలను మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో ప్రచురితం అవుతున్న పత్రికలకు ఇచ్చుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పాత్ర పోషిద్దామనుకుంటున్న కేసీఆర్‌కు అక్కడి దరిద్రం తెలంగాణ నుంచి ప్రచురితమవుతున్న పత్రికలలో ప్రచురితం కాకపోతే ఏపీలో ఏమి జరుగుతుందో ఎలా తెలుస్తుంది? చంద్రబాబును ఓడించాలనుకుంటున్న కేసీఆర్‌కు ఈ పాయింట్ ఎందుకు తట్టలేదో?**

> **చంద్రబాబుపై మోదీకి ఎంత కోపం ఉన్నప్పటికీ ఆయనొక ప్రధానమంత్రి! ఆ పదవిలో ఉన్నవారు ఎలా వ్యవహరించాలో అలాగే వ్యవహరించడం ప్రధానమంత్రి పదవికి వన్నె తెస్తుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాఫెల్ వ్యవహారంలో ప్రధాని మోదీని 'చోర్' అనడాన్ని బీజేపీ నాయకులు తప్పుబడుతున్నారు. నిజమే ప్రధానమంత్రిని పట్టుకుని 'చోర్' అని అనడం సమర్థనీయం కాదు. అలాగే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని 'లుచ్చా' అని అనడం కూడా సమర్థనీయం కాదు.**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

సుహృద్భావం సాధ్యం కాదా?

శబరిమల దేవాలయంలో మహిళా ప్రవేశం అనంతరం జరుగుతున్న ఆందోళనలు, దాడులు, ఆస్తినష్టాలు బాధాకరం. మతరాజకీయాల ఉప్పెనలో ప్రజాజీవనం అల్లకల్లోలంగా మారడం, సమస్యని పరిష్కరించడం కన్నా అందులోనే వీలైనంత స్వప్రయోజనాల్ని పిండుకోవాలని బాధ్యులు తలపోయడం పరిస్థితిని దిగజారుస్తోంది. మన రాజ్యాంగం ప్రకారం దేశం లౌకిక రాజ్యం. అన్ని మతాల్ని సమానంగా చూడడం, గౌరవించడం రాజ్యాంగ స్ఫూర్తి మాత్రమే కాకుండా భారత జాతి లక్షణం. అందుకనే ఎన్నో విభిన్న సంప్రదాయాల్ని ఇముడ్చుకొంటూ దేశం సజీవ సంస్కృతీ నదిలా నాగరికతతో ముందుకుపోతోంది. ఆచారాలు తగనివి అనుకొంటే వదిలించుకొని, ప్రగతిశీలం అనుకొంటే కౌగలించుకొని చైతన్య భారతిగా కొనసాగడమే ఆధునిక లక్షణం. అయితే ప్రజాబాహుళ్యంలో ఆ లక్షణాలకు కొదవలేకపోయినా, వాటిని పూర్వపక్షం చేసే కొద్ది మంది అవలక్షణాలతో సామాజిక వాతావరణం కలుషితమౌతోంది. శబరిమల అంశం కేవలం భక్తులకే చెందినదైతే సమస్యగానే ఉండేది కాదు. ఆ ఆలయంలో పది నుండి యాభై సంవత్సరాల వయస్సు మహిళల ప్రవేశం నిషిద్ధం. ఎవరికీ ఏ హానీ చెయ్యని ఆ ఆచారాన్ని ఒక ఆలయానికి సంబంధించిన ఆచారంగా మాత్రమే చూస్తే బాగుండేది. అది హక్కుల సమస్యగా, వివక్ష సమస్యగా గుర్తించడంతో కథ మారింది. ఏ రకమైన వివక్ష అయినా రాజ్యాంగ వ్యతిరేకం కాబట్టి మహిళలు ఆ గుడిలో ప్రవేశించవచ్చు అని ధర్మాసనం తీర్పు చెప్పింది. రాజ్యాంగ బద్ధం అయిన పౌరుల చర్యలకు మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది కనుక అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు మహిళల అభీష్టం మేరకు ఆలయప్రవేశానికి రక్షణ కల్పిస్తూ అండగా నిల్చింది. ఎన్నో ఏళ్ల ఆచారం మంటగలిసిందంటూ అక్కడ పూజారి శుద్ధి చేశాడు తాను నమ్మిన ఆచారం మేరకు. ఆ మహిళల ఆలయ ప్రవేశంతో ఎంత వివక్ష రూపుమాపబడిందో వీరూ చెప్పలేరు, లేక ఆలయం ఎలా మాలిన్యమైందో వారూ చెప్పలేరు. ఒక వర్గం వివక్ష కోణంలో, మరో వర్గం మత రక్ష కోణంలో వీక్షిస్తున్నప్పుడు ఎవరికి వారే సబబు అనుకొంటారు. వీటిని మించి ఆలోచించే అవకాశం, అందుకు తగ్గ వాతావరణం మృగ్యమౌతున్నాయి. అక్షరాస్యతలో, అభివృద్ధిలో ముందుండే ఆధునిక రాష్ట్రంలోనే సరైన చర్చలకు, సుహృద్భావ పరిష్కారాలకు అవకాశాలు సన్నగిల్లుతుంటే మిగతా రాష్ట్రాల గురించి మాట్లాడనక్కరలేదు. భావోద్వేగాలు పెరిగిన చోట సమస్యలు పెరగడమే తప్ప తగ్గడం ఉండదు. ప్రభుత్వం, పౌరసమాజం, మీడియా, రాజకీయ పక్షాలు రేగిన మంటల్ని ఆర్పివేయడానికి కృషి చెయ్యాలి.

– డా.డి.వి.జి.శంకరరావు



ఆధ్యాత్మికం అవసరమా?

ప్రతిరోజు ఆధ్యాత్మికం పేరుతో స్వాములు బాబాల అత్యాచారాలు, స్వస్థతకుటములపేరుతో మహిళలను లొంగదీసుకోవటం చూస్తున్నాం. కిడ్నాప్‌లకు నిలయాలౌతున్న గుళ్లు, అత్యాచారాలకు కేంద్రాలవుతున్న ఆశ్రమాల గురించి వింటున్నాం. ఇకనయినా ఈ దేవుళ్ల దెయ్యాలు, ఆశ్రమాలు, గుళ్లు, బాబాలు, పాస్టర్లు, ఆధ్యాత్మికం అవసరమా? అలోచించండి. ఇందిరాగాంధీ ఒక పారసీకుణ్ణి పెళ్లిచేసుకుందన్న కారణంతో పూరి దేవాలయంలోకి రానివ్వలేదు. తనభక్తిగీతాలతో అయ్యప్పకి ఎంతోపేరు సంపాదించిన జేసుదాసుకి అయ్యప్ప గుడిలోకి ప్రవేశంలేదు. ఈరోజు సాక్షాత్తు సుప్రీంకోర్టు తీర్పుకు గతిలేని పరిస్థితి ఏర్పడింది. గుడిలోకి ఏ వయసు మహిళలైనా ప్రవేశించవచ్చని సుప్రీంకోర్టు చెప్పినా కూడా దాన్ని రాజకీయం చేసి బిజెపి వాళ్ళు అడ్డుకుంటున్నారు. రేపు అయోధ్య విషయంలో కూడా మాకు అనుకూలంగా తీర్పు లేకపోతే ఇలాగే అడ్డుకుంటామనే ఒక బెదిరింపు ఇందులో ఉంది. రాజ్యాంగంలో రాసుకున్న లౌకికవాదమంటే ఏమిటో కూడా తెలియని స్థితిలో మననాయకులున్నారు. లౌకికవాదమంటే రాజ్యపాలనలో ఎక్కడా మతం జోక్యం వుండరాదు. అందుకు ప్రభుత్వధనం వాడరాదు.మతం ,దేవుడు వ్యక్తిగతంగానే ఉండాలి. కానీ నేడు అందుకు పూర్తి భిన్నంగా జరుగుతున్నది. ఈస్థితిని మార్చాలి. దేశంలోని అభ్యుదయవాదులందరూ దేశాన్ని సాంస్కృతికోద్యమం వైపు తీసుకెళ్ళాల్సిన అవసరమెంతైనా వుంది.

– నార్నె వెంకటసుబ్బయ్య

సామ్యవాదులూ... ఏం సాధించారు?

హిందువుల మనోభావాలను గాయపరచటం ద్వారా ఈ దేశంలో సామ్యవాదులు ఏం సాధించదలచుకున్నారో అర్థం కావటంలేదు. శబరిమల ఆలయంలోకి మధ్యవయస్కులైన స్త్రీలను 'మందబలం'తో బలవంతంగా పంపించడం ద్వారా దేశవ్యాప్తంగా హిందువులకు శాశ్వతంగా దూరమయ్యారు. లౌకికవాదం ముసుగులో దేశంలో వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలు ముస్లిం, క్రిష్టియన్ సంతుష్టీకరణ విధానాలతో హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నాయి. హిందూ ధర్మానికి తీరని ద్రోహం చేస్తున్నారు. మీ స్త్రీపురుష సమానత్వాన్ని ముస్లిం మతంపై ఎందుకు చూపలేకపోతున్నారు? మసీదుల్లోకి స్త్రీల ప్రవేశంపై, ముస్లిం మతాధికారులుగా స్త్రీల నియామకంపై ఎందుకు పోరాటాలు చేయటంలేదు? తలాక్... తలాక్... తలాక్ హక్కు ముస్లిమ్ స్త్రీలకు కూడా కల్పించాలని ఎందుకు డిమాండ్ చెయ్యలేకపోతున్నారు? మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ సమానంగా న్యాయం చేయగలిగే 'ఉమ్మడి పౌర న్యాయ చట్టం' కోసం ఎందుకు డిమాండ్ చెయ్యలేకపోతున్నారు ? మీ సమానత్వం నిజం కాదు. కేవలం హిందూ, జాతీయ వాదాన్ని విచ్ఛిన్నం చేయటం మాత్రమే మీ లక్ష్యం. అందుకే మీరు దాదాపు శాశ్వతంగా హిందువులను దూరం చేసుకున్నారు. ఇట్లాంటి మీరు రేపు ఎన్నికలలో ఏ మొహం పెట్టుకొని ఓట్ల కోసం మా గడపలు తొక్కుతారు? మాలో ఐక్యత లేకపోయినా 'ఆత్మాభిమానం' ఉందన్న సంగతి విస్మరించకండి.

– వీరుభొట్ల పేరయ్యశాస్త్రి

విద్యాలయాల్లో లైంగిక విద్య

గతంలో యు.పి.ఎ. ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యాలయాల్లో లైంగిక విద్యని బోధించాలని రాష్ట్రాలకి సూచించినప్పుడు ఆ ప్రతిపాదనని పదమూడు రాష్ట్రాలు తిరస్కరిస్తూ పాఠశాలల్లో లైంగిక విద్యని బోధించడం మన దేశ సాంప్రదాయాలకు వ్యతిరేకమని వాదించాయి. గత పదేళ్ళలో దేశంలో పలు మార్పులొచ్చాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంటర్‌నెట్ గ్రామాలకు సైతం విస్తరించింది. స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరిగింది. నీలి చిత్రాలు, అశ్లీల సాహిత్యం విద్యార్థులకు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో పిల్లలు తీవ్ర భావోద్వేగాలకు లోనై, లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతున్నది. మరోకపక్క యువతరంలో సుఖ వ్యాధుల గురించి అవగాహన ఉండటం లేదు. లైంగిక విద్య బోధించడమంటే లైంగికచర్యలని ప్రోత్సహించడమని కాదు. లైంగిక బోధనలో భాగంగా పెరుగుతున్న జనాభా, లింగ వివక్షత, లైంగికావయవాల పట్ల జాగ్రత్తలని బోధించాలి. బోధకులు తాము వాడే భాషలో జాగ్రత్తలు తీసుకోవాలి. బోధనని స్థానిక పరిస్థితులని దృష్టిలో ఉంచుకొని చేయాలి. తద్వారా బాల్యంలో ఎదురయ్యే లైంగికపరమైన ఇబ్బందులని, అపోహలను విద్యార్థులు కొంతమేరకు అధిగమించ గలుగుతారు.

– యం. రాంప్రదీప్

వాహన వేగానికి బ్రేక్!



ఇంటికి తొందరగా చేరాలన్న ఆతృతో, అవతలి వారి నిర్లక్ష్యమో కొన్ని జీవితాలను అకస్మాత్తుగా బలి తీసుకుంటుంది. గడప దాటి మళ్ళీ గడప చేరుకునే లోపు ప్రాణాలు పోతున్నాయి. వేగ నియంత్రణ లేక రహదారులు చావుకు మార్గాలై కడుపుకోత మిగిలిస్తున్నాయి. సీటు బెల్టు, హెల్మెట్, నెంబర్ ప్లేటు లాంటి నిబంధనలకన్నా అతి ముఖ్యమైనది వేగాన్ని నియంత్రించడం. ట్రాఫిక్ నిబంధనలు ఎన్ని ఉన్నా వాటిని పాటించే పరిస్థితి ఎలాగూ లేదు కనుక వాహనాల వేగాన్ని పరిమితం చేయడం ఒక్కటే మార్గం. ఏ వాహనానికైనా 80 నుండి 100 కి.మీ. మధ్య వేగం బిగిస్తే ఎన్నో ప్రమాదాలను అరికట్టవచ్చు. అభివృద్ధి నాణానికి బొమ్మా, బొరుసూ ఉంటాయి. శాస్త్ర సాంకేతికతలో మనం ఎంత ముందుకు దూసుకు వెళ్తున్నా వాటి వల్ల ప్రమాదం కూడా అంతే ఉంది. వాటిని ప్రమాద రహితంగా, అందరికీ శ్రేయస్సును కల్గించే విధంగా మార్చుకోవాలి. ప్రభుత్వం వాహనాల వేగాన్ని నియంత్రిస్తే బతికే కాలాన్ని బతికించవచ్చు, పారే దుఃఖాన్ని అరికట్టవచ్చు.

– పుట్టి గిరిధర్

ఎస్సీ పరిశోధకులకు అన్యాయం

సామాన్య, గ్రామీణ ప్రాంత విద్యార్థులను పరిశోధనపరంగా ప్రోత్సహించాల్సిన కేంద్రప్రభుత్వం, యూజీసీ నూతన నిబంధనలతో వారిని దూరం చేసే ప్రయత్నం చేస్తోంది. ప్రతి సంవత్సరం ఫెలోషిప్ లను సకాలంలో విడుదల చేయాల్సిన బాధ్యతను మరిచిన యూజీసీ, నూతన నిబంధనలతో మూడు విద్యా సంవత్సరాల నుండి ఫెలోషిప్‌ను విడుదల చేయడం లేదు. నిన్న షెడ్యూల్ కులాల విద్యార్థుల ఫెలోషిప్‌ల మార్గదర్శకాలను యూజీసీ విడుదల చేస్తూ ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే విద్యార్థులకు నెట్ తప్పనిసరనే నిబంధన పెట్టింది. బీసీ, ఎస్టీ విద్యార్థులకు ఈ నిబంధన లేదు. కేవలం ఎస్సీ విద్యార్థులకు మాత్రమే ఈ నిబంధన. యూజీసీ మూడేళ్ళుగా ఫెలోషిప్ విడుదల చేయకపోవడం ద్వారా 6000 స్లాట్స్ ను ఎస్సీ విద్యార్థులు నష్టపోవడం జరిగింది. ఈ విద్యా సంవత్సరంలో అయినా గతంతో కలిపి 8000 స్లాట్స్ విడుదల చేస్తారని ఆశిస్తున్న తరుణంలో, దానికి విరుద్ధంగా ఎస్సీ విద్యార్థులకు నెట్ తప్పనిసరి చేయడం సామాన్య దళిత విద్యార్థులు పరిశోధనకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. 2021 నుండి వర్శిటీలలో అధ్యాపకుల నియామకానికి నెట్ తప్పనిసరి అని దూరదృష్టితో ఇప్పుడే ప్రకటించిన యూజీసీ ఎస్సీ విద్యార్థులపై నూతన నిబంధనలను ఇప్పటికిప్పుడే అమల్లోకి తేవాల్సిన అవసరం ఏముందో చెప్పాలి

– చింత ఎల్లస్వామి

గ్రూప్ 1 నోటిఫికేషన్ ఏదీ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 5 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇంకా గ్రూప్ 1 నోటిఫికేషన్ ప్రకటించలేదు. ఉన్నతాధికారులం కావాలన్న నిరుద్యోగుల ఆశలు అడియాసలవుతున్నాయి. 2011నుంచి తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ 1 ఉద్యోగాల నోటిఫికేషన్ లేదు. కొత్త జోనల్ వ్యవస్థ కారణంగా ఇవ్వలేని పరిస్థితులున్నాయని ఎన్నికల ముందు చెప్పారు కానీ ఇప్పుడు ఎన్నికలు పూర్తి అయ్యి నెల కావొస్తున్నది. గత ఆరు నెలల నుంచి గ్రూప్ 1 ప్రకటన త్వరలో వస్తుందన్న వార్తలు చూడటమే కానీ ప్రకటన వెలువడలేదు. గత ఐదేళ్ళలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండుసార్లు గ్రూప్ 1, గ్రూప్ 2 ప్రకటనలు జారీ చేసింది. మన రాష్ట్రంలో ఈ ప్రకటన లేకపోయినందున ఏంతో మంది నిరుద్యోగులు వయసు సడలింపు అర్హతను కోల్పోతున్నారు. ప్రభుత్వం ఇకనైనా గ్రూప్ 1 నోటిఫికేషన్ ప్రకటించి నిరుద్యోగులకు మేలు చెయ్యాలి.

– కె. శేఖర్ బాబు

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

▸ తొలిసారి ఆన్‌లైన్ విధానంలో పరీక్ష

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ ప్రవేశాలకుగానూ జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రారంభం కానుంది. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో ఈ నెల 20 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధుమేహంతో బాధపడేవారు ట్యాబ్లెట్లు, పండ్లు, వాటర్ బాటిల్ తీసుకెళ్లేందుకు అనుమతివ్వనున్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్

రూపాయికే నల్లా కనెక్షన్: వాటర్ బోర్డు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్ వాటర్ ప్రాజెక్టులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు పరిధి లోపల ఉన్న బీపీఎల్ కుటుంబాలకు రూపాయికే నల్లా కనెక్షన్ ఇవ్వనున్నట్లు వాటర్‌బోర్డు ఎండీ ఎం.దానకిశోర్ తెలిపారు. ఖైరతాబాద్ వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ గ్రామాల్లో బీపీఎల్, నాన్ బీపీఎల్ నల్లా కనెక్షన్లను గుర్తించాలని ఆదేశించారు. విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు, అప్రూవుడ్ లేఅవుట్లకు మంచినీరు అందించేందుకు సర్వే చేపట్టి వారం లోగా నివేదిక సమర్పించాలని సూచించారు.

● విదేశాలకు తెలంగాణ కూరగాయలు, పండ్లు

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండించిన కూరగాయలు, పండ్లను త్వరలో ఇతర దేశాలకు ఎగుమతి చేస్తామని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి ప్రకటించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో శనివారం సమావేశంజరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మామిడి పండ్లను.. ప్లాంట్ కోరంటీన్ ధ్రువీకరణ ద్వారా ఎగుమతి చేయాలని నిర్ణయించామని పార్థసారథి తెలిపారు. ఇక పండ్లు, కూరగాయలు, పూలు ఎగుమతికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ అవసరమని అధికారులు గుర్తుచేయగా.. నిబంధనలు రూపొందించాలన్నారు.

● ఫిబ్రవరి 20న ఎమ్మెల్సీ తుది ఓటరు జాబితా

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 20న ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెలాఖరు వరకు అభ్యంతరాలు/ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 15కి వీటిని పరిష్కరించి 20న తుది జాబితా ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) రజత్‌కుమార్ శనివారం ప్రకటన విడుదల చేశారు.



సీఎస్ ఎస్.కె.జోషికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌జీవో నేతలు

● సమస్యలు పరిష్కరించండి: టీఎన్‌జీవో

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కార ఏడాదిగా 2019 ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషిని టీఎన్‌జీవో నేతలు కోరారు. టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారెం రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షుడు రేచల్, శ్రీనివాస్, రాజేందర్ ఆధ్వర్యంలో వీరు.. సీఎస్‌ను సచివాలయంలో శనివారం కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఎన్‌జీవో కార్యాలయంలో టీఎన్‌జీవో నేతలు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు డిమాండ్‌తో ఈ నెల 8, 9 తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేస్తామన్నారు.

● మే 5న వెటర్నరీ 'నీట్' పరీక్ష

బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు మే 5న నీట్(యూజీ-2019) పరీక్ష జరుగుతుందని ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో అర్హత సాధించే వారికి దేశవ్యాప్తంగా ప్రముఖ కళాశాలల్లోని బీవీఎస్సీ సీట్లలో 15% కేటాయిస్తారని తెలిపారు.

● అడవుల్లో కార్చిచ్చు నియంత్రణపై అవగాహన



శిక్షణ పొందుతున్న సిబ్బంది

హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ సంవత్సరంగా 2019ని పాటించాలని రాష్ట్ర అటవీశాఖ నిర్ణయించింది. కార్చిచ్చు చెలరేగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్ శివారులోని దూలపల్లి అటవీ శిక్షణ కేంద్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సిబ్బందికి రెండురోజులు శిక్షణ ఇచ్చారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు పసిగట్టి సిబ్బందికి సమాచారం చేరవేసేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో అటవీశాఖ ఒప్పందం కుదుర్చుకుందని సీపీపీఎఫ్ రఘువీర్ తెలిపారు.

● తాజా మాజీ మంత్రులకు భద్రత తొలగింపు

తాజా మాజీ మంత్రులందరికీ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారులు మంత్రి స్థాయి భద్రతను తొలగించారు. మంత్రులుగా పనిచేసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారికి ఎమ్మెల్యే స్థాయి భద్రతను మాత్రమే కొనసాగిస్తున్నారు. మంత్రులుగా పనిచేసిన ఎమ్మెల్సీలకూ మంత్రి స్థాయి భద్రతను తొలగించారు. తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, మహేందర్ రెడ్డి, చందూలాల్‌కు రొటీన్‌గా ఉండే భద్రతను కొనసాగిస్తున్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉపయోగించుకున్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు రూ.9,00,860 బిల్లులను చెల్లించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీకి ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ) లేఖ పంపింది.

● 'క్యాట్' ఫలితాల్లో నిట్ విద్యార్థుల సత్తా



నిపుణ్ అగర్వాల్

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో 11 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవగా వరంగల్ ఎన్ఐటీ విద్యార్థుల ఏడుగురు 95కు పైగా పర్సంటైల్ సాధించడం గమనార్హం. మెకానికల్ బ్రాంచికి చెందిన నిపుణ్ అగర్వాల్ 99.92 పర్సంటైల్ సాధించినట్లు ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ రమణారావు తెలిపారు. తరుణ్ కాట(ఈఈఈ), అహ్మద్ సమీర్(సివిల్), పార్థ గోస్వామి, గౌరవ్ మాలిక్(కెమికల్), తపాస్ దాస్, సుజన్ సత్తాచాటారన్నారు.

● ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సులు: యూజీసీ

2019-20 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సులను ఆన్‌లైన్‌లో కూడా అందించాలని యూజీసీ నిర్ణయం తీసుకుంది. ఈ విధానంపై ఆసక్తి ఉన్న ఉన్నత విద్యా సంస్థలు ఈ నెల 7వ తేది నుంచి 31 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందుకు సంబంధించి యూజీసీ కార్యదర్శి రజనీష్ జైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెట్ ఫలితాలు విడుదల: నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. 6,81,930 మందికిగాను 44,001 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధించారు. 3,883 మంది జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్... రెండింటికీ అర్హత సాధించారు.



జాతీయ స్థాయి సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న లక్ష్మీపూర్ రైతులు

లక్ష్మీపూర్ రైస్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

జగిత్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రూరల్ మండలం లక్ష్మీపూర్ రైతు పరస్పర సహాయ సహకారసంఘం ద్వారా ఉత్పత్తి చేస్తున్న లక్ష్మీపూర్ రైస్‌కు, వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇక్కడి రైతులు మూడు నెలల క్రితం తాము ఉత్పత్తి చేసిన బియ్యం, ఎరువులను జాతీయ స్థాయిలో విక్రయించడానికి నాబార్డులో దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తు పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో లక్ష్మీపూర్ ఉత్పత్తులను విక్రయించడానికి హోదా కల్పిస్తూ సర్టిఫికెట్ ఇచ్చింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో స్థానిక రైతులు సంఘం ఏర్పాటు చేసుకుని బియ్యాన్ని విక్రయిస్తున్నారు. దీనిలో సభ్యులుగా ఉన్న 200మంది రైతులు బియ్యాన్ని నేరుగా ఈ సంఘానికే అప్పగిస్తారు. క్వింటాల్‌కు రూ.5 కమిషన్ తీసుకుని మిగిలిన లాభాన్ని సంఘం రైతులకు అప్పగిస్తోంది. వివిధ ప్రాంతాలకు చెందినవారు కూడా లక్ష్మీపూర్‌కు వెళ్లి నాణ్యమైన బియ్యం కొనుగోలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ అనుమతితో లక్ష్మీపూర్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెదకా..? నల్లగొండా?

లోక్‌సభకు కేసీఆర్ ఎక్కడి నుంచి?.. మరోసారి 'అసెంబ్లీ ఫార్ములా'కే మొగ్గు

▸ అత్యధిక స్థానాల్లో సిట్టింగ్‌లకే చాన్స్

▸ మల్కాజిగిరి, చేవెళ్ల సెగ్మెంట్లలో డైలమా

▸ పెద్దపల్లిలో అంతర్గతంగా కుమ్ములాట

▸ టీఆర్ఎస్ శ్రేణుల్లో రసవత్తరంగా చర్చ

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఎంపీలు.. ఎమ్మెల్యేలుగా గెలుపొందడం... ఓ ఎంపీ కాంగ్రెస్‌లో చేరడం.. మరో ఎంపీ పోటీకి నిరాసక్తత చూపుతుండడంతో టీఆర్ఎస్ తరఫున సిట్టింగ్‌లతో పాటు కొత్తగా నలుగురికి ఎంపీలుగా పోటీచేసే అవకాశం దక్కనుంది. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా ఈ సారి సీఎం కేసీఆర్ లోక్‌సభ బరిలోకి దిగుతారని తెలుస్తోంది. సొంత జిల్లా అయిన మెదక్ నుంచి లోక్ సభకు పోటీ చేస్తారని చర్చ జరుగుతుండగా, నల్లగొండ నుంచి బరిలోకి దిగే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. ఎంపీగా మళ్లీ పోటీ చేయబోనని, ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే చాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు నల్లగొండ నుంచి కాంగ్రెస్ తరఫున కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బరిలోకి దిగుతారని తెలుస్తుండగా.. టీఆర్ఎస్ నుంచి ఏకంగా కేసీఆర్ పోటీ చేస్తారన్న ప్రచారం ఉత్కంఠ రేపుతోంది. ఈ విషయమై టీఆర్ఎస్‌లో రసవత్తర చర్చ సాగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అనుసరించిన ఫార్ములానే అనుసరించాలని టీఆర్ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. సిట్టింగ్‌లకే దాదాపుగా టికెట్లు ఖరారు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. పెద్దపల్లి, మల్కాజిగిరి, చేవెళ్లలో అభ్యర్థుల ఎంపిక మాత్రం క్లిష్టంగా మారిందని సమాచారం. మల్కాజిగిరి, చేవెళ్ల స్థానాల్లో ఎ... ట... ఉండగా.. పెద్దపల్లిలో అంతర్గత కుమ్ములాటలు కొనసాగుతున్నాయి.

చేవెళ్ల నుంచి స్వామిగౌడ్?



అసెంబ్లీ ఎన్నికల్లో 88 స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించడంతో.. దాదాపు 14 ఎంపీ సెగ్మెంట్లలో ఆ పార్టీకి అనుకూలత ఏర్పడింది. లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాల్లో కచ్చితంగా గెలిచే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో ఎంపీ టికెట్ల కోసం పోటీ నెలకొంది. శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ పదవీకాలం రెండు నెలల్లో పూర్తికానుంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నుంచి పోటీ చేయాలని స్వామిగౌడ్ ఆశించినా.. సాధ్యం కాలేదు. ఈ దఫా ఆయన్ను మల్కాజిగిరి లేదా చేవెళ్ల నుంచి ఎంపీగా బరిలోకి దింపాలని టీఆర్ఎస్ యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్వామిగౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్‌ను బరిలోకి దిగుతారని తెలుస్తోంది. ఈ అంశంపై స్వామి గౌడ్‌ను ఆరా తీయగా... 'చేవెళ్ల ఎంపీగా అవకాశం ఇస్తారనే ప్రచారం జరుగుతున్న మాట వాస్తవమే. ఈ విషయం నా దృష్టికీ వచ్చింది. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా' అని సంతోషంగా వెల్లడించారు.

పెద్దపల్లి దక్కేదెవరికి?

పెద్ద పల్లి ఎంపీగా ఉన్న బాల్క సుమన్ విజ్ఞప్తి మేరకు చెన్నూరు ఎమ్మెల్యే టికెట్ కేటాయించగా, అక్కడ ఆయన విజయం సాధించారు. ఆయనకు టికెట్ ఇవ్వడం వివేక్ సోదరులకు మొదటి నుంచి ఇష్టం లేదు. చివరికి బెల్లంపల్లి నుంచి బీఎస్పీ తరఫున వినోద్ బరిలోకి దిగారు. పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, మూడింటిలో వివేక్ సోదరులపై వ్యతిరేకత ఉంది. ధర్మపురిలో టీఆర్ఎస్ అభ్యర్థిని ఓడించడానికి రూ.3 కోట్లు ప్రతిపక్ష అభ్యర్థికి ఇచ్చారని వివేక్‌పై ఆ పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. దాంతో వివేక్‌కు పార్టీ అధిష్ఠానం ఝలక్ ఇస్తుందా? టికెట్ ఇస్తుందా? అనేది తేలాల్సి ఉంది.

మహేందర్‌రెడ్డి పోటీ చేస్తారా?

మల్కాజిగిరి ఎంపీ స్థానంలో స్థానికులకే అవకాశం ఇస్తారా? లేక పొరుగు నేతను తెచ్చుకుంటారా తేలాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డిని మల్కాజిగిరికి పంపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఎంపీగా కాకుండా ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే మంత్రి వర్గంలో మరో సారి చోటు దక్కించుకోవాలని మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భావిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో ఆయన కుటుంబానిది చెరగని ముద్ర. ఆ జిల్లాలో కొత్తవారికి మంత్రిగా అవకాశం ఇస్తే... మహేందర్‌రెడ్డిని ఎంపీగా పంపిస్తారని ప్రచారం జరుగుతోంది. ఆయనకు న్యాయం చేస్తానని సీఎం కేసీఆర్ ఇప్పటికే హామీ ఇచ్చారు. ఆయన్ను ఎంపీగా బరిలోకి దింపుతారా? లేక ఎమ్మెల్సీ ఇస్తారా అనేది తేలడం లేదు. కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న రేవంత్‌రెడ్డిని ఓడించిన నరేందర్ రెడ్డి.. కేబినెట్‌లో బెర్తు దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కించుకోలేకపోయిన మేడ్చల్ సిట్టింగ్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సైతం ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలూ కీలకమే

త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలు ఎంపీలకు జీవన్మరణ సమస్యగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులతో గొడవలు జరిగినప్పటికీ, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులను గెలిపించుకోవడం ఎంపీ అభ్యర్థుల ముందు ప్రధానాంశంగా ఉంది. సర్పంచ్‌లను గెలిపించుకుంటే సగం గెలిచినట్లేనన్న భావన ఉంది.

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్

▸ మజ్లిస్ శ్రేణుల్లో హర్షం



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు అవకాశం దక్కింది. సాధారణంగా అధికార పార్టీకి చెందిన సీనియర్ శాసనసభ్యుడు ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించడం ఆనవాయితీ. టీఆర్ఎస్‌కు మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న మజ్లిస్ తరఫున ఆరు సార్లు వరుసగా ఎన్నికైన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు అరుదైన అవకాశం లభించింది. 1986లో ఆగస్టు సంక్షోభం సందర్భంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రొటెం స్పీకర్‌గా అప్పటి మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ వ్యవహరించారు. అప్పట్లో సలావుద్దీన్ కూడా చార్మినార్ నుంచే ప్రాతినిధ్యం వహించారు. తాజాగా చార్మినార్ నియోజకవర్గం నుంచి గెలిచిన మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్‌కు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం దక్కడం గమనార్హం. కేసీఆర్ పట్ల మజ్లిస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 16న సాయంత్రం 5 గంటలకు ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ ఖాన్‌తో రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ ప్రమాణం చేయించనున్నారు. 17న ప్రారంభమయ్యే శాసనసభకు ప్రొటెం స్పీకర్ ఖాన్ అధ్యక్షత వహించి నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులతో ప్రమాణం చేయించనున్నారు. 18న స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ప్రొటెం స్పీకర్‌గా ఖాన్‌కు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు. సుమారు మూడున్నర దశాబ్దాలుగా పాతనగరంలో ఓటమి ఎరుగని ముంతాజ్ ఖాన్.. తాజా శాసనసభ ఎన్నికల్లో చార్మినార్ నుంచి సుమారు 32,586 ఓట్ల మెజారిటీతో శాసనసభకు ఎన్నికయ్యారు. అంతకు ముందు వరసగా ఐదు సార్లు యాకుత్‌పురా నుంచి ఎన్నికైన ముంతాజ్ ఖాన్‌ను మజ్లిస్ పార్టీ 2018 ఎన్నికల్లో చార్మినార్ నుంచి పోటీ చేయించి గెలిపించింది.

18న మంత్రివర్గం!?

▸ మినీ కేబినెట్‌లో ఆరేడుగురికి చోటు

▸ లోక్‌సభ తర్వాతే పూర్తిస్థాయి విస్తరణ

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైంది! స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఈనెల 18న జరగనుంది! మంత్రివర్గ విస్తరణ కూడా అదే రోజు జరగనుందని తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే సంకేతాలు వెలువడ్డాయి. సంక్రాంతి పండుగ తర్వాత, ఈనెల 23వ తేదీ లోపు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ముఖ్యమంత్రి కార్యాలయం సూత్రప్రాయంగా సమాచారం ఇచ్చింది. అందులోనూ 18వ తేదీ ఉదయం మంచి ముహూర్తం ఉందని టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. దాంతో, అదే రోజు విస్తరణ ఉండవచ్చని వివరిస్తున్నాయి. ఒకవేళ, ఏ కారణం చేతనైనా ఆరోజు జరగకపోతే.. నెలాఖరులోనే ఈ కార్యక్రమం ఉండవచ్చని చెబుతున్నాయి. నిజానికి, డిసెంబరు 11న ఎన్నికల ఫలితాల తర్వాత 13వ తేదీన ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు మహమూద్ అలీ ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. కేబినెట్‌లో మరో 16 మందికి చోటు కల్పించే అవకాశం ఉంది. ఈసారి విస్తరణలో మరో ఆరుగురు లేదా ఏడుగురిని తీసుకోవచ్చని ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి విస్తరణ ఉండే అవకాశాలున్నాయని అంటున్నారు. కాగా.. ఈసారి మంత్రి పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య భారీగా ఉంది. కుల సమీకరణాలు, జిల్లాలు, ఎన్నికల్లో మెజారిటీ, పనితనం ఆధారంగా లెక్కలు వేసుకుంటున్నారు. తొలుత ఉండే మినీ కేబినెట్‌లో మాత్రం కేటీఆర్, హరీశ్ రావుల పేర్లు ఉండకపోవచ్చని ప్రచారం జరుగుతోంది.

కేసీఆర్ దుబాయ్ పర్యటన లేనట్లే

ముఖ్యమంత్రి కేసీఆర్ దుబాయ్ పర్యటన రద్దయినట్లు తెలిసింది. ఈనెల 6 నుంచి 13 వరకు ఆయన దుబాయ్ పర్యటనకు వెళుతున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. కానీ.. మంత్రివర్గ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలు, పార్లమెంటు కార్యదర్శుల నియామకం వంటి బిజీ షెడ్యూలు ఉండడంతో పర్యటనను రద్దు చేసుకున్నట్లు సమాచారం.

ఫిబ్రవరిలోనే బడ్జెట్!

ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సూచనలు కనిపించడం లేదు. బడ్జెట్ సమావేశాలను విడిగా నిర్వహించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం, వివిధ శాఖలకు ఎంత మేర నిధులు కేటాయించాలన్న వివరాల సేకరణ పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈసారి అసెంబ్లీ సమావేశాలు కేవలం స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానాలతో ముగిసే అవకాశాలున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అనంతరం రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై స్పష్టత వస్తుందని, పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలా... వద్దా అనే విషయాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో. ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే తదుపరి శాసనసభ సమావేశాల్లోనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం.

17న ముహూర్తం

(మొదటి పేజీ తరువాయి)



పేర్కొన్నారు. అంతకు ఒక్కరోజు ముందు అంటే, 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు దశమి రోజున ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో గవర్నర్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ మర్నాడు 17వ తేదీ ఉదయం 11:30 గంటలకు అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ కార్యక్రమం దాదాపు రెండు గంటలపాటు కొనసాగనుంది. అనంతరం మధ్యాహ్నం జూబ్లీహాలు కౌన్సిల్ లాన్స్‌లో నూతన శాసనసభ్యులకు లంచ్ ఏర్పాటు చేశారు.

18న స్పీకర్ ఎన్నిక

అసెంబ్లీ కొత్త స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఈనెల 18న జరుగుతుంది. ఇందుకు 17న షెడ్యూల్ వెలువడనుంది. అదే రోజు నామినేషన్ కార్యక్రమాలు ఉంటాయి. 18న కొత్త స్పీకర్, డిప్యూటీ ఎన్నికవుతారు. అధికార పార్టీకి సంపూర్ణ మెజారిటీ ఉంది కనక ఈ ఎన్నిక లాంఛనం కానుంది. అనంతరం కొత్త స్పీకర్‌ను సభా నాయకుడు కేసీఆర్, ప్రతిపక్ష నాయకులు సభాపతి స్థానానికి తోడ్కొని వెళ్లి కూర్చోబెడతారు. సాయంత్రం స్పీకర్ అధ్యక్షతన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశమై, మర్నాటి గవర్నర్ ప్రసంగంపై నిర్ణయం తీసుకుంటుంది. ఇక, 19న ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని 20వ తేదీన ప్రవేశపెట్టి.. దానిపై చర్చ జరుపుతారు. అనంతరం సభ ఆమోదం తెలుపుతుంది.

పొగుడుతారు.. పైసలివ్వరు

▸ నీతి ఆయోగ్ సిఫారసు చేసినా స్పందన లేదు

▸ కేంద్రం ఇవ్వనంటే.. బయ్యారం పరిశ్రమను మేమే నిర్మించుకుంటాం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, తాగు, సాగునీటి ప్రాజెక్టులను ప్రశంసించిన ప్రధాని మోదీ.. నిధులు మాత్రం ఇవ్వలేదన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాగు, సాగునీటి కోసం సీఎం కేసీఆర్ మిషన్ మోడ్‌తో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు ఎన్నో అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. ఈ పథకాలు దేశానికే ఆదర్శమని నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియా కొనియాడారన్నారు. మిషన్ కాకతీయకు రూ. 19,205 కోట్లు, మిషన్ భగీరథకు రూ.5వేల కోట్లు ఇవ్వాలంటూ నీతి ఆయోగ్ సిఫారసు చేసినప్పటికీ కేంద్రం స్పందించలేదని విమర్శించారు. 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీయే స్వయంగా మిషన్ భగీరథ కార్యక్రమం బాగుందన్నారని గుర్తు చేశారు. గజ్వేల్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రశంసించారని పేర్కొన్నారు. ప్రశంసలతోనే కేంద్రం సరిపెడుతోంది తప్ప.. నిధులివ్వడంలేదని మండిపడ్డారు.



బీఎల్ఆర్ ఫౌండేషన్ కార్యక్రమంలో ఓ చిన్నారితో కేటీఆర్ ముచ్చట్లు

బీజేపీకి మరో రెండు నెలలే అధికారం

రాష్ట్రంలో బీజేపీకి ఉనికి లేకపోవడంతో ఆ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తూ తెలంగాణపై పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. బీజేపీ తన వైఖరి మార్చుకోకపోతే లోక్‌సభ ఎన్నికల్లోనూ అన్ని స్థానాల్లో ఆ పార్టీ డిపాజిట్లు కోల్పోతుందని, గతంలో ఉన్న ఒక్క ఎంపీ స్థానం కూడా ఈసారి రాదని అన్నారు. గతంలో ఇచ్చిన వినతులను మరోసారి ఇచ్చేందుకే సీఎం కేసీఆర్ ఢిల్లీకి వెళ్లారని, కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా వెళ్తారని కేటీఆర్ స్పష్టం చేశారు. మరో రెండు నెలలు మాత్రమే బీజేపీ అధికారంలో ఉంటుందన్నారు. తెలంగాణకు అన్యాయం చేసి.. ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతుందని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమకు కేంద్రం నిధులు ఇవ్వబోమని చెబితే తామే నిర్మించుకుంటామని తెలిపారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే చంద్రబాబు కడప ఉక్కు పరిశ్రమను నిర్మిస్తున్నారని, తమకు ఇప్పుడు ఆ అవసరం లేదని అన్నారు. గీత కార్మికుల కోసం బీఎల్ఆర్ ఫౌండేషన్ తరఫున ఎంపీ బూర నర్సయ్యగౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమని కేటీఆర్ అన్నారు. ఫౌండేషన్‌లోని సభ్యులకు బీమా చెక్కులను కేటీఆర్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అనాథలను ఆదుకొని, కులవృత్తులకు చేయూతనందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

చంద్రబాబు తెలంగాణకు మళ్లీ రారనుకుంటున్నా

▸ మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందా? లేదా? అనేది చంద్రబాబుకే తెలియాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'కంప్యూటర్‌ను తానే కనిపెట్టానంటారు కదా.. అందులో ఏ చిప్ అమర్చాలో ఆయనకే తెలుసు'అని ఎద్దేవా చేశారు. ఏపీలో రాజకీయాలు చేయాలంటే అక్కడికే వెళ్లాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో 16 లోక్‌సభ స్థానాలను టీఆర్ఎస్ గెలుచుకుంటుందని, అసెంబ్లీ ఎన్నికల కన్నా ఈసారి తమ పార్టీకి ఓట్ల శాతం పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి కాంగ్రెస్ నేతలు ఇంకా తేరుకోలేదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే దొరకని పరిస్థితి ఉందన్నారు. మహాకూటమి కొనసాగుతుందా? లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందా? అని కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. చంద్రబాబు రాక వల్లే టీఆర్ఎస్ గెలిచిందనుకోవడం అపోహేనన్నారు. ప్రజలు టీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని ముందే డిసైడ్ అయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబు మళ్లీ తెలంగాణకు రారని తాను భావిస్తున్నానన్నారు. ఉత్తరాదిలో బీజేపీ, కాంగ్రెస్‌లకు పరిస్థితులు అనుకూలంగా లేవని, లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో టీఆర్ఎస్ కీలకం కాబోతుందన్నారు. కోదండరాంను ప్రజలు తిరస్కరించారని, రాజకీయాల్లో కొనసాగాలో, వద్దో ఆయనే నిర్ణయించుకోవాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ మహాకూటమి కొనసాగితే టీజేఎస్‌కు హైదరాబాద్, కరీంనగర్ వంటి ఓడిపోయే స్థానాలే ఇస్తారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తారా? అన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. ఎంపీగా పోటీ చేయాల్సిన అవసరం ఏముందన్నారు.. తమ బాస్ (కేసీఆర్) ఆదేశాలను మాత్రమే తాను అమలు చేస్తానని, పార్టీకి సంబంధించిన నిర్ణయాలన్నీ ఆయనే తీసుకుంటారని స్పష్టం చేశారు.



టీజేఎస్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణయ్య, దాసోజు శ్రవణ్, కోదండరాం

బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాలి

- పార్టీలకు అతీతంగా ఏకం కావాలి: దాసోజు
- ఆర్డినెన్స్‌ను ఎత్తివేయాలి: కోదండరాం
- టీఆర్ఎస్‌కు చేత కావడంలేదు: కృష్ణయ్య
- ధర్నా చౌక్ వద్ద టీజేఎస్ నిరసన

హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా జెండాలు, అజెండాలు పక్కన బెట్టి పార్టీలకు అతీతంగా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ అభిప్రాయపడ్డారు. బీసీల వెనకబాటుతనంపై సమగ్ర అధ్యయనం చేసి కోర్టులో నివేదిక సమర్పించడం ద్వారా రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఉందన్నారు. అయినా టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయడంలేదన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేసిందని ఆరోపించారు. బీసీలు రాజకీయంగా ఎదగాలంటే పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ కోటా పెంచాల్సిందేనని పేర్కొన్నారు. శనివారం ఇక్కడ ధర్నాచౌక్‌లో టీజేఎస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ ఒక్క రోజులో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన కేసీఆర్ ప్రభుత్వం.. ఆరు నెలలుగా బీసీ గణన చేపట్టక పోవడం కుట్రేనని పేర్కొన్నారు. టీఆర్ఎస్ నాయకుడు గోపాల్‌రెడ్డి కోర్టుకు వెళ్లడం వల్లే రిజర్వేషన్లు తగ్గాయని, దీని వెనుక ఆ పార్టీ అధిష్ఠానం ఉందని ఆరోపించారు. ఎన్నికలు అడ్డుకునేందుకు టీఆర్ఎస్ కేసులేస్తే తప్పులేదు కానీ.. న్యాయం కోసం తాము కోర్టుకెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. రాజకీయాల్లో కూడా బీసీలకు ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గిస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు అడ్డుకోకుంటే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే కోటా అమలు చేసే ప్రమాదం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా ఏకమై ఈ ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు ఎదగకూడదనే కుట్రతోనే రిజర్వేషన్లను తగ్గించారని ఆరోపించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించారని, ఇప్పుడు టీఆర్ఎస్‌కు ఎందుకు చేత కావడంలేదని ప్రశ్నించారు. బీసీల మీద కేసీఆర్‌కు కసి ఉందని, దాన్ని తీర్చుకునేందుకే రిజర్వేషన్లను తగ్గించారని ఆరోపించారు. బీసీలకు కావాల్సింది ఆత్మగౌరవ భవనాలు కాదని, పిల్లలు చదువుకునేందుకు పాఠశాలలని అన్నారు. రిజర్వేషన్ల తగ్గింపు వల్ల దాదాపు 1500 మంది సర్పంచ్ అయ్యే అవకాశం కోల్పోయారని తెలిపారు. కార్యక్రమంలో జస్టిస్ ఈశ్వరయ్య, కపిలవాయి దిలీప్‌కుమార్, గాదె ఇన్నయ్య పాల్గొన్నారు.

నో బిల్స్

రాష్ట్రంలో అన్ని శాఖల బిల్లులూ పెండింగ్

వివిధ శాఖల్లో పెండింగ్ బిల్లులు ఇలా!

సాగునీటి పారుదల శాఖ	రూ.7,600 కోట్లు
రోడ్లు భవనాల శాఖ	రూ.2000 కోట్లు
పంచాయతీరాజ్	రూ.350 కోట్లు
వివిధ కార్పొరేషన్లు	రూ.1000 కోట్లు
ఇతర శాఖల బిల్లులు	రూ.500 కోట్లు
ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల హెల్త్ స్కీం	రూ.500 కోట్లు



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో ఓ కాంట్రాక్టరు రూ.40 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు దక్కించుకున్నారు. రోడ్డుపై మెటల్‌ను పర్చేశారు. దానిని చదును చేయించి, క్యూరింగ్ చేసి, బీటీ వేయాలి. మెటల్‌ను పరిచే వరకు 20 శాతం పనులు పూర్తయ్యాయి. ఇందుకు రూ.7 కోట్ల బిల్లు చేయగా, ఇంజనీరింగ్ అధికారులు మెజర్‌మెంట్స్ చేసి ధ్రువీకరించారు. బిల్లును జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ కార్యాలయాని (డీపీఏవో)కి పంపించగా.. టోకెన్ ఇచ్చారు. ఈ తతంగం పూర్తయి ఆరు నెలలు కావస్తోంది. బిల్లు వస్తే.. మెటల్ లెవలింగ్, బీటీ పనులు చేపడదామని కాంట్రాక్టరు వేచి చూస్తున్నాడు. ఎంతకీ డబ్బులు రావడం లేదు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ఆ కాంట్రాక్టరు అలసిపోయాడు. డబ్బులు వచ్చినప్పుడే పనులు చేపడదామని ఊరకున్నాడు. బిల్లు రాలేదన్న వాస్తవాన్ని రోడ్డుపై పోసిన మెటల్ కుప్పలు గుర్తు చేస్తున్నాయి. ...ఇది ఒక్క ఆ కాంట్రాక్టరు పరిస్థితే కాదు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లందరి పరిస్థితి. ఇద్దరు కాంట్రాక్టర్లు కలిస్తే బిల్లుల ముచ్చటే. ఎన్నికలయ్యాక బిల్లులు వస్తాయని ఆశపడ్డారు. కానీ.. ఎన్నికలు పూర్తయి నెల కావస్తున్నా బిల్లుల ప్రస్తావన లేదు. ఫలితంగా, కాంట్రాక్టర్లు నీరసపడిపోయారు. అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి. సాగునీటి పారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణం వంటి శాఖల ద్వారా చేపట్టిన పనుల బిల్లులన్నీ పెండింగ్‌లో పడిపోయాయి. చివరకు, ప్రభుత్వ రంగ సంస్థల బిల్లులకూ మోక్షం లభించడం లేదు. ఇలా రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.12 వేల కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. వీటిలో ఆరోగ్యశ్రీ బిల్లులే రూ.500 కోట్లు. చివరిసారిగా, గత ఏడాది మే నెలలో ఆర్థిక శాఖ బిల్లులను క్లియర్ చేసింది. ఆ తర్వాత రూ.10 లక్షలలోపు బిల్లులను క్లియర్ చేస్తూ వస్తోంది. మరీ పలుకుబడి ఉపయోగించి ఒత్తిడి తెచ్చే కాంట్రాక్టర్ల బిల్లులను అప్పుడప్పుడు విడుదల చేస్తోంది. నిధులు చేతికందకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేసి సచివాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అధికారులు మాత్రం.. చేతులు పైకి చూపిస్తూ 'అంతా దేవుడిపైనే భారం' అంటూ పెదవి విరుస్తున్నారు.

మూడు శాఖల్లోనే 10 వేల కోట్లు

సాగునీటి పారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల బిల్లులే రూ.9,950 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. సాగునీటి శాఖలోనూ కాళేశ్వరం ప్రాజెక్టు బిల్లులు ఆగడం లేదు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణం అందుబాటులో ఉండడంతో బిల్లు వచ్చిన వెంటనే డబ్బు కాంట్రాక్టర్ల ఖాతాకు చేరిపోతోంది. ఇదే ఇరిగేషన్ శాఖ ద్వారా చేపడుతున్న సీతారామ, పాలమూరు-రంగారెడ్డి, డిండి, దేవాదుల వంటి పథకాలు, మిషన్ కాకతీయ బిల్లులు మాత్రం మంజూరు కావడం లేదు. వీటి టోకెన్లు తీసుకుని కాంట్రాక్టర్లు ఏడు నెలలుగా వేచి చూస్తున్నారు. అలాగే, ఆర్అండ్‌బీ శాఖలో సమీకృత కలెక్టరేట్లు, ఇతర భవనాలు, కొత్త రోడ్లు, పాత రోడ్ల మరమ్మతు పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖ బిల్లులు రూ.350 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇక, మున్సిపల్, పలు సంక్షేమ శాఖలు కూడా భవన నిర్మాణ పనులు చేపడుతున్నాయి. ఇలాంటి బిల్లులు మరో 500 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. చివరికి, ప్రభుత్వ ప్రాధాన్య రైతు బంధు పథకానికి కూడా రూ.1500 కోట్ల వరకూ చెల్లింపులు నిలిచిపోయాయి.

ఆరోగ్యశ్రీ పరిస్థితి మరీ దారుణం

ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకాలకు ప్రభుత్వం ఏటా రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తోంది. ఆరోగ్యశ్రీకి రూ.700 కోట్లు, ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ.300 కోట్ల మేర వెచ్చిస్తోంది. కానీ.. ఈ రెండు పథకాల కింద రూ.500 కోట్లను ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉంది. బిల్లులు చెల్లించే వరకూ చికిత్సలు చేసేది లేదని గత ఏడాది నవంబరు 1నే ఎంప్యానల్ ఆస్పత్రులు తేల్చి చెప్పాయి. దీంతో, నిరుపేద రోగులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా.. బిల్లులు క్లియర్ కావడం లేదు.

ప్రభుత్వరంగ సంస్థల బిల్లులూ పెండింగ్

వివిధ ప్రభుత్వ రంగ కార్పొరేషన్ల ద్వారా చేపడుతున్న పనుల తాలూకు బిల్లులు కూడా పాస్ కావడం లేదు. రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ పలు జిల్లాల్లో ఆస్పత్రి భవనాలను నిర్మిస్తోంది. పర్యాటక శాఖ 'హరిత' హోటళ్ల పనులు చేపట్టింది. సాగునీటి పారుదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకాలను చేపడుతున్నారు. పోలీసు గృహ నిర్మాణ సంస్థ గృహ సముదాయాలు, పోలీస్ స్టేషన్ల భవనాలను నిర్మిస్తోంది. ఇలా వివిధ కార్పొరేషన్ల బిల్లులే రూ.1000 కోట్ల వరకు పేరుకుపోయాయి. సాధారణంగా ప్రభుత్వం తన ప్రాథమ్యాల ప్రకారం ఆయా శాఖల బిల్లులను క్లియర్ చేస్తుంటుంది. ఏ శాఖ బిల్లులను ఎంతమేర క్లియర్ చేయాలో ఆర్థిక శాఖకు సూచిస్తుంది. కానీ, ప్రస్తుతం దాదాపు అన్ని శాఖల బిల్లులను క్లియర్ చేయడం మానేశారు. ఫలితంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేయడంతో 10 లక్షల మంది కూలీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

సంక్షేమ పథకాలకు మళ్లింపుతో సమస్య

వాణిజ్య పన్నులు, మద్యం, రవాణా పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇతర పన్నేతర రాబడులన్నీ కలిపి ప్రభుత్వ ఖజానాకు నెలకు రూ.8000 కోట్లమేర జమ అవుతుంటాయి. వస్తున్న నిధులను వస్తున్నట్లుగానే సంక్షేమ పథకాలకు మళ్లించాల్సి వస్తోంది. ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లకు రూ.2400 కోట్లు, ఆసరా పెన్షన్లకు రూ.400 కోట్లు, సబ్సిడీ బియ్యానికి రూ.200 కోట్ల వరకూ విడుదల చేస్తున్నారు. రైతుబంధు పథకానికి మే-జూన్ నెలల్లో రూ.5,730 కోట్లు; రెండో దశలో రూ.6,000 కోట్లను మళ్లించారు. ఇలాంటివన్నీ తడిసి మోపెడు కావడంతో సివిల్ వర్క్స్ బిల్లులను చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.



అలర్జకాన్ 2019కు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్

- హైదరాబాద్‌లో జరగనున్న ప్రపంచ ఈఎన్‌టీ సదస్సుకూ ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 5: ఆస్తమా, అలర్జీ అండ్ ఇమ్యూనాలజీపై జరగనున్న జాతీయ సదస్సుకు.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అలర్జీ స్పెషలిస్ట్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్‌కు ఆహ్వానం అందింది. జనవరి 10, 11 తేదీల్లో వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ (సీఎంసీ)లో జరగనున్న ఈ సదస్సుకు ఆయన ఫ్యాకల్టీగా హాజరుకానున్నారు. అలాగే.. హైదరాబాద్‌లో జరగనున్న ప్రపంచ ఈఎన్‌టీ సదస్సులో కూడా ఆయన పాల్గొననున్నారు. అలర్జీ ఇమ్యూనోథెరపీ చికిత్సలో అందెవేసిన చేయిగా పేరొందిన డాక్టర్ నాగేశ్వర్.. ఈఎన్‌టీ సదస్సుకు హాజరయ్యే 3వేల మంది వైద్యులకు ఆ చికిత్సపై అవగాహన కల్పించనున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం మనదేశంలో దాదాపు 30 శాతం మంది ప్రజలు రకరకాల అలర్జీలతో బాధపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే ఇంచుమించుగా కోటిన్నర మంది.. అలర్జీ ఆస్తమా, అలర్జీ రైనైటిస్, అలర్జీ సైనసైటిస్, స్కిన్ అలర్జీ, ఫుడ్ అలర్జీలతో బాధపడుతున్నారు. ఈ సమస్యకు సమర్థంగా చికిత్సనందించే నిష్ణాతులైన వైద్యుల్లో ప్రముఖులు వ్యాకరణం నాగేశ్వర్. సాధారణంగా.. అలర్జీ ఆస్తమా ఉన్న వారి సమస్యకు మూలకారణం తెలుసుకుని, చికిత్స అందిస్తే సమస్యను పూర్తిగా నయం చేయొచ్చు. ఈ పద్ధతిలో చేసే చికిత్సనే అలర్జీ ఇమ్యూనోథెరపీ అంటారు. ఇప్పటికి 200మందికి పైగా పేషెంట్లకు ఈ చికిత్సతో ఆయన ఉపశమనం కలిగించారు. ఆయన వద్దకు విదేశాల నుంచి కూడా పేషెంట్లు వస్తుంటారు. అలర్జీ ఆస్తమా నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయన.. 2015లో అలర్జీ సమస్యలకు సంబంధించి దేశంలోనే తొలిసారిగా ఒక టోల్ ఫ్రీ నంబర్ (18004250095) ప్రవేశపెట్టారు. సీఎం కేసీఆర్ ఆ నంబర్‌ను ఆవిష్కరించారు. అలర్జీ బాధితులు ఎవరైనా ఈ నంబరుకు ఫోన్ చేసి సమస్య చెప్తే సలహాలు, సూచనలు అందజేస్తారు.

పొత్తు వల్లే కాంగ్రెస్ ఓటమి

- ప్రజాఫ్రంట్ వస్తే బాబు వస్తాడన్న.. టీఆర్ఎస్ ప్రచారాన్ని జనం నమ్మారు
- లోక్‌సభ ఎన్నికలకు పొత్తులొద్దు
- సమీక్షలో ఇవే చెప్పా: కోమటిరెడ్డి
- చంద్రబాబు వల్ల కొంత లాభమే: భట్టి



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ఒంటరిగా వెళ్దామని టీపీసీసీ సమీక్షలో తాను సూచించినట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. పొత్తు లేకుండా బరిలోకి దిగితే ఏడు, ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై లోక్‌సభ స్థానాల వారీగా జరిగిన సమీక్షలో శనివారం ఆయన పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో జరిగిన అవకతవకలు సహా అన్నింటిపై సమావేశంలో చర్చించామన్నారు. పొత్తుల పేరుతో రెండు మాసాలు వృథా కావడం, సీట్లు పంచుకోలేని వాళ్లు రాష్ట్రాన్ని ఏం పాలిస్తారంటూ టీఆర్ఎస్ చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లడం వల్లే ఓటమి పాలయ్యామని అన్నారు. టీడీపీ ఓటు బ్యాంకు పరిమితం కాబట్టి పొత్తు వద్దని ఇక్కడ, ఢిల్లీలోనూ తాను అప్పుడు చెప్పానన్నారు. పొత్తుల వల్ల సమయం వృథా కావడంతోపాటు ఏ టికెట్ ఎవరికి వస్తుందో తెలియకుండా పోయిందని, ఒక పార్టీకి వదిలిన సీట్లలో మరో పార్టీ బీఫాంలు ఇవ్వడం వంటి వాటితో ప్రజల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. "ప్రజాఫ్రంట్ గెలిస్తే తెలంగాణ ప్రభుత్వంలో చంద్రబాబు హస్తం ఉంటుందంటూ టీఆర్ఎస్ చెప్పిన మాటలను ప్రజలు నమ్మారు. దీంతో మేమనుకున్న పది నుంచి 20 శాతం ఓటు బ్యాంకు తగ్గింది"అని తెలిపారు. తనలాంటి వారు ఓడిపోవడానికి పొత్తులు ఒక కారణమైతే.. సీఎం కేసీఆర్ ఒకే నెలలో రెండు సార్లు నల్లగొండకు వచ్చి.. దత్తత తీసుకుంటానని చెప్పారని, ఆ పార్టీ నేతలు రూ.80 కోట్ల వరకూ ఖర్చు చేశారని వివరించారు. టీఆర్ఎస్ కంటే ముందుగా.. ఫిబ్రవరిలోనే లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించాలని కోరగా.. త్వరలోనే ప్రకటిస్తామని ఖుంటియా చెప్పారని వెల్లడించారు. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు. కాగా, శాసనసభ ఎన్నికలను కేసీఆర్.. డబ్బు చుట్టూ తిప్పారని, అన్ని వ్యవస్థలనూ కలుషితం చేశారని టీపీసీసీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. రాష్ట్రంలో పార్టీ ఓటమికి సమష్టి బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఎన్నికలను కేసీఆర్ వర్సెస్ చంద్రబాబు అన్నట్టుగా మారాయని, అయితే చంద్రబాబు వల్ల తమకు కొన్ని చోట్ల లాభం జరిగిందన్నారు. గాంధీభవన్‌లో శనివారంఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఎన్నికలకు ఆరు నెలల ముందే కాంగ్రెస్ ముఖ్య నేతల నియోజకవర్గాలపై కేసీఆర్ దృష్టి పెట్టారని అన్నారు. మండల, గ్రామ స్థాయిల్లో ఇతర పార్టీల ముఖ్య నాయకులు, కుల సంఘాల నేతలను పార్టీలో చేర్చుకున్నారని చెప్పారు. ప్రచారకమిటీ అసెంబ్లీ ఎన్నికల వరకేనని, పార్లమెంట్ ఎన్నికలకు మళ్లీ కమిటీ వేయనున్నారన్నారు. తనకు పార్టీ ఏ బాధ్యతలను అప్పగించినా నిర్వహిస్తానంటూ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు: ఐఎఫ్‌టీయూ

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. బడాబాబుల ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పణంగా పెడుతోందని సీపీఐ (ఎంఎల్) ప్రతిఘటన, సీపీఐ (ఎంఎల్) రెడ్‌ఫ్లాగ్ అనుబంధ కార్మిక ప్రజాసంఘాలు ఆరోపించాయి. కార్మికుల హక్కులు మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని ఐఎఫ్‌టీయూ జాతీయ రాష్ట్ర కార్యదర్శులు షేక్షావలి, ధానం శంకర్‌లింగంగౌడ్, ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా (టీయూఎల్‌సీ) అధ్యక్ష, కార్యదర్శులు సత్యవర్దన్, కర్నెరాములు; తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాపర్తి ధర్మన్న, మద్ది వెంకట్‌రెడ్డి; అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ పిడికల సంపత్, విప్లవ కార్మిక మహిళా సంఘం ఆంధ్రా-తెలంగాణ కన్వీనర్ సంపంగి పద్మక్క శనివారం విమర్శించారు. కాగా, దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఇందులో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం. సాయిబాబు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, టీఎస్ఆర్‌కేఎల్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి డి.నారాయణరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్, తదితరులు పాల్గొన్నారు. సింగరేణి పరిధిలో లేని కొన్ని విధానపరమైన డిమాండ్లపై 8, 9 తేదీల్లో సింగరేణిలో తలపెట్టిన సార్వత్రిక సమ్మె యోచనను విరమించుకోవాలని సింగరేణి యాజమాన్యం.. కార్మిక సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేసింది. శనివారం సింగరేణి భవన్‌లో గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డితో డైరెక్టర్ ఎన్.చంద్రశేఖర్ సమావేశమయ్యారు. అలాగే ప్రాతినిధ్య సంఘం ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి సీతారామయ్యతోనూ సమావేశమై.. సమ్మె ఆలోచన విరమించుకోవాలని కోరారు.

ప్రజల్లోకి వెళ్లాల్సిందే!

- చలనం లేకుంటే పట్టించుకోరు
- ఈవీఎంల అవకతవకలపై పోరాటం.. టీపీసీసీ సమీక్షలో నిర్ణయాలు

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎంల అవకతవకలపై ప్రజల్లోకి వెళ్లాలని టీపీసీసీ సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. శాసనసభ ఎన్నికల్లో ఓటమిపై చేపట్టిన సమీక్ష గాంధీభవన్‌లో శనివారం కూడా కొనసాగింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి పార్లమెంటు స్థానాల పరిధిలో ఓటమిపై జరిగిన సమీక్షలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖుంటియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, ఏఐసీసీ కార్యదర్శి సలీం అహ్మద్, ప్రచార కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్, కుసుమ్‌కుమార్, అజారుద్దీన్‌తోపాటు పోటీ చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు. టికెట్లు ఇవ్వడంలో జాప్యం వల్లే ఓటమి పాలయ్యామని మెజారిటీ అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇది పునరావృతం కాకుండా ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలని కోరారు. ఈవీఎంల ట్యాంపరింగ్, సాయంత్రం వేళ ఎక్కువ పోలింగ్ జరగడం వంటి అంశాలను అద్దంకి దయాకర్, పద్మావతిరెడ్డి లేవనెత్తారు. ఈ విషయమై పిటిషన్ వేసేందుకు సమాచారం సేకరిస్తున్నట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఈవీఎంల అవకతవకలపై పార్టీ తరపున కార్యాచరణ లేకపోవడంతో ప్రజల మద్దతు పెరగట్లేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పార్టీలో చలనం లేదన్న భావన ప్రజల్లో నెలకొనే ప్రమాదం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర స్థాయిలో సదస్సు నిర్వహించాలని, ఢిల్లీ వెళ్లి ఎన్నికల కమిషన్‌కు రిప్రజెంటేషన్ ఇవ్వడంతో పాటుగా అక్కడే ఆందోళన నిర్వహించాలన్న అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది.

ఖమ్మంలో రేణుక వద్దు!

ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రేణుకాచౌదరికి బదులుగా కొత్తవారిని నిలబెడితే తాము గెలిపించుకుంటామని పాలేరు, కొత్తగూడెం ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, వనమా వెంకటేశ్వర్‌రావు అభిప్రాయం వినిపించినట్లు తెలిసింది. తమ నియోజకవర్గాల్లో పార్టీకి వ్యతిరేకంగా ఆమె పనిచేశారని, పార్టీ నుంచి ఆమెను సస్పెండ్ చేయాలని ఉత్తమ్, ఖుంటియాకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై భట్టి విక్రమార్కను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని చెప్పారు. మిగిలిన ఐదు లోక్‌సభ స్థానాల పరిధిలోని నియోజకవర్గాలపై ఆదివారం సమీక్ష జరగనుంది.

కేటీఆర్.. నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడు: పొన్నం



టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ సూచించారు. కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై పొన్నం స్పందిస్తూ.. రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ ఏదో ఒక గ్రామంలో లేకపోవచ్చని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రతి గ్రామంలో ఉందన్నారు. కేటీఆర్ ఏ గ్రామానికొచ్చినా ఈ విషయం నిరూపిస్తానన్నారు. ఆయన అహంకారాన్ని సభ్య సమాజం గమనిస్తోందన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకం రూ.10 లక్షలు అని అధికారులు చెబుతుంటే.. కేటీఆర్ రూ.15 లక్షలు అంటున్నారని, ఎన్నికల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

ఈవీఎం అక్రమాలపై దేశవ్యాప్త చర్చ: అద్దంకి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఈవీఎం అక్రమాలను దేశవ్యాప్తంగా చర్చకు పెడతామని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలనూ వెబ్‌సైట్లో అప్‌డేట్ చేసి, ఒక్క తెలంగాణ ఫలితాలను ఎందుకు అప్‌డేట్ చేయలేదని ప్రశ్నించారు. టీఆర్ఎస్ చెప్పినట్లు వినలేదనే అక్కసుతో సూర్యాపేట కలెక్టర్‌ను బదిలీ చేశారని ఆరోపించారు. వీవీప్యాట్ల పరిశీలనకు దరఖాస్తు చేస్తే ఇప్పటిదాకా అధికారుల నుంచి సమాధానం రాలేదన్నారు. 'ఈవీఎంలకు తెలంగాణలో పెట్టిన పరీక్ష నెగ్గిందని, దేశవ్యాప్తంగానూ అలాగే చేయండి' అంటూ ఇటీవల ప్రధాని మోదీని కలిసినప్పుడు కేసీఆర్ సలహా ఇచ్చి ఉంటారని విమర్శించారు.



విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించిన ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి, గోపాలరావు

విద్యుదుత్పత్తిలో తెలంగాణ టాప్

- ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్‌లో కూడా
- కాళేశ్వరం ఎత్తిపోతలకు 5 వేల మెగావాట్లు
- వచ్చే ఏడాదికి మణుగూరు ప్లాంట్ చార్జ్
- టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదుత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్‌లో దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో ఉందని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దేవులపల్లి ప్రభాకర్ రావు అన్నారు. రవీంద్రభారతిలో శనివారం విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ 2019 డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో విద్యుదుత్పత్తి 80 శాతం ఉండగా.. దేశంలో 58 శాతం ఉందని, ఎన్టీపీసీలో 74 శాతం ఉందన్నారు. ట్రాన్స్‌మిషన్‌లో డిమాండ్ 98.89 శాతం ఉందన్నారు. ట్రాన్స్‌మిషన్‌లో గతంలో 3.5 శాతం నష్టం ఉండగా, దానిని 2.8 శాతానికి తగ్గించుకోగలిగామన్నారు. తెలంగాణ ఆవిర్భావించే నాటికి డిస్ట్రిబ్యూషన్‌లో 16 శాతం నష్టం ఉండగా దానిని 11 శాతానికి తగ్గించుకోగిగామన్నారు. నాగార్జున సాగర్‌లో రివర్స్ పంపింగ్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి ఈ ఏడాది రెండు వందల కోట్లు ఆదా చేశామని పేర్కొన్నారు. కేటీపీఎస్‌లో 48 నెలల్లో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని రికార్డు సమయంలో నిర్మించగలిగినట్లు తెలిపారు. సీఎం కలల ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతలకు 5 వేల మెగావాట్ల విద్యుత్తు అవసరమని, అందుకు అవసరమైన సబ్‌స్టేషన్ల నిర్మాణం ప్రాజెక్టు కంటే ముందే సిద్ధం చేసినట్లు తెలిపారు. రూ. 24 వేల కోట్లతో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యుత్తు సరఫరా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఏడాది ఐదు వేల కోట్లు సబ్సిడీల రూపంలో అందిస్తోందన్నారు. విద్యుత్తు రంగంలో టెక్నికల్ వ్యవస్థ ఎంతముఖ్యమో, ఫైనాన్స్ విభాగం అంతే ముఖ్యమన్నారు. అకౌంట్స్ అధికారులు ఆధునిక టెక్నాలజీపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఆర్థికంగా సంస్థను అభివృద్ధి బాటలో నడిపించాలన్నారు. వచ్చే ఏడాది నాటికి మణుగూరులో నిర్మాణంలో ఉన్న 1080 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్‌ను చార్జ్‌చేసి సీఎంకు కానుకగా ఇద్దామన్నారు. టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి మాట్లాడుతూ టెక్నికల్ సమస్యలు అధిగమించిన తర్వాత రెవెన్యూ డిమాండ్ పెంచడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. సర్వీసుల బిల్లులు సరిగా వెళ్లేలా చూడాలని, బిల్లులు సకాలంలో ఇస్తే వినియోగదారని నుంచి సమస్యలు రావన్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాలరావు మాట్లాడుతూ కొత్త రాష్ట్రంలో నిరంతర విద్యుత్తును అందించి పరిశ్రమలు తరలిపోకుండా చేయడంలో ప్రభాకర్‌రావు కృషి చాలా ఉందన్నారు. తలసరి విద్యుత్‌వినియోగంలో తెలంగాణ ముందుందన్నారు. వీఐవోఏటీ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సింహారావు, వెంకటరాజం, అధ్యక్షుడు అశోక్‌కుమార్, యూనియన్ల నాయకులు శివాజీ, బీసీరెడ్డి 1104 సాయిబాబా, ఎస్టీఎస్టీ అసోయేషన్ మేడి రమేశ్, టీఎస్పీఈఏ రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించడం వల్లే ఓటమి

- వారిపై సీఎం కేసీఆరే చర్యలు తీసుకుంటారు
- పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి: తుమ్మల



సత్తుపల్లి, జనవరి 5 : రాజకీయ విలువలు తెలియని కొందరు వ్యక్తులు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేయడం వల్లే ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ ఓటమి పాలైందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో శనివారం జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్య ఉంటే పార్టీ అధ్యక్షుడితో మాట్లాడుకోవాలే తప్ప, కార్యకర్తల స్థాయిలో వీధిపోరాటాలు చేస్తే పార్టీ మనుగడ సాధించదని ఎన్నిసార్లు చెప్పినా వినలేదని అన్నారు. రాష్ట్రంలోనే జిల్లాను అభివృద్ధిలో ముందుంచానని, ఆ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి, జిల్లా రైతులకు సాగునీటిని అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీకి నష్టం కలిగించిన వారిలో పరివర్తన వస్తే, వారినీ కలుపుకొని పోవాలని సూచించారు. అంతకుముందు ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ కార్యకర్తలు డిమాండ్ చేశారు. దీంతో తుమ్మల స్పందిస్తూ జిల్లా రాజకీయ పరిణామాలన్నీ కేసీఆర్ దృష్టిలో ఉన్నాయని, ఆయనే సరైన నిర్ణయం తీసుకుంటారని సముదాయించారు.

రజత్ కుమార్ అమ్ముడుపోయారు: గూడూరు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్ టీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయారని, అందుకు ప్రతిఫలంగా ఆయనకు కోట్లాది రూపాయలు ముట్టాయని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి ఆరోపించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. రజత్ కుమార్ ఆస్తులు, బంధువుల ఆస్తులపై విచారణ జరిపించాలని కోరారు.

సంక్రాంతికి 5,252 ప్రత్యేక బస్సులు

- తెలంగాణకు 3,673, ఏపీకి 1,579 సర్వీసులు.. 10 నుంచి సేవలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు 5,252 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ యాదగిరి వెల్లడించారు. జనవరి 10 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభిస్తామన్నారు. శనివారం ఎంజీబీఎస్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని జిల్లాలతోపాటు.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విజయనగరం, తెనాలి, గుంటూరు, గుడివాడ, రాజమండ్రి, కాకినాడ, రాజోలు, పోలవరం, మచిలీపట్నం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, విశాఖపట్నం, శ్రీకాకుళం, భీమవరం తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. నగరంలో వివిధ పాయింట్ల నుంచి ఇవి బయలుదేరుతాయని పేర్కొన్నారు.

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

ఎంజీబీఎస్ - 8330933419, 8330933537, 8330933532, 040-27802203, జీడిమెట్ల 9866090717, ఆరాంఘర్ 9059500217, హబ్సిగూడ 9849641808, దిల్‌సుఖ్‌నగర్ 040-23747297, కేపీహెచ్‌బీ 9490484232, లింగంపల్లి 9949999162, మియాపూర్ 9248008595, చందానగర్ 8885055674, 9666664248, ఈసీఐఎల్ 9866270709, ఎస్ఆర్‌నగర్ 9866933312, అమీర్‌పేట 9949958758, టెలిఫోన్ భవన్ 9392333332, ఏపీఎస్ఆర్టీసీ అధికారి 9100948191, 9100948296

ఎక్కడి నుంచి ఎక్కడికి?

బస్‌స్టేషన్/బస్టాపు	గమ్యస్థానాలు
జూబ్లీ బస్‌స్టేషన్	కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలు
సీబీఎస్	కర్నూల్, అనంతపురం, గుత్తి, పుట్టపర్తి, ధర్మవరం, మదనపల్లి
కాచిగూడ	నంద్యాల, ఆత్మకూరు, వెలుగోడు, నందికొట్కూరు, కోయిలకుంట్ల, ఆళ్లగడ్డ, మైదుకూరు, బనగానపల్లి, అవుకు, బద్వేల్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, కడప, రాజంపేట, రాయచోటి, కోడూరు, చిత్తూరు
ఉప్పల్ క్రాస్‌రోడ్	యాదగిరిగుట్ట, వరంగల్
దిల్‌సుఖ్‌నగర్	మిర్యాలగూడ, నల్గొండ, కోదాడ, సూర్యాపేట

తెలంగాణ ఉమ్మడి జిల్లాలకు ఇలా..

ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు 225 బస్సులు, నిజామాబాద్‌కు 291, కరీంనగర్‌కు 670, వరంగల్‌కు 454, ఖమ్మంకు 674, నల్గొండకు 774, మహబూబ్‌నగర్‌కు 411, మెదక్‌కు 200 చొప్పున మొత్తం 3,673 బస్సులను నడుపుతారు. ఏపీకి మొత్తం 1,579 సర్వీసులను ఏర్పాటు చేశారు.



తండ్రి బాటలో తనయుడు...
తండ్రి పాత్రలో తనయుడు...
తండ్రి కథే తనయుడు...
అవును... ఇది భావితరాల కోసం...
తండ్రి కథతో తనయుడు చేసిన ఓ సాహసం !
తెలుగు ప్రజల ఆరాధ్యదైవమైన నందమూరి తారకరామారావు జీవిత కథాచిత్రాన్ని నందమూరి బాలకృష్ణ నిర్మిస్తూ, నటించారు.
ఓ అసామాన్య చరిత్రకు తెరరూపమిచ్చారు.
ప్రపంచంలో మునుపెన్నడూ జరగని...
ఓ సరికొత్త వెండితెర చరిత్రకు తెర తీశారు.
ఈ చరిత్రసృష్టిలో జరిగిన విశేషాలు, వివరాలు, వివాదాలెన్నిటికో... అక్షరరూపం ఈ సండే స్పెషల్!

• డాక్టర్ రెంటాల జయదేవ, వినాయకరావు



చరిత్రలో ఇదే మొదటిసారి!

• ఎన్టీఆర్ బయోపిక్ తీయాలని ఎందుకు అనిపించింది?

ఎన్టీఆర్‌గారు నా తండ్రే కాదు... నా గురువు, దైవం కూడా! సినీపరిశ్రమలో క్రమశిక్షణ, సమయపాలన లాంటి వాటికి ఒరవడి పెట్టింది, కమర్షియల్‌గా ట్రెండ్ సృష్టించింది కూడా ఎన్టీఆరే. దేశరాజకీయాల్లో తెలుగువారి సత్తా చాటిందీ ఆయనే. అలాంటి మహానుభావుడి జీవితాన్ని తరువాతి తరాలకు నిక్షిప్తం చేసి, అందించడానికి ఇదో ప్రయత్నం. ఆయన జీవిత సారాంశం, జీవన సందేశం తెలియజెప్పాలనుకున్నాం. కొత్త తరం వాళ్ళు ఆయనను అనుసరించడానికీ, అంతకన్నా ముందు ఆయన నుంచి అమితంగా స్ఫూర్తి పొందడానికి ఉపయోగపడాలనే ఈ బృహత్తర బయోపిక్ నిర్మాణం.

• ఈ ఆలోచనకు బీజం ఎక్కడ పడింది?

నిజం చెప్పాలంటే, నిర్మాత విష్ణు ఇందూరి ఒకసారి నా దగ్గరకు వచ్చి ఎన్టీఆర్ బయోపిక్ చేస్తే బాగుంటుందని ప్రస్తావించారు. ఆలోచన బాగుంది, ఆచరణ ఎలా అన్నది చూద్దాం, నిర్ణయాలు తీసుకోవాలి అనుకున్నాం. అంతే. తరువాత దాని మీద ముందుకు ఏమీ వెళ్ళలేదు. ఏణ్ణర్ధం, రెండేళ్ళ క్రితం అనుకుంటా... నిమ్మకూరుకు వెళ్ళినప్పుడు ఎన్టీఆర్ బయోపిక్ చేస్తాననే మాట అప్రయత్నంగా నా నోట వచ్చింది. అప్పటికి ఇంకా సావిత్రిగారిపై 'మహానటి' బయోపిక్ లాంటి ప్రాజెక్టులేవీ లేవు. అప్పుడు పడ్డ బీజానికి కార్యరూపమే ఇప్పుడీ 'యన్.టి.ఆర్'.

• కానీ, నిర్మాణ సంస్థ పెట్టి, మీరే నిర్మాతగా మారారేం?

విష్ణు ఇందూరి సహా అందరూ కావాల్సినవాళ్ళే. కాకపోతే, అమ్మానాన్నల కథ అయిన ఈ చిత్రాన్ని మరొకరు తీసే కన్నా, మా ఫ్యామిలీ బ్యానర్‌లో తీస్తేనే బాగుంటుందని అనిపించింది. పైగా, సినిమా మొదలయ్యాక నిర్మాణంలో ఎక్కడైనా, ఏవైనా ఇబ్బందులు వచ్చి మధ్యలో ఆగితే కష్టం. అందుకని మా కుటుంబ సభ్యులే తీస్తే బాగుంటుందనుకున్నా. వాళ్ళ అనుమతి, ఆమోదం తీసుకొని ఈ ప్రాజెక్టులో ముందుకువెళ్ళా. ఎన్.బి.కె. ఫిలిమ్స్ సమర్పణలో నిర్మించాం. నాన్నగారిలో నటుడు, నిర్మాత, దర్శకుడు... మూడు కోణాలూ ఉన్నాయి. ఏది ఆధిక్యం చూపించినా, విపరీత ఫలితాలు ఉంటాయి. అందుకే, ఆయన అన్నీ బ్యాలెన్స్ చేసుకొనేవారు. ఇప్పుడీ బయోపిక్కి నటుడిగా, నిర్మాతగా నేనూ సమతూకం పాటించా. నిజానికి, బి. గోపాల్ దర్శకత్వంలో 'రౌడీ ఇన్‌స్పెక్టర్' చేస్తున్నప్పుడే నిర్మాతగా మారాలనుకున్నా. ఇప్పటి దాకా కుదరలేదు. ఇప్పుడిలా కుదిరింది. అంతే!

• ఇకపై బయట సినిమాలు చేయరని ఓ టాక్!

అదేమీ లేదు. మా సినిమాల మధ్య తీరిక సమయంలో బయటవీ చేస్తా. కాకపోతే, బయోపిక్ తరువాతి సినిమా బోయపాటి శ్రీను దర్శకత్వంలో మా సొంత బ్యానర్ మీద ఉంటుంది. నిర్మాతను కావాలని ఎప్పటి నుంచో మిగిలిపోయిన కోరిక ఇప్పుడు తీర్చుకున్నా. (నవ్వుతూ...) రేపు మా అబ్బాయి మోక్షజ్ఞకు వేదికగా కూడా మా సంస్థ ఉంటుంది!

• దర్శకుడిగా మారడానికి ఇదే వేదిక అనుకోలేదా?

ఒక దశలో నేనే డైరెక్ట్ చేద్దామని కూడా ఆలోచించాను. ఒక సంశయంలో పడ్డాను. ఇంతలో మా అమ్మగారి పాత్ర చేయమని అడగడానికి విద్యాబాలన్‌ను కలవడానికి ముంబయ్ వెళ్ళాను. అప్పుడక్కడ దర్శకుడు క్రిష్ 'మణికర్ణిక' షూటింగ్ జరుగుతోంది. హోటల్‌లో ఆయన నన్ను కలిశారు. మా మధ్య మాటల్లో... 'ఎన్టీఆర్ బయోపిక్ నేను డైరెక్ట్ చేయనా' అని క్రిషే నన్ను అడిగారు. ఒక్కక్షణంలో నేనూ ఓకే అన్నాను. అలా ఆయన దర్శకుడయ్యారు.

• అంతకన్నా ముందు తేజ దర్శకత్వంలో బయోపిక్ స్టార్ట్ చేశారు కదా! అసలు ఆయన్ని మార్చారెందుకు?

ఆయన అంతట ఆయనే ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. ఇంత బరువు తాను మోయలేనేమోనని సందేహపడ్డారు. ఏదైనా మొదలుపెడితే, చావో రేవో ముందుకు దూసుకుపోవాలి. సందేహపడితే, దెబ్బతింటాం. దాంతో, ఆయనే తప్పుకున్నారు. నేనూ సరేనన్నా. అంతా విధి లిఖితం.

• తేజ కన్నా ముందు రామ్‌గోపాల్ వర్మను అడిగారట.

ఒకసారి అనుకున్నాం. కానీ, ముందుకు సాగలేదు.

• మీరు కాదన్నందుకే ఎన్టీఆర్ బయోపిక్‌కు పోటీగా 'లక్ష్మీస్ ఎన్టీఆర్' వర్మ తీస్తున్నారని టాక్! మీ రియాక్షన్!

(తేలికగా నవ్వేస్తూ...) ఆయన ఏం కథ తీస్తున్నారో, ఏ కోణంలో తీస్తున్నారో నాకు తెలీదు. ఏ సినిమా తీయాలన్నది ఆయన ఇష్టం. ఆయన వ్యక్తిగతం. ఆయన మా అనుమతి కోరలేదు. మేము మాత్రం మా వాళ్ళందరితో మాట్లాడి, అనుమతి తీసుకొని చేస్తున్నాం. అయినా, ఈ సినిమాలపై నా రియాక్షన్ కన్నా జనం రియాక్షన్ ముఖ్యం.

• తేజ వెళ్ళి.. క్రిష్ ఎంటరయ్యాక స్క్రిప్టులో మార్పులు?

తేజ ఉన్నప్పుడు నిర్దిష్ట స్క్రిప్టు ఏమీ సిద్ధం కాలేదు. లైన్ ఆర్డర్ కూడా వెయ్యలేదు. క్రిష్ వచ్చాకే పూర్తిగా సిద్ధమైంది.

• బయోపిక్ కోసం మీరు చాలామందిని కలిశారట!

అవును. మా ఊళ్ళోవాళ్ళు, మా మేనమామ రుక్మాంగదరావుగారు లాంటి కుటుంబ సభ్యులు, సినిమాల్లో, రాజకీయాల్లో, ప్రభుత్వంలో నాన్నగారితో కలసి పనిచేసిన లక్ష్మీనారాయణ, గోటేటి రామచంద్రరావు, నరసయ్య, చలమేశ్వర్ లాంటి పెద్దలు, జర్నలిస్టులు చాలామందిని కలిశా. సీనియర్ జర్నలిస్టులు రాసిన పుస్తకాల్లోని సమాచారాన్ని ఆధారంగా తీసుకున్నాం. మా సినిమాకూ, కథకూ ఎంతవరకు అవసరమో అవి మాత్రం తీసుకొని, స్క్రిప్టుగా అల్లుకున్నాం.

• ఎన్టీఆర్ పాత్రలో ఒదగడానికి తీసుకున్న జాగ్రత్తలేంటి?

ప్రత్యేకించి ఏమీ తీసుకోలేదు. నిజం చెప్పాలంటే, ఇన్నేళ్ళలో నేను చేసిన పాత్రలన్నిటిలోకీ ఎన్టీఆర్ పాత్రే నాకు ఈజీ. వేరే నటుడినైతే కష్టంగా ఉండేదేమో కానీ, ఆయన కొడుకుగా దగ్గరుండి చూసి, ఆయన సినిమాలతోనే పెరిగిన నాకు అవి ఒంటపట్టేశాయి. సహజంగానే ఆ హావభావాలు పలికాయి. అనుకరించే ప్రయత్నం చేయలేదు.

• ఆయన వేసిన అరవై గెటప్పులు వేశారట!

అబ్బే అన్ని గెటప్పులు లేవండీ! పాత్రలు, రూపురేఖలు, కాస్ట్యూమ్స్ విషయంలో నాన్నగారు ఓ ఎన్‌సైక్లోపీడియా. బొట్టు నుంచి పంచెకట్టు దాకా, రకరకాల గెటప్పులకు నమూనాలు ఆయన తన పాత్రలతో ఇచ్చే వెళ్ళారు. కృష్ణుడు, రాముడు, జానపదాల లాంటివి కొన్ని ఇప్పటికే నా సినిమాల్లో వేశా. బయోపిక్‌లో మరిన్ని గెటప్పులు వేయడంతో నా ముచ్చట తీరింది. నిడివి సమస్య వల్ల ఒకటి, రెండు గెటప్పుల సీన్లు చిత్రీకరించినా పక్కనపెట్టాం.

• సినిమా రిలీజయ్యాకైనా అదనంగా కలపవచ్చుగా!

(నవ్వుతూ...) ఏమీ అనుకోలేదు. చూడాలి.

• ఎన్టీఆర్ బయోపిక్‌లో బాలకృష్ణ పాత్ర ఉందా, లేదా!

(నవ్వేస్తూ...) నా పాత్ర సినిమాలో లేదు. పూర్తిగా నాన్నగారి జీవితం మీదే దృష్టి పెట్టాం. నా పాత్ర కూడా పెట్టి, ఆ సన్నివేశాలూ తీసుకుంటూ పోతే, సినిమా నిడివి ఇంకా పెరిగిపోతుంది. 'మాయాబజార్'లో పాండవుల ప్రస్తావనే తప్ప, పాత్రలు కనిపించవు కదా. అలాగే, ఈ బయోపిక్‌లో మధ్య మధ్య నా పేరు ప్రస్తావన వస్తుందే తప్ప, నా పాత్ర కనిపించదు. తండ్రి జీవితంపై కొడుకు సినిమా నిర్మించడం, తండ్రి పాత్ర తానే వేయడం చరిత్రలో ఇదే మొదటిసారి. అందులో నా నిజజీవిత పాత్ర కనిపించకుండానే సినిమా తీయడం ఒక ప్రయోగం!

• మీ పాత్రలో రెండో మనుమడు కనిపిస్తాడట. పెద్ద మనుమడు దేవాంశ్‌తోనూ వేయించారా?

నామకరణ వేళ చిన్నారి బాలకృష్ణ పాత్రలో మా రెండో అమ్మాయి తేజస్విని పిల్లాడైన ఎనిమిది నెలల మా మనుమడు ఆర్యవీర్ కనిపిస్తాడు. మా పెద్దమ్మాయి బ్రహ్మణి కొడుకు దేవాంశ్ సంగతి ఆలోచించనే లేదు. అయినా సెకండ్ పార్ట్‌లో ప్యాచ్‌వర్క్ ఉంది. అందులో సందర్భం ఉంటుందేమో చూడాలి!

• మోక్షజ్ఞ అరంగేట్రానికి బయోపిక్ బాగుండేదిగా?

నిజమే. కానీ, వాణ్ణి అతిథి పాత్రల్లో పరిచయం చేయాలని అనుకోలేదు. బయోపిక్, ఎన్నికలు, బోయపాటి సినిమా తర్వాత వాడి ఎంట్రీ పై దృష్టి పెడతా.

• కానీ కల్యాణ్‌రామ్‌కి ఛాన్సిచ్చారు!

1970ల నుంచి నాన్న గారి సొంతచిత్రాల నిర్మాణంలో, పార్టీ పెట్టాక ప్రచారంలో, చైతన్య రథసారథ్యంలో హరి అన్నయ్యది ముఖ్యమైన పాత్ర. ఆ పాత్రకు కల్యాణ్ రామ్ బాగుంటాడని అతనితో వేయించా. వేరేవాళ్ళు వేస్తే జనం రిలేట్ కాలేరు.

• బయోపిక్ ప్రతిపాదన హరికృష్ణకు చెప్పారా?

కథ చెప్పలేదు కానీ, సినిమా తీయబోతున్న విషయం చెప్పా. పాత్రను నేనే బిల్డప్ చేసుకుంటూ వెళ్ళా. సీన్లు రెడీ చేశా. రెండు మూడు రోజుల్లో కలుద్దామన్నారు. ఈలోపే జరగరానిది జరిగిపోయింది. చిన్నప్పటి నుంచీ అన్నయ్యతో అనుబంధం బాగుండేది. 'రామ్-రహీమ్' లాంటి సినిమాలు కలిసి చేశాం. 'అన్నదమ్ముల అనుబంధం' సినిమా తీస్తున్న సమయంలో నాన్నగారు అన్నయ్యను నా వెంట పంపేవారు. అన్నయ్య మరణం మిగిల్చిన దుఃఖానికి కాలమే మందు.

• అక్కినేని, చంద్రబాబు పాత్రలు కూడా కీలకం కదా!

అవును. అందుకే, సుమంత్‌తో అక్కినేని నాగేశ్వరరావు గారి పాత్ర చేయించాం. నాగార్జున కన్నా సుమంత్‌లో ఏయన్నార్ పోలికలు ఎక్కువ. పైగా తాత దగ్గర పెరగడంతో, ఆయన పాత్రలో లీనమైపోయాడు. ఆ పాత్ర పోషిస్తే చాలు... ఆయన శైలినీ, డైలాగ్ డెలివరీనీ అనుకరించవద్దని చెప్పా. అలాగే చేశాడు. ఎన్టీఆర్, ఏయన్నార్ల జర్నీని సినిమాలో ఎక్కువగా చూపించాం. మధ్యలో వాళ్ళ మధ్య చిన్న చిన్న పొరపొచ్చాలు వచ్చి ఉండవచ్చు. అవి ఎక్కడైనా సహజం. కానీ, వాళ్ళ స్నేహానుబంధాన్నే చూపించాం. 'బాహుబలి'లో భల్లాలదేవుడి పాత్ర తరువాత రానాకు చంద్రబాబు నాయుడు పాత్ర పూర్తి విభిన్నం. ఆ పాత్రకు రానా బాగుంటాడని దర్శకుడు చెప్పగానే తీసుకెళ్ళి, చంద్రబాబుగారితో కలిపించా! నిజానికి, గడ్డంతో ఉన్న రానాను చూసి, చంద్రబాబు పాత్రలో ఎలా ఉంటారో అనుకున్నా. సెట్లో ఎన్టీఆర్, నాదెండ్ల పాత్రల మధ్య షూటింగ్ టైములో రానా గడ్డం లేకుండా చంద్రబాబు గెటప్‌లో వస్తే, దూరం నుంచి గుర్తుపట్టలేకపోయా. తీరా దగ్గరకు వచ్చినప్పుడు చూస్తే, అచ్చం చంద్రబాబే అనిపించారు. 'పాతాళభైరవి' సీన్ చిన్నది ఉంటుంది. అక్కడ ఎస్వీ రంగారావు గారి పాత్ర కోసం రాజనాల గారి మనుమడిని తీసుకున్నాం.

మిగతా 'దృశ్యం' పేజీలో..



నా భార్య లేకపోతే ముందుకు వెళ్లలేను!

ఆడపిల్లలిద్దరికీ పెళ్ళి చేసి, అత్తవారింటికి పంపేశాం కదా! వాళ్ళతో చిత్ర నిర్మాణం గురించి చర్చించాల్సిన పని లేదు. అయినా నా పనులకు పిల్లలు, నా శ్రీమతి వసుంధర సహకారం ఎప్పుడూ ఉంటుంది. నా భార్య సపోర్ట్ లేకపోతే ముందుకు వెళ్ళలేను. నిర్మాణం మొదలుపెట్టాలంటే, ప్రారంభ పెట్టుబడి కావాలి. తరువాత మనకు ఋణాలు వస్తాయి. ఒకవేళ ఏవైనా ఇబ్బందుల వల్ల లోన్లు రాకపోయినా, ఎన్టీఆర్ బయోపిక్ నిర్మాణానికి ఇబ్బంది రాకూడదని ముందుగా సిద్ధమయ్యాం. నా శ్రీమతికి తోడు, గతంలో నాతో 'బాలగోపాలుడు', 'అల్లరిపిడుగు', 'సుల్తాన్' తదితర చిత్రాలు తీసిన అనుభవజ్ఞుడైన నిర్మాత, మా తోడల్లుడు ఎం.ఆర్.వి. ప్రసాద్ లాంటి అందరూ నిలబడ్డారు. సాయి కొర్రపాటి, విష్ణు ఇందూరి ఉండనే ఉన్నారు.



పుణ్యదంపతులు: ఎన్టీఆర్, బసవరామతారకం

అమ్మ చాలా త్యాగం చేసింది!

కేవలం ఒక నటుడిగా కాకుండా, మామూలు మనిషిగా ఆఫ్ స్క్రీన్ ఎన్టీఆర్ ఎలా ఉంటారనే ఆసక్తికరమైన అంశాలను ఈ బయోపిక్‌లో చూపించాం. కాబట్టి, చాలా సహజమైన పద్ధతిలో సినిమా, పాత్రల ప్రవర్తన ఉంటుంది. నాన్నను అమ్మ ఎలా ప్రోత్సహించారనే అంశాలు కీలకంగా ఉంటాయి. నిజానికి, మా అమ్మ అనుక్షణం నాన్న కోసం ఆలోచిస్తుండేది. నాన్న కోసం ఆమె చాలా త్యాగం చేసింది. పిల్లల పెంపకం, ఇంటి బాధ్యతలతో అమ్మకు తీరికే ఉండేది కాదు. షూటింగ్ పేకప్ చెప్పాక, గారెలు తినాలని ఉంది. పది నిమిషాల్లో వస్తా అని నాన్నగారు కబురంపితే, ఆయన ఇంటికి వచ్చేలోపు రెడీ చేసి పెట్టేది. అమ్మే స్వయంగా చేసి పెట్టాలి. లేదంటే నాన్న గారు ముట్టేవారు కాదు. ఆమె చేతి వంట అంత రుచిగా ఉంటుంది.



సంక్రాంతి వ్యాపారం... 300 కోట్లు!!



'యన్.టి.ఆర్... కథానాయకుడు'
నిర్మాణ వ్యయం (రెండు భాగాలకు కలిపి): రూ.దాదాపు 100 కోట్లు
వ్యాపారం (థియేటర్, డిజిటల్, శాటిలైట్స్ రూపంలో): సుమారు రూ. 180 కోట్లు
విడుదల తేదీ (యన్.టి.ఆర్ - కథానాయకుడు): బుధవారం, జనవరి 9



'పేట'
తెలుగు హక్కులు: రూ. 18 కోట్లు
వ్యాపారం: రూ. 30 కోట్ల పైచిలుకు
విడుదల తేదీ: గురువారం, జనవరి 10



'వినయ విధేయ రామ'
నిర్మాణ వ్యయం: దాదాపు రూ. 110 కోట్లు
వ్యాపారం (థియేటర్, డిజిటల్, శాటిలైట్స్ రూపంలో): సుమారు రూ. 150 కోట్లు
విడుదల తేదీ: శుక్రవారం, జనవరి 11

కోడి పందాలు...
కోట్లు పెట్టి తీసే సినిమాలు... రెండూ ఒక్కటే!
కోడి పందాల్లో ఎప్పుడు కోట్లు వస్తాయో? ఎప్పుడు కోటులు మాత్రమే మిగులుతాయో? చెప్పలేని పరిస్థితి!! సినిమాల్లోనూ అంతే... ఏ సినిమాకు ఎంత లాభాలు వస్తాయో? చెప్పలేం! ఓడలు బళ్ళు కావొచ్చు... బళ్ళు ఓడలు కావొచ్చు! అందుకని, సంక్రాంతి సీజన్ ముగిశాక.. కోడి పందాల్లో ఎంత వచ్చింది? ఎంత పోయింది? అని లెక్కలు వేసుకుంటారు! సినిమా విడుదల తర్వాత ఎవరికి లాభాలొచ్చాయి? ఎవరికి నష్టాలొచ్చాయి? అని నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు లెక్కలు వేసుకుంటారు!! ఈ సంక్రాంతి మాత్రం సినిమాల విడుదలకు ముందే నిర్మాతలకు లాభాలు తెచ్చింది.

సంక్రాంతికి నాలుగు చిత్రాలు థియేటర్లలోకి వస్తున్నాయి. ఒకటి... ఎన్టీఆర్ బయోపిక్ తొలి భాగం 'యన్.టి.ఆర్ - కథానాయకుడు'. రెండు.. 'పేట'. మూడు... 'వినయ విధేయ రామ'. నాలుగు... 'ఎఫ్2'. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించి, నిర్మించిన 'యన్.టి.ఆర్ - కథానాయకుడు' అన్నిటి కంటే ముందు ప్రేక్షకుల ముందుకొస్తుంది. బాక్సాఫీస్ వద్ద ఈ నెల 9న బోణీ చేస్తుంది. తర్వాతి రోజు రజనీకాంత్ నటించిన 'పేట', ఆ తర్వాత రోజు రామ్‌చరణ్ హీరోగా బోయపాటి దర్శకత్వంలో రూపొందిన 'వినయ విధేయ రామ', ఆ తర్వాతి రోజు వెంకటేశ్, వరుణ్‌తేజ్ హీరోలుగా నటించిన 'ఎఫ్ 2' ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. నలుగురు నిర్మాతలు ఈ సినిమాపై పెట్టిన పెట్టుబడి... సుమారు రూ. 200 కోట్లు! విడుదలకు ముందు వ్యాపారం బాగా జరగడంతో నిర్మాతలకు సుమారు రూ. 300 కోట్లు వచ్చాయి! డిస్ట్రిబ్యూటర్లకు లాభాలు రావాలంటే వ్యాపారానికి రెండింతలు వసూళ్ళ రూపంతో రావాల్సి ఉంది.

'యన్.టి.ఆర్' బయోపిక్ రెండు భాగాలను సుమారు రూ. 100 కోట్ల బడ్జెట్‌లో తీశారు. థియేటర్ డిస్ట్రిబ్యూషన్ హక్కులతో పాటు డిజిటల్, శాటిలైట్ రైట్స్ కలిసి దాదాపు రూ. 180 కోట్ల వరకూ వచ్చాయని వినికిడి. ఒక్కో భాగానికి రూ. 50 కోట్లు ఖర్చు అయ్యిందనుకుంటే... రూ. 40 కోట్లు లాభం వచ్చినట్టే. దర్శకుడు బోయపాటి శ్రీను సినిమాలో... భారీతనం కనిపిస్తుంది. అందుకు తగ్గట్టు 'వినయ విధేయ రామ' బిజినెస్ జరిగి, నిర్మాత డీవీవీ దానయ్యకు రూ. 40 కోట్ల లాభం వచ్చిందంటున్నారు. ఈ సినిమాకు హిందీ శాటిలైట్ రూపంలో రూ. 22 కోట్లు వచ్చాయని తెలుస్తోంది. ఫన్ అంటూ ప్రేక్షకుల ముందుకొస్తున్న 'ఎఫ్ 2'ను రూ. 35 కోట్ల బడ్జెట్‌లో పూర్తి చేశారు 'దిల్' రాజు. ఈ సినిమా హక్కులు రూ. 50 కోట్లకు అమ్మారని టాక్. స్ట్రయిట్ తెలుగు సినిమాల నడుమ వస్తున్న డబ్బింగ్ సినిమా 'పేట'. '2.0' విజయం తర్వాత వస్తున్న రజనీకాంత్ సినిమా కావడంతో ప్రేక్షకుల్లో కాస్త అంచనాలు నెలకొన్నాయి. '2.0'కి ముందు వచ్చిన రజనీ చిత్రాలు 'కబాలి', 'కాలా' ఇటు ప్రేక్షకుల్ని... అటు వ్యాపార వర్గాలను... ఆశించిన రీతిలో ఆకట్టుకోలేదు. దాంతో తెలుగు థియేట్రికల్ రైట్స్ రూ. 20 కోట్లలోపే పలికాయట! కొన్ని ఏరియాల్లో సినిమా పంపిణీ హక్కులను అమ్మేసిన వల్లభనేని అశోక్... నైజాంలో స్వంతంగా విడుదల చేస్తున్నారట! సంక్రాంతి పోటీలో ఈ చిత్రం రూ. 30 కోట్ల వసూళ్ళు రాబట్టే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తానికి ఈ నాలుగు చిత్రాలు నిర్మాతలకు లాభాలు అందించాయి. డిస్ట్రిబ్యూటర్లు లాభాలు అందుకుంటారో? లేదో? చూడాలి!

సంక్రాంతి చిత్రాల ప్రత్యేకత ఏంటంటే... ఓ చిత్రంతో మరో చిత్రానికి సంబంధం లేకపోవడం! 'యన్.టి.ఆర్' బయోపిక్ అయితే... 'వినయ విధేయ రామ' పూర్తిగా వాణిజ్య హంగులతో, కుటుంబ విలువలతో రూపొందిన మాస్ మసాలా సినిమా. 'ఎఫ్ 2' వినోదాత్మక సినిమా. రజనీకాంత్ శైలిలో సాగే చిత్రంగా 'పేట' ఉండబోతుందని తెలుస్తుంది. ఏ సినిమా ప్రత్యేకత దానిదే! అందువల్ల.. ఏ రెండు సినిమాల మధ్య పోటీ ఉండదని, సంక్రాంతికి వరుస సెలవులు ఉండటంతో ఓ సినిమా చూసిన ప్రేక్షకులు మరో సినిమా చూసే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాల అంచనా. ప్రేక్షకులు థియేటర్లకు రావాలంటే... సినిమాలకు హిట్ టాక్ వస్తే చాలు!



'ఎఫ్2'
నిర్మాణ వ్యయం: సుమారు రూ. 35 కోట్లు
వ్యాపారం (థియేటర్, డిజిటల్, శాటిలైట్స్ రూపంలో): దాదాపు రూ. 50 కోట్లు
విడుదల తేదీ: శనివారం, జనవరి 12

ఎలక్షన్ల కోసం తీయలేదు!

('నవ్య' మొదటి పేజీ తరువాయి...)

● **బయోపిక్ గురించి చంద్రబాబు సలహాలిచ్చారా?**


వెళ్ళి కలిసినప్పుడు రెండు, రెండున్నర గంటల సమయం ఇచ్చి, రానాతో, నాతో గడిపారు. ప్రత్యేకించి సలహాలేమీ ఇవ్వలేదు కానీ, 'పెద్దాయన సినిమా! జాగ్రత్తగా, బాగా తీయండి' అని మాత్రం అన్నారు. నిజం చెప్పాలంటే, అంతకు ముందెప్పుడో ఓ సంక్రాంతికి నారావారి పల్లె వెళ్ళినప్పుడే నేను మా బావ (చంద్రబాబు) గారి విద్యార్థి దశ రోజుల నుంచి నాన్నగారితో ప్రయాణం, అనుబంధం, 1984 నాటి ఆగస్టు సంక్షోభం దాకా... అన్నీ ఇంటర్వ్యూ చేస్తూ, అడిగి తెలుసుకొని, రికార్డు చేసుకున్నా. ఆ సమాచారం అంతా తెలిసినప్పుడే, ఫలానా పాత్ర ఫలానాలా ఎందుకు ప్రవర్తించిందో, అంతర్లీనంగా అర్థమవుతుంది. తెరపై చూపించగలుగుతాం.

● **చెప్పిన కథకు ఫిక్సయ్యే మీరు, చివరిదాకా మెరుగులు దిద్దే క్రిష్. కానీ, మీ మధ్య బాగా కుదిరిందే?**

నటుడిగా నాలోని అన్ని కోణాలూ తెలిసి, నన్ను పూర్తిగా అర్థం చేసుకున్న నేటి తరం దర్శకులు ఇద్దరు... బోయపాటి శ్రీను, క్రిష్. క్రిష్, సినిమాటోగ్రాఫర్ బాబా (జ్ఞానశేఖర్), రచయిత సాయిమాధవ్‌లతో అత్యద్భుతమైన కాంబినేషన్.

● **క్రిష్ ఉన్నా, మీరే కొంత డైరెక్ట్ చేశారని ఓ టాక్!**

అదేమీ లేదు. మా మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంది. ఒకరికొకరం బాగా తెలుసు. అర్థం చేసుకున్నాం. చిన్న చిన్న సలహాలు ఇచ్చా. అయినా, చిత్రీకరణ సమయంలో సినిమా బాగా రావడానికి ఒకరి ఆలోచన మరొకరు తీసుకుంటే తప్పేంటి? ఇప్పుడే కాదు... 'గౌతమీపుత్ర శాతకర్ణి'లో కూడా నాకు అనిపించిన షాట్లు కొన్ని తీశా. క్రిష్‌కీ, నాకూ అంత అనుబంధం. డైరెక్షన్ టేకప్ చేయడం నాకు కొత్త కాదు. గతంలో మా 'పెద్దన్నయ్య' సినిమాకు ఓ హాలీవుడ్ చిత్ర స్ఫూర్తితో క్లైమాక్స్ నేనే తీశా. అంతకు ముందు చిన్న గందరగోళంగా ఉన్నది కాస్తా, రెండురోజుల్లో షూటింగ్ అయిపోయింది. కెమెరా యాంగిల్ గనక తేడా ఉంటే, నేను డైలాగ్ చెప్పలేను, ఎమోషన్స్ పలికించలేను. నా సిక్స్త్ సెన్స్ చెప్పేస్తుంటుంది. అలాంటప్పుడు కెమెరా కదలిక మార్పించి, ఠక్కున చిత్రీకరణ ముగించా. 'శ్రీకృష్ణార్జున విజయము' షూటింగులో ఒక సీనులో చాలా టేకులు తీసుకున్నప్పుడు కూడా అలాగే చేశాం.



● **ఒకటి అనుకొని, బయోపిక్‌ను రెండు భాగాలుగా చేశారేం?**

(నవ్వేస్తూ...) మొదట ఒక సినిమా అనుకొనే దిగాం. కానీ, లార్జర్ దేన్ లైఫ్ ఇమేజ్, నటుడిగా, వ్యక్తిగా అపారమైన జనాభిమాన తేజం నిండిన నాన్న గారి కథను రెండున్నర గంటల్లో చెప్పడం సాధ్యం కాదని అర్థమైంది. అందుకే, చివరకు రెండు భాగాలుగా చేశాం. ఎనభై తొమ్మిది రోజుల్లో రెండు పార్టులూ పూర్తి చేశాం. రీరికార్డింగ్ మినహా ఎడిటింగ్, డబ్బింగ్ వగైరా అయిపోయాయి. సెకండ్ పార్టులో 5 శాతం ప్యాచ్ వర్కుంది. జనవరి 12 నుంచి 25 లోగా అదీ చిత్రీకరించేస్తాం. ఫిబ్రవరిలో రెండోపార్ట్ రిలీజ్.

● **చాలా వేగంగా తీయగలిగారే?**

ఈ సినిమాకు అన్నీ అలా కుదిరాయి. ఎయిరిండియా విమానంలో షూటింగ్ అనుకుంటే, ఎప్పుడూ లేనిది బేగంపేటలోని హ్యాంగర్‌లోనే విమానం ఉంది. వెంటనే అనుమతులు తీసుకొని, షూటింగ్ చేశాం.



కుమారులు జయకృష్ణ, బాలకృష్ణ, హరికృష్ణలతో... ఎన్టీఆర్

నాన్నగారు, చంద్రబాబు గారు వీళ్ళందరూ పాల్గొన్న శాసనసభ సమావేశాలను ఆనాటి అసెంబ్లీలో షూట్ చేశాం. నాన్నగారు కూర్చున్న సీటు చూసినప్పుడు ఎంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది.

● **కోట్లల్లో జరిగిన ఎన్టీఆర్ బయోపిక్ చిత్ర వ్యాపారం మీ కెరీర్లో, ఇండస్ట్రీలో ఇప్పుడో సంచలనం. ఈ క్రెడిట్ మీదా? నాన్నగారిదా?**

కచ్చితంగా నాన్నగారిదే. నేనెప్పుడూ నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శకులు బాగుండాలని కోరుకొనే వ్యక్తిని. ఈ అంకెల గురించి పట్టించుకోను. అంకెల కన్నా ముఖ్యంగా ఇది నాకు వ్యక్తిగతంగా ఎంతో సెంటిమెంట్ నిండిన సినిమా.

● **ఇతర భాషల్లోకి దీన్ని తీసుకెళ్ళే ఆలోచన?**

తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లో కూడా అనువదించి, విడుదల చేస్తాం. ఇక్కడ సెకండ్ పార్ట్ రిలీజ్ టైమ్‌కి తమిళంలో రిలీజ్ చేస్తాం. తమిళం వేరే వాళ్ళు డబ్బింగ్ చెబుతారు. హిందీ నాకు బాగా వచ్చు కాబట్టి, నేనే డబ్బింగ్ చెబుతా. రిలీజ్ డేట్ ఇంకా అనుకోలేదు.

● **ఎన్టీఆర్ జీవితం ఎక్కడ నుంచి ఎక్కడ దాకా చూపిస్తున్నారు?**

ఇది మా అమ్మ దృష్టిలో వచ్చే నాన్న గారి కథ. ఫస్ట్ పార్ట్ 'యన్.టి.ఆర్ - కథానాయకుడు'లో నాన్నగారి సినీ జీవిత ప్రస్థానం ఉంటుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ భాగం ముగుస్తుంది. ఇక, సెకండ్ పార్ట్ 'యన్.టి.ఆర్ - మహానాయకుడు'లో నాన్నగారి రాజకీయ సంచలనం, 1984 ఆగస్టు సంక్షోభం, తరువాత మళ్ళీ నాన్నగారు పదవిని చేపట్టడం వరకు ఉంటుంది. ఆ సంక్షోభ సమయంలో నాన్నగారు మళ్ళీ పట్టాభిషిక్తులవ్వాలని అమ్మ కోరుకుంది. అది నెరవేరడం, అమ్మ శివైక్యం వరకు అందులో చూపిస్తాం.

● **కానీ, మమ్మల్ని విలన్‌గా చూపిస్తే, కోర్టుకెక్కుతామని నాదెండ్ల భాస్కర రావు తదితరులు ఇప్పటికే హెచ్చరించారు కదా!**

ఆ సంగతి నాకు తెలీదు. ఫలానా వ్యక్తి హీరో, ఫలానా మనిషి విలన్ అని కాకుండా ప్రేమ, కోపం, ఈర్ష్య లాంటి వాళ్ళ మానవ సహజ లక్షణాలు, మనుషుల ప్రవృత్తులే చూపించాం. మేము ప్రతీదీ జరిగినదే చూపిస్తున్నాం. అవీ చూపించకూడదంటే బయోపిక్ ఎలా తీస్తాం!

● **రాజకీయ నేతల బయోపిక్స్ చాలా వస్తున్నాయి!**

అవును. ఇదో సీజన్‌లా ఉంది. నాకూ ఆశ్చర్యంగా ఉంది. మన్మోహన్ సింగ్, మోదీ, రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, కె.సి.ఆర్... ఇలా చాలానే రానున్నాయి.

● **ఎన్టీఆర్ బయోపిక్ రెండో పార్ట్ విడుదలైన మర్నాడే ఫిబ్రవరి 8న వై.ఎస్. రాజశేఖరరెడ్డి 'యాత్ర' రానుంది!**

(ఆశ్చర్యంగా...) అలాగా! మీరిప్పుడు చెప్పేదాకా నాకు ఆ సంగతి తెలీదంటే నమ్మండి. నా దృష్టి అంతా మా సినిమా మీదే ఉంది.

● **ఎన్నికల కోసం ఇద్దరు రాజకీయ నేతల చిత్రాల పోటాపోటీ అని జనం మాట!**

ఆ ఆలోచనే నాకు లేదు. ఎన్నికలప్పుడు రావాలని మేము అనుకోనే లేదు. ఎలక్షన్ల కోసం తీయలేదు. మీకు గుర్తుంటే, ఎన్టీఆర్ బయోపిక్ మొదట విజయదశమికి తేవాలనుకున్నాం. చివరకు ఫస్ట్ పార్ట్ సంక్రాంతికీ, సెకండ్ పార్ట్ ఫిబ్రవరికీ వస్తున్నాయి.

● **బయోపిక్స్ ఏమైనా చూశారా? చూస్తారా?**

సాధారణంగా నేను బయట సినిమాలు చూడడం తక్కువే. వాటిని చూస్తే, ఆ ప్రభావం తెలియకుండానే నాపై పడుతుందని చూడను. కాకపోతే, నాన్నగారి బయోపిక్ అనుకున్నాక హాలీవుడ్‌లో వచ్చిన 'అబ్రహమ్ లింకన్' లాంటి బయోపిక్‌లూ, ఇతర సినిమాలైన 'గాడ్ ఫాదర్' లాంటివీ ఒక ఉత్తేజం, స్ఫూర్తి కోసం చూశా. ఎంత వరకు, ఎలా తీశారని ఆ మధ్య 'మహానటి' కూడా చూశా. బాగా తీశారు.

● **ఎన్నికలొస్తున్నాయి. పోటీ చేస్తున్నారా? ఎమ్మెల్యేగానా? ఎంపీగానా?**

తప్పకుండా పోటీ చేస్తాను. మిగతా వివరాలు అన్నీ మా పార్టీ నిర్ణయిస్తుంది.

● **ఇటీవలి తెలంగాణ ఎన్నికల ఫలితాలు నిరాశపరిచాయా?**

నిరాశలోకి దిగి, నీరసపడిపోతే కష్టం. ఏదైనా సరే, స్వీకరించి, నిబ్బరంగా ఉండాలి.

● **కానీ, కుకట్‌పల్లిలో నందమూరి సుహాసిని ఓటమి...**

(మధ్యలోనే అందుకుంటూ...) మా ఇంటి అమ్మాయి ఇంట్లో నుంచి బయటకు వచ్చి, పోటీ చేయడం ఇదే మొదటిసారి. దురదృష్టవశాత్తూ, విజయం రాలేదు. కానీ, ప్రతిదీ సెన్సిటివ్‌గా తీసుకుంటే, ముందుకు వెళ్ళలేం.

● **అమ్మానాన్నల విషయంలో తీరని కోరికలు ఏమైనా ఉన్నాయా? స్మారకంగా ఏమైనా చేయాలనుకుంటున్నారా?**

శాతకర్ణితో అమ్మ రుణం, బయోపిక్‌తో నాన్న రుణం కొంత తీర్చుకున్నా. మా నిమ్మకూరులో ఏదో ఒకటి చేద్దామనుకుంటున్నాం. నానమ్మ అప్పట్లో కట్టించిన పాత డాబాను కొత్తగా పునర్నిర్మించాలనుకుంటున్నాం. ఒకప్పుడు ఎలా ఉందో అలాగే చేస్తాం. అక్కడున్న చెరువు దగ్గర నాన్నగారి పెద్ద విగ్రహం చేయిద్దామని ఉంది.

త్వరలోనే ఆసుపత్రి... స్టూడియో!

విజయవాడ దగ్గరలోనే ఆధునిక వసతులతో, వెయ్యిపడకల క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నా. ప్రభుత్వం నుంచి స్థలం కూడా కొన్నా. మాఘమాసంలో భూమి పూజ చేస్తాం. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా స్టూడియో కూడా పెట్టాలనుకుంటున్నా. అది వైజాగ్‌లోనా, విజయవాడలోనా అన్నది నిర్ణయించుకోలేదు. ఇక, ప్రభుత్వ పక్షాన అమరావతి దగ్గర నాన్నగారి మ్యూజియమ్ ప్రతిపాదన ఉంది. ఎన్నికల్లో గెలిచి, మళ్ళీ అధికారంలోకి వచ్చాక ఆ పని ముందుకు వెళుతుంది.

● **మరో బయోపిక్ తీసే ఆలోచన?**

ఎన్టీఆర్ లాంటి విస్తృతి ఉన్న కథ మరొకటి చాలా కష్టం. ఆధ్యాత్మిక సంఘ సంస్కర్త శ్రీమత్ రామానుజాచార్య జీవితంపై నా 60 ఏళ్ళ వయసులో సినిమా చేస్తానని గతంలో మీకు చెప్పా. కట్టె... కొట్టె... తెచ్చె పద్ధతిలో ఆయన గురించి కథ తెలుసు. సమయం వచ్చినప్పుడు దాని మీద కూర్చొని, సిద్ధం చేస్తా. ఇప్పుడే దాని గురించి కూర్చుంటే బోర్ కొట్టేస్తుంది. ఏదైనా వేడివేడిగా వడ్డించడం నాకు అలవాటు.

● **మరి, రానున్న బోయపాటి శ్రీను సినిమా ఎలా ఉంటుంది?**

ఆయనతో సినిమా అంటే నేను కథ కూడా వినను. అంత నమ్మకం. నా పాత్ర, పాత్ర చిత్రణ మాత్రం చెప్పారు. గో ఎహెడ్ అన్నా. ఈ బయోపిక్ రెండు భాగాలు, ఎన్నికల హడావిడి చూసుకొని, ఆ సినిమా మొదలుపెడతాం.

'నెట్'హిట్... ఇది ఫిక్స్!

ఇప్పుడంతా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌దే రాజ్యం. మరి అందులో ప్రసారమైన సినిమా లేదా వెబ్‌సిరీస్ హిట్టా? ఫట్టా? అని తెలియాలంటే రివ్యూలు చూడాల్సిందే. కానీ నెట్‌ఫ్లిక్స్ తొలిసారిగా ఓ సినిమా ఎంత మంది చూశారో వెల్లడించడం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇప్పటివరకూ ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో విడుదలైన ఏ సినిమా విషయంలోనూ ఇలా జరగలేదు. ఇంతకీ విషయమేమిటంటే... ప్రముఖ హాలీవుడ్ నటి శాండ్రా బుల్లక్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బర్డ్‌బాక్స్'. గత ఏడాది డిసెంబర్ 13న నెట్‌ఫ్లిక్స్‌లోనే కాకుండా అమెరికాలో కొన్ని థియేటర్లలో విడుదలైంది. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. కంటికి కనబడని శత్రువులు ప్రపంచాన్ని కబళిస్తాయి. వాటిని చూస్తే అంతమవడం ఖాయం. అందుకే సినిమాలో పాత్రలన్నీ కళ్లకు గంతలు కట్టుకుంటాయి. ఈ విపత్కర పరిస్థితుల నుంచి కథానాయిక తన పిల్లలతో సహా ఎలా బయటపడిందన్నదే ఈ సినిమా ఇతివృత్తం. కొన్ని నెలల క్రితం విడుదలైన ఈ సినిమా ట్రైలర్ చూసి 'ఎ క్వైట్ ప్లేస్' (2018) తరహాలో ఉందని చాలా మంది విమర్శించారు. అయితే ఈ సినిమా బాగుండటంతో ఎవరూ ఆ విమర్శలను పెద్దగా పట్టించుకోలేదు. డిసెంబర్ 21 నుంచి డిసెంబర్ 27 వరకు 4 కోట్ల 50 లక్షల మంది ఈ చిత్రాన్ని వీక్షించారని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ట్వీట్ చేసింది. అయితే ఈ చిత్రాన్ని థియేటర్‌లోనే పూర్తిస్థాయిలో విడుదల చేసి ఉంటే ఇంకా బాగా వసూళ్లు దక్కేవని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.



శాండ్రా బుల్లక్



'బర్డ్‌బాక్స్' చిత్రంలోని ఓ దృశ్యం

టీవీ దృశ్యం

మరో 'చరిత్ర'!

ఈ సంక్రాంతికి విడుదల కానున్న ఎన్టీఆర్ బయోపిక్ తొలిభాగం 'కథానాయకుడు'తో సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో నిలిచారు దర్శకుడు క్రిష్. ఈ బయోపిక్ రెండో భాగం 'మహానాయకుడు' వచ్చే నెలలో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ బయోపిక్ హడావిడిలో ఉన్న క్రిష్ తదుపరి తర్వాతి ప్రాజెక్ట్‌గా ఓ వెబ్‌సిరీస్‌ను ఎంచుకున్నట్లు టాక్. తాజాగా విడుదలైన 'అంతరిక్షం- 9000 కెఎమ్‌పీహెచ్' చిత్రానికి ఆయన సమర్పకుడిగా కూడా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గతంలో బాలకృష్ణ హీరోగా 'గౌతమీపుత్ర శాతకర్ణి' అనే చారిత్రక చిత్రాన్ని తెరకెక్కించిన క్రిష్ మరోసారి అదే తరహా కథాంశంతో ఈ వెబ్‌సిరీస్‌ను రూపొందించనున్నారట! 'రాజ రాజ చోళ'ని చరిత్రే దీని కథాంశమని సమాచారం. చాలా ఏళ్ల క్రితం 'బాషా' చిత్రంతో సంచలనం రేపిన దర్శకుడు సురేశ్‌కృష్ణ దీనికి దర్శకత్వం వహించనున్నారట. మొత్తం ఆరు భాగాల వెబ్‌సిరీస్‌గా దీన్ని తమిళంలో రూపొందించి, ఆ తర్వాత తెలుగులోకి అనువదించాలనే ఆలోచనలో క్రిష్ ఉన్నారని తెలుస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.



క్రిష్

స్వాతిశయం విడిచి...


చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

ఇరవై రెండో పాశురం

అంగణ్ మాజ్ఞాలత్తరశర్ అభిమాన
బజ్ఞమాయ్ నన్దు నిన్ పళ్ళిక్కట్టిల్ కీళే
శజ్ఞమిరుపార్ పోల్ వన్దుతలై ప్పెయ్ దోమ్
కింగిణివాయ్ చ్చెయద తామరప్పూప్పోలే
శెంజ్ఞణ్ శిరిచ్చిరిదే యేమ్మేల్ విళియావో
తింగళు మాదిత్తియను మెళున్దార్పోల్
అజ్ఞణ్ణిరణ్డుం కొండు ఎజ్ఞళ్ మేల్ నోక్కుదియేల్
ఎజ్ఞళ్ మేల్ చాబ మిళన్దేలో రెమ్బావాయ్!

ఇరవయ్యొకటో పాశురంలో గోపికలు అహంకార, మమకారాలకు అతీతమైన తమ మనఃస్థితిని కృష్ణుడికి తెలియబరిచారు. ఈ పాశురంలో తమ 'అనన్య శేషత్వం' (కేవలం భగవానుణ్ణి మాత్రమే అనన్యగతిగా నమ్ముకొని, ఆయనకు మాత్రమే కైంకర్యం చేసే నిష్ఠ) గురించి ఆయనకు విన్నవించుకుంటున్నారు. నప్పిన్నపిరాట్టి (శ్రీకృష్ణుని దేవేరి) అనుజ్ఞ ఇవ్వడంతో... కృష్ణుడి శయనమందిరంలోకి గోపికలతో కలిసి ఆండాళ్ ప్రవేశించింది. ఆయన శ్రీచరణాల సమీపానికి శుద్ధమైన తత్త్వజ్ఞానంతో చేరుకున్న తమలో ఉన్న భ్రమలు తొలిగిపోయాయనీ, తాము సంపూర్ణంగా అర్హులమైనప్పటికీ... ఏదో శాపవశాన తమకు ఇంతవరకు కృష్ణానుగ్రహం లభించలేదనీ ఆ గొల్ల పిల్లలు విన్నవించుకుంటున్నారు. తమను అపార దయాదృక్కులతో చూసి, పాపకర్మాలను తొలగించి, తమ అనుష్ఠానాన్ని పరిపూర్ణం చెయ్యాలని శ్రీకృష్ణుణ్ణి వినమ్రంగా వేడుకుంటున్నారు.
గొప్ప రాజ్యాలను ఏలే రాజులు పరాజితులై... సార్వభౌముడి ఎదుట పాదాక్రాంతులైనట్టు - గోపికలు దేవాధిదేవుని ఎదుట మోకరిల్లి శరణాగతులయ్యారు. "ఓ స్వామీ! స్వాభిమానం, దురభిమానం, అహంభావం తొలగి, నీ పదపంకజాలను అనన్యగతిగా ఆశ్రయించిన భూపతుల్లా... స్వాతిశయం తొలిగి నీ చరణాబ్జాలను చేరుకున్నాం. మెలమెల్లగా తెరుచుకొనే నీ అరవిందనయనాల వాత్సల్య దృక్కులు మా మీద ప్రసరించు. సూర్యచంద్రుల కాంతితో ఒప్పే నీ అందమైన చల్లని చూపుల ప్రవాహంలో పాపపంకిలంలా పేరుకుపోయిన మా సంచిత, ఆగామి కర్మలు ప్రక్షాళనమై పోనీ!" అని వారు ప్రార్థిస్తున్నారు.

కృతార్థుల్ని చేసేది ఆ చూపులే!


అహంకారానికి మరో రూపం అభిమానం. తత్త్వపరంపరలో ఇరవై రెండవది అహంకారం. అభిమానభంగం అంటే అతిశయభంగం గురించి ఆండాళ్ ఇరవై రెండో పాశురంలో అన్యాపదేశంగా చెబుతోంది. శ్రీకృష్ణుని పరవాసుదేవునిగా గుర్తించి ఆండాళ్, గోపికలు ఆయన పాదాల వద్దకు చేరి వినమ్రులై, ఆరాధనాభావంతో నిలబడ్డారు. ఆయన కళ్ళు తెరిచి, కటాక్ష వీక్షణాలతో తమ వంక చూడాలని కోరుకున్నారు. కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుని సహాయం అర్థించడానికి వెళ్లిన దుర్యోధనుడు ఆయన శిరస్సు వద్ద కూర్చొని ఎదురుచూస్తే, అర్జునుడు పాదాల వద్ద కూర్చుని ఆయన మేలుకోవడం కోసం ఎదురు చూశాడు. కృష్ణుడు నిదుర లేవగానే ఆయన కృపాదృష్టి సహజంగానే అర్జునుడి మీద ప్రసరించింది. కృష్ణుడు కావాలని అర్జునుడు కోరుకుంటే, దుర్యోధనుడు చతురంగబలాలను కోరుకున్నాడు. ఫలితం అందరికీ తెలిసిందే!

తిరుప్పావై

సూర్యచంద్ర విలోచనుడైన పరంధాముడు తన చల్లని వెన్నెలల వంటి చూపులతో భవరోగతాపాన్ని హరిస్తాడు. సూర్యభగవానుడు తన ప్రచండతేజంతో అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలుతాడు. అందుకే కృష్ణుని దృక్కులు తమ వంక ప్రసరించి కృతార్థులను చెయ్యాలని ఆండాళ్ ఈ పాశురంలో ప్రార్థిస్తోంది. ఒక్క కంటితో లేక అరమూసిన కన్నుతో చూడడం కామవికార చేష్ట! తల్లి బిడ్డ వంక చూసినంత స్వచ్ఛమైన వాత్సల్యంతో - రెండు పద్మాల వంటి కన్నులను విప్పార్చి తమ వంక చూడమని భగవానుణ్ణి అడుగుతోంది ఆండాళ్. "మా రాకలోని ఉద్దేశ్యం రాసక్రీడలోని మదన వికారం కాదు, మోక్షమార్గ దర్శనం కోసమే సుమా మేము నీ దగ్గరికే వచ్చింది!" అంటున్నారు గోపికలు. ఈ ఇరవై రెండో పాశురాన్ని నియమంగా ప్రతి దినం భక్తిశ్రద్ధలతో పఠిస్తే భగవానుడు చేతనుల పాపకర్మలను దగ్ధం చేయగలడని పూర్వాచార్యులు తమ హితబోధలలో పేర్కొన్నారు.
ఆండాళ్ తిరువడిగళే శరణం!

● శ్రీదేవీ మురళీధర్


ముత్యాల ముగ్గు




పి.స్వాతి
కందుకూర్, రంగారెడ్డి జిల్లా


భీరమ్మ
బైరమల్‌గుడ, హైదరాబాద్

7 చుక్కలు నుంచి 1 ఎదురు చుక్క వచ్చేదాకా





గడ్డం వాణి
వరంగల్



30 చుక్కలు, 10 వరుసలు, 10 వచ్చేదాకా


సుగుణ
అనంతపురం



20 చుక్కలు, 2 వరుసలు, 2 వచ్చేదాకా

ముగ్గులు పంపాల్సిన చిరునామా: నవ్య, ముత్యాల ముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: navya@andhrajyothy.com

డైలీ సుడోకు - 417

6	9			3				7
8	7		6	9		2		
2				7	5			
1		7			3	5		4
	2	4		6		1	8	
5		6	1			7		9
			4	5				8
		9		8	6		1	2
7				1			9	5

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 416 సమాధానం

4	8	3	1	6	7	5	2	9
5	6	1	9	2	8	7	4	3
7	9	2	4	3	5	1	6	8
1	2	4	7	5	3	8	9	6
8	5	9	2	1	6	3	7	4
6	3	7	8	4	9	2	1	5
9	1	8	5	7	4	6	3	2
2	4	6	3	8	1	9	5	7
3	7	5	6	9	2	4	8	1



అందరినీ గమనిస్తుంటా

- కాజల్

"శూన్యంలో నుంచి ఏదీ పుట్టదు. అది వస్తువైనా.. నటనైనా! ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఏదో ఒకటి సాధించాలంటే ఎంతో కొంత శ్రమించాలి" అని అంటున్నారు కాజల్. ఓ సినిమా అంగీకరించిన తర్వాత తాను చేసే హోమ్‌వర్క్ గురించి కాజల్ మాట్లాడుతూ "నేను కచ్చితంగా స్క్రిప్ట్ విన్నాకే సినిమాను అంగీకరిస్తాను. ఆ క్రమంలో నా పాత్ర ఎలా ప్రవర్తిస్తుందో నాకు ఓ అవగాహన వస్తుంది. ఆ పాత్రకు రిఫరెన్స్‌లు మన సమాజంలో ఎంతో మంది ఉంటారు. ఆ సినిమా సెట్స్‌కు వెళ్లేవరకు అలాంటివారిని గమనిస్తూ ఉంటాను. దీని వల్ల సెట్లో తడుముకోకుండా పాత్రలో తేలిగ్గా లీనం కాగలుగుతానని నా నమ్మకం" అని చెప్పారు. ఆమె ప్రస్తుతం 'ప్యారిస్ ప్యారిస్', 'ఇండియన్2', 'సీత', 'కోమలి' చిత్రాల్లో నటిస్తున్నారు.

ఫ్యా..మి..లీ.. గ..య్..!

సినిమా చూసినంత ఈజీగా ఉండదు షూటింగ్ చేయడం. కొన్నిసార్లు నిర్విరామంగా జరిగే షూటింగ్‌లో ఎంతటివారైనా అలసిపోవాల్సిందే. హీరో మహేశ్ కూడా అందుకు అతీతులు కాదు. అయినా ఆయన ఎప్పుడూ ఉల్లాసంగా కనిపిస్తారు. ఆ రహస్యం పేరు 'సితార' అని నెటిజన్లకు ఈ మధ్య తెలిసొచ్చింది. 'నా సోదరుడు ఫ్యామిలీ గయ్' అని తన కుమార్తె సితార ముద్దుముద్దుగా చెబుతున్న వీడియో ఒకదాన్ని మహేశ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అందులో సితార మాట్లాడిన ఇంగ్లిష్ అందరినీ ఆకట్టుకుంటోంది. అతి తక్కువ సమయంలో ఈ వీడియోకు ఎక్కువ వ్యూస్ కూడా వచ్చాయి. తన సోదరుడు గౌతమ్ ఇప్పటివరకు ఒంటరిగా ఎక్కడికీ వెళ్లలేదని అతడు ఫ్యామిలీ గయ్ అని పదాలను సాగదీసి సితార చెప్పిన తీరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది.



మహేశ్‌బాబు, సితార

నాలాంటి భార్య దొరకడం కష్టమే!

- నిధీ అగర్వాల్

సూటిగా... సుత్తి లేకుండా... ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులు అడిగిన ప్రశ్నలకు నిధీ అగర్వాల్ సమాధానాలు చెప్పారు. నాగచైతన్య 'సవ్యసాచి'తో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైన ఈ భామ... త్వరలో అఖిల్ 'మిస్టర్ మజ్ను'తో సందడి చేయనున్నారు. ఇంతకీ... ఇన్‌స్టాలో నిధీని ప్రేక్షకులు ఏయే ప్రశ్నలు అడిగారు? ఇన్‌స్టంట్‌గా ఆమె ఎటువంటి సమాధానాలు ఇచ్చారు? చదవండి!

తెలుగు ప్రజలపై మీ అభిప్రాయం: అద్భుతమైన వ్యక్తులు... విధేయులు!

కొత్త ఏడాదికి తీసుకున్న నిర్ణయం: భయం లేకుండా ఉండాలని!

బిర్యానీ ఇష్టమేనా?: ప్రేమ! ఐ లవ్‌... బిర్యానీ.

'అర్జున్‌రెడ్డి' చూశారా?: నాలుగుసార్లు చూసిన తొలి సినిమా. కావాలని మళ్ళీ మళ్ళీ చూశా!

మీ రోల్ మోడల్: దీపికా పదుకోన్

నాకు మీలాంటి భార్య కావాలి!?: అర్రే... యేతో బహుత్ ముష్కిల్ హై! నాలాంటి భార్య దొరకడం కష్టమే!!

ఎవరైనా సౌతిండియన్ స్టార్ మీద మనసు పడ్డారా?: అవును... పడ్డాను. కానీ, అతనెవరో నేను చెప్పలేను!

మీ లక్ష్యం ఏంటి?: నా శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవాలనుకుంటున్నా. నిన్నటి కంటే ఈ రోజు మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నా! నా స్థాయికి తగ్గట్టు రాణించాలి. ఎందుకంటే... నా శక్తి సామర్థ్యాలకు తగ్గట్టు నా స్థాయికి నేను చేరుకుంటే చాలు!




ఒకింటివారైన నోయల్ - ఎస్తర్



గాయకుడు, నటుడు నోయల్, హీరోయిన్ ఎస్తర్ వివాహం జరిగింది. ఈ విషయాన్ని నోయల్ తన ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. తేజ దర్శకత్వం వహించిన 'వెయ్యి అబద్ధాలు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన నటి ఎస్తర్. 'భీమవరం బుల్లోడు', 'జయజానకీనాయక' చిత్రాల్లోనూ నటించారు. 'సంభవామి యుగే యుగే'తో నటుడిగా పరిచయమైన నోయల్ తాజాగా 'పడిపడి లేచే మనసు'లో కనిపించారు. తన పెళ్లి గురించి నోయల్ ట్విట్టర్‌లో "ఇకపై మేం ఇద్దరం కాదు. ఒక్కరమే. ఆమె నా హృదయ సామ్రాజ్ఞి" అని ట్వీట్ చేశారు. 'జస్ట్ మ్యారీడ్' అనే హ్యాష్ ట్యాగ్‌ను జతపరిచారు.

యువత 'ధీవర'



వైవిధ్యమైన స్క్రీన్‌ప్లేతో తెరకెక్కుతోన్న చిత్రం 'ధీవర'. నాగసాయి, విద్యా చైతన్య జంటగా నటిస్తున్నారు. కె.విజయ్ జిక్కి దర్శకుడు. హరనాథబాబు నిర్మాత. భగీరథ ఆర్ట్ క్రియేషన్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ విడుదల చేశారు. పోస్టర్ చూడగానే, యువతకు నచ్చే కాన్సెప్ట్ అని అర్థమైందని ఆయన తెలిపారు. "స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే సినిమా. ప్రేమ, సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్లలో ఉంటుంది" అని దర్శకుడు చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ "యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. త్వరలోనే ఆడియో, ట్రైలర్ విడుదల చేస్తాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలాఖరున చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని చెప్పారు. ఈ సినిమాకు కెమెరా: సాగర్ గొళ్ళా, సంగీతం: అద్దంకి వెంకటేశ్.

సస్పెన్స్ థ్రిల్లర్!



ధ్రువ, వినాయక్, విశ్వనాథ్

ధ్రువను హీరోగా పరిచయం చేస్తూ జైరామ్ దర్శకత్వంలో విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన 'యమ్ 6' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వి.వి.వినాయక్ ఆవిష్కరించి యూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో ధ్రువ సరసన బెంగళూరు అశ్విని కథానాయికగా నటించింది. సినిమాలో సంగీతం, ఫొటోగ్రఫీ, సస్పెన్స్, కామెడీ, యాక్షన్ హైలైట్‌గా నిలుస్తాయి. సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే 'ఈ క్షణం..' పాటను మంగళూరు, అరకులో చిత్రీకరించాం. 'యమ్ 6' అనే టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ఒక మంచి సినిమాతో పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని హీరో ధ్రువ చెప్పారు.



విదేశీ విద్యార్థులూ..

వెళ్లిపోకండి..

- అమెరికాకు మీ మేధస్సు అవసరం
- సరిహద్దుల్లో భద్రత పెరగాలి : ట్రంప్

వాషింగ్టన్, జనవరి 5 : అమెరికాలోని అత్యున్నత విద్యాసంస్థల్లో చదువుతున్న విదేశీ విద్యార్థులు తమ దేశంలోనే ఉండిపోవాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. వారు తమ ప్రతిభా నైపుణ్యాలను ఇక్కడి కంపెనీల అభివృద్ధి కోసం వినియోగించాలని సూచించారు. శనివారం ఆయన వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మరోసారి చట్టబద్ధ వలసల తీరుపై మండిపడ్డారు. పరిహాసప్రాయ వలస విధానాల వల్ల గొప్ప మేధస్సులను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బయట దేశాల నుంచి అమెరికాకు వచ్చేవారికి ప్రతిభే గీటురాయి కావాలని తన ప్రభుత్వం కోరుకొంటున్నదని తెలిపారు. అలాంటి వారు ఇక్కడి కంపెనీలు, సంస్థల్లో పనిచేసే వాతావరణం ఉండాలన్న ఆయన దీనికోసం చట్టబద్ధ వలస వ్యవస్థలోని లోపాలను వెంటనే సరిదిద్దాల్సిన అవసరం ఉన్నదన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థల్లో విద్యను ఆర్జించిన విదేశీ విద్యార్థులు జపాన్, చైనా వంటి బయట దేశాలకు వెళ్లి పని చేస్తుండటం విచారకరమన్నారు. “మనకు గొప్ప వ్యక్తులు కావాలి. అయితే, వారంతా ప్రతిభ ఆధారంగానే రావాలి. కొన్నేళ్లుగా కొనసాగుతున్న పద్ధతుల్లో వస్తామంటే మాత్రం మాకు అక్కర్లేదు” అని స్పష్టం చేశారు. అమెరికాలోని అత్యున్నత విద్యాసంస్థల్లో చదివి, మంచి ప్రతిభ ఉన్నవారిని దేశంలోనే ఉండేలా చేయలేకపోతున్నామని ప్రతిష్ఠాత్మకమైన ఐటీ కంపెనీలు తనకు ఫోన్ చేసి బాధ పడుతున్నాయని తెలిపారు. అమెరికా విద్యా సంస్థల్లో చేరి, జ్ఞానం పెంచుకొని, ప్రతిభకు మెరుగులు దిద్దుకొన్న వారిని నిలబెట్టుకొనే వాతావరణం గానీ, వారి ప్రతిభకు తగిన గౌరవం దొరుకుతుందన్న హామీగానీ లేకుండా పోయిందని బాధపడ్డారు. కాలిఫోర్నియాలో భారతీయ సంతతి పోలీసు అధికారి రొనిల్ రోన్ సింగ్ కాల్చివేతపై ట్రంప్ స్పందిస్తూ.. అది అక్రమ వలసదారు పని అని మండిపడ్డారు. కాగా, సరిహద్దుల బలోపేతంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను డెమొక్రటిక్ పార్టీ ఎంపీ రాజా కృష్ణమూర్తి సమర్థించారు. మెక్సికోతో పంచుకొంటున్న అంతర్జాతీయ సరిహద్దు పొడవునా గోడ కట్టాలని ట్రంప్ చాలాకాలంగా వాదిస్తున్నారు. అలాంటి భౌతిక నియంత్రణ సరిహద్దుల్లో అవసరమేనని కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు.

“15 సంవత్సరాలు అమెరికాలో ఉన్నాను. మూడు నెలల కిందటే హైదరాబాద్‌కు వచ్చేశా. అక్కడ పని చేసిన బ్యాంకులోనే ఇక్కడా ఉద్యోగం! జీతం తక్కువన్న మాట నిజం! కానీ... అమెరికాకు, ఇక్కడికి పెద్ద తేడా ఏం లేదు. అయితే... ఇక్కడున్న స్వేచ్ఛ అక్కడ ఎప్పటికీ రాదు”... ఇది శ్రీకాంత్ అనే యువకుడి మాట!

“ఎమ్మెస్‌కోసం అమెరికా వెళ్లాను. హెచ్1బీ మీద రెండేళ్లు ఒక కంపెనీలో పనిచేశాను. ట్రంప్ వచ్చాక దినదినగండంగా మారింది. ఏ నిమిషం ఏమవుతుందో తెలియడం లేదు. ఈ రోజు కాకపోతే రేపైనా తిరిగి వచ్చేయాల్సిందే అనిపిస్తోంది. అలాంటప్పుడు అక్కడ ఉండడం దేనికి? అందుకే భారత్‌కు వచ్చేశాను. ఇక్కడ కొంత మంది ఫ్రెండ్స్ కలిసి ఒక స్టార్టప్ పెట్టాం”... ఇది చైతన్య అనే యువకుడు పంచుకున్న అనుభవం!

శ్రీకాంత్, చైతన్య... ఇలా ఎందరో! అందరి మాటల సారాంశం ఒక్కటే! ‘మదర్ ఇండియా’ పిలుస్తోంది! ‘జీతం కొంత తక్కువైనా... సొంత గడ్డపై ఉన్న స్వేచ్ఛే వేరు’ అనుకుంటూ కొందరు! ‘డాలర్ డ్రీమ్స్’ చెదిరిపోతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో మరికొందరు! అమెరికాను వదిలేసి స్వదేశంలో రెక్కలు కట్టుకుని వాలుతున్నారు.

హలో మదరిండియా!

అమెరికా నుంచి తిరిగొస్తున్న మనోళ్లు.. కొందరిలో కరుగుతున్న డాలర్ డ్రీమ్స్

స్వదేశంలో స్వేచ్ఛను కోరుతూ మరికొందరు.. దేశీయంగానూ పెరుగుతున్న అవకాశాలు

విలాసాలకూ ఇక్కడ కొదవేమీ లేదు.. ట్రంప్ దెబ్బకు దిన దినగండం.. ఎప్పుడైనా తిరిగి రాకతప్పదనే భావన

సండే స్పెషల్



అమెరికా.. అక్కడికెళ్లి చదుకోవాలని.. అక్కడే మంచి ఉద్యోగంలో స్థిరపడి డాలర్లు వెనకేసుకోవాలని చాలా మంది విద్యార్థులు కలలు కంటుంటారు! అత్యధికులకు డాలర్ డ్రీమ్స్ ఉంటాయి! కానీ, ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన తర్వాత ఆ కల చెదిరిపోతూ వస్తోంది. అమెరికా నుంచి భారత్‌కు తిరిగి వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఇందుకు మూడు ప్రధాన కారణాలున్నాయి! ట్రంప్ విదేశాంగ విధానంలో మార్పుల వల్ల హెచ్1బీ వీసాలపై పెడుతున్న ఆంక్షలు, భారత్‌లో ప్రధానంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఐటీ అవకాశాలు పెరగడం, స్వదేశంలోనూ అత్యాధునిక విలాసాలూ, జీవన ప్రమాణాలూ, సదుపాయాలు పెరగడం. ఈ మూడింటికీ ఒక దానికొకటి నేరుగా సంబంధం లేకపోయినా.. ఐటీ నిపుణులు భారత్‌కు తిరిగి వచ్చేయడానికి మాత్రం కారణమవుతున్నాయి. “అమెరికా నుంచి కచ్చితంగా ఎంతమంది తిరిగి వచ్చారనడానికి లెక్కలు లేవు. తిరిగి వచ్చేవారు ఎక్కువ మంది హెచ్1బీ వీసాపై ఉన్న వారే. వారు మన పౌరులే కాబట్టి మన ఇమిగ్రేషన్ శాఖ వారిని విడిగా లెక్కించదు. కానీ, భారత్‌కు తిరిగి వచ్చే ఒరవడి మాత్రం కచ్చితంగా పెరిగింది” అని అంతర్జాతీయ సంస్థ పీడబ్ల్యూసీలో పార్టనర్‌గా పనిచేస్తున్న సుదీప్ చెప్పారు.

పెరిగిన ఆంక్షలు..

ట్రంప్ అధ్యక్షుడు కాకముందు ఒబామా సహా అనేక మంది అధ్యక్షులు ‘అమెరికా ఫస్ట్’ విధానాన్ని అనుసరించారు. కానీ, దీన్ని పతాక స్థాయికి తీసుకెళ్లింది ట్రంప్. ముఖ్యంగా విదేశీయులకు ఇచ్చే వీసాలపై, గ్రీన్‌కార్డులపై ఆయన పెట్టినన్ని ఆంక్షలు అమెరికా చరిత్రలో మరెవరూ పెట్టలేదు. ఈ చర్యలతో ప్రవాస భారతీయుల్లో ముఖ్యంగా తెలుగువారిలో ఆందోళన పెరిగింది. “ఇదంతా ఒక చక్రం లాంటిది. ఒక కుర్రాడు చదువుకోవడానికి వస్తాడు. చదువు పూర్తయిన తర్వాత ఓపీటీపై కొద్దికాలం ఉంటాడు. ఈ లోపులో హెచ్1బీ వచ్చేస్తుంది. ఏదో ఒక కంపెనీలో చేరతాడు. ఒక అమ్మాయిని పెళ్లి చేసుకొని హెచ్4 మీద తీసుకొస్తాడు. ఆ తర్వాత ఆమెకు కూడా హెచ్1బీ వచ్చేస్తుంది. ఇద్దరూ కలిపి గ్రీన్‌కార్డుకు.. అది వచ్చాక పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఐదారేళ్ల క్రితం దాకా ఇదంతా అతి సామాన్యమైన ప్రక్రియ. దీన్నిప్పుడు చాలా క్లిష్టతరం చేసేశారు” అని ప్రస్తుతం ఎన్నారై తెలుగువారు ఎదుర్కొంటున్న సమస్యలను టెక్సాస్‌లో స్థిరపడిన శ్రీనివాసమూర్తి వివరించారు. ఒకప్పుడు ఎంఎస్ పూర్తయిన తర్వాత హెచ్1బీకి దరఖాస్తు చేసుకోవడానికి 29 నెలల దాకా సమయం ఉండేది. ఈ లోపులో హెచ్1బీ లభించేది. ఇప్పుడు ఈ కాలపరిమితిని రెండు నెలలకు తగ్గించేశారు. దీంతో ఎంఎస్ పూర్తి చేసిన వెంటనే హెచ్1బీకి దరఖాస్తు చేసి ఉద్యోగంలో చేరాలి.. లేదంటే స్వదేశానికి తిరిగి వచ్చేయాలి. ట్రంప్ ప్రభుత్వ విధానాలకు భయపడి అనేక అమెరికన్ కంపెనీలు హెచ్1బీ వీసాలను ప్రాసెస్ చేయడం తగ్గించేశాయి. అంటే ఎంఎస్ చదువుకున్న వారికి అవకాశాలు తగ్గిపోయాయి. “దీంతో పాటు హెచ్1బీ వీసాను రెన్యువల్ చేయించుకొనే ప్రక్రియనూ సంక్లిష్టం చేశారు. కొన్నిసార్లు దీని కన్నా ఇండియాకు తిరిగి వెళ్లిపోతే మంచిదనిపిస్తూ ఉంటుంది” అని ఇటీవలే తన హెచ్1బీ వీసాను రెన్యువల్ చేయించుకున్న అరుణ్ వెల్లడించారు.

60 వేల హెచ్1బీలు.. 2 లక్షల దరఖాస్తులు

అమెరికా ప్రభుత్వం ఏటా 60 వేల హెచ్1బీ వీసాలను జారీ చేస్తుంది. వీటి కోసం దాదాపు రెండు లక్షల మంది దాకా దరఖాస్తు చేసుకుంటారు. వీటిని జారీచేయడం మొదలుపెట్టిన కొద్ది గంటలకే కోటా పూర్తయిపోతుంది. ఈ వీసాల్లో ఇప్పటికీ మూడొంతులు భారతీయులకే దక్కుతాయి. నిబంధనలు కఠినతరం చేయడంతో భారతీయులకు దక్కే వీసాల సంఖ్య భవిష్యత్తులో తగ్గిపోతుందని భావిస్తున్నారు. గతంలో ఎక్కువ మంది తెలుగువారు కన్సల్టెంట్లుగా పనిచేసేవారు. ఇప్పుడు ఈ అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి.

కొత్త శకం మొదలవుతోంది..

ఓవైపు అమెరికాలో ఆంక్షలు పెరుగుతుంటే మరోవైపు భారత్‌లో ఐటీ నిపుణులకు అవకాశాలు పెరుగుతున్నాయి. మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్ మేనేజ్‌మెంట్ వంటి సరికొత్త టెక్నాలజీల రాకతో అనేక కంపెనీలు వీటిలో నిపుణుల కోసం వెతుకుతున్నాయి. “నాస్కాం నివేదిక ప్రకారం మన దేశంలో ఐటీ నిపుణుల కొరత ఉంది. ప్రపంచంలో ఏ టెక్నాలజీని అభివృద్ధి చేసినా దాన్ని మొదట అమెరికాలోనే వాడతారు. అందువల్ల భారత్‌కు తిరిగి వచ్చేయాలనుకున్నవారికి ఇక్కడ ఉద్యోగాలు బాగా దొరుకుతున్నాయి. నేనే ఉదాహరణ. నేను అమెరికాలో పనిచేసే బ్యాంకే నన్ను ఇక్కడికి పంపింది. వేతనంలో కొంత తేడా ఉండవచ్చు. కానీ, ఉద్యోగ భద్రత ఉంటుంది. ఇలా అనేక మందికి అవకాశాలు వస్తున్నాయి” అని శ్రీకాంత్ తెలిపారు. ఒక ప్రముఖ ఐటీ కంపెనీ మానవ వనరుల విభాగంలో కీలక పదవిలో ఉన్న స్వాతి కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు. “20 ఏళ్లకోసారి టెక్నాలజీ మారుతూ ఉంటుంది. 2000 సంవత్సరంలో కొన్ని మౌలిక మార్పులు వచ్చాయి. ఇప్పుడు మరోసారి రాబోతున్నాయి. వాటి రూపకల్పన, నిర్వహణకు అవసరమైన నిపుణులు తక్కువ ఉన్నారు. దీంతో అమెరికా నుంచి వచ్చినవారికి అవకాశాలు ఎక్కువున్నాయి” అని ఆమె వెల్లడించారు. కేవలం కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరడమే కాదు. హెచ్1బీలను వదలుకొని స్టార్టప్‌లను ప్రారంభించడానికి వచ్చినవారు కూడా ఉన్నారు. “ఇప్పుడు స్టార్టప్ యుగం నడుస్తోంది. ఒక చిన్న ఐడియా క్లిక్ అయితే చాలు. జీవితం మారిపోతుంది. అందుకే కొందరు మిత్రులతో కలిపి స్టార్టప్ ప్రారంభించబోతున్నాం” అని చైతన్య తన భవిష్యత్ ఆలోచనలను వివరించారు.

- స్పెషల్ డెస్క్

ఇక్కడైతే ఇద్దరూ ఉద్యోగం చేయొచ్చు

గతంలో హెచ్4 (డిపెండెంట్ వీసా)పై వెళ్లిన వారు ఏదో ఒక ఉద్యోగం చేసేవారు. ట్రంప్ సర్కారు విధానాల వల్ల ఆంక్షలు చాలా కఠినం కావడంతో వారికి ఉద్యోగావకాశాలు లేవు. దీంతో అమెరికాలో ఒక్కరే పనిచేయడం కన్నా భారత్‌కు వచ్చి ఇద్దరూ ఉద్యోగం చేయొచ్చనే భావన కూడా పెరిగింది.

పెరిగిన జీవన ప్రమాణాలు..

ఒకప్పుడు జీవన ప్రమాణాల విషయంలో భారత్, అమెరికాల మధ్య చాలా వ్యత్యాసం ఉండేది. ఇప్పుడు ఇది తగ్గుతూ వస్తోంది. “అపార్ట్‌మెంట్‌లు, ఆఫీసులు, మాల్స్, స్కూల్స్ దాదాపుగా ఒకే విధంగా ఉన్నాయి. మంచి ఆస్పత్రులున్నాయి. నేను అమెరికా నుంచి వచ్చే ముందు మా పిల్లలు హైదరాబాద్ వాతావరణానికి అలవాటు పడతారా? లేదా అని బెంగపడ్డా. కానీ, వారు సులభంగా అలవాటుపడిపోయారు” అంటారు ఇటీవలే హైదరాబాద్ వచ్చి స్థిరపడిన శివాని. జీవన ప్రమాణాలు పెరగడంతో పాటు వైటూకే సమయంలో అమెరికాకు వెళ్లిన తెలుగు వారిలో ఎక్కువ మందికి ఇప్పుడు 40-45 ఏళ్ల వయస్సు ఉంది. వీరి పిల్లలు యుక్తవయస్సులో ఉన్నారు. దీంతో వీరు తమ పిల్లలపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం అతిగా పడకూడదని భావించి భారత్‌కు తిరిగి వస్తున్నారు. ఒకప్పుడు భారత్ నుంచి అమెరికాకు వెళ్లాలనుకొనేవారే ఎక్కువ మంది కనిపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే భారత్‌కు తిరిగి వచ్చేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. ఇదే ఒరవడి ఇంకొద్ది కాలం కొనసాగితే భారత్- అమెరికాల మధ్య వన్‌వే ట్రాఫిక్ కాకుండా టూవే ట్రాఫిక్ పెరుగుతుందని చెప్పొచ్చు.



మహిళా పరిశోధకులను ప్రోత్సహిద్దాం

నాణ్యత పెరుగుతుంది.. అద్భుతాలు సృష్టిస్తారు

- 'అగ్రశ్రేణి' జాబితాలో భారతీయులు పెరగాలి
- ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి

బెంగళూరు: దేశంలోని మహిళలు పరిశోధనల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు అనుకూలమైన వాతావరణ కల్పించాలని, సైన్స్ పరిశోధనల్లో నాణ్యతను పెంచాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మహిళలకు అద్భుతమైన తెలివితేటలు ఉంటాయని, అవి పరిశోధనలకు మరింతగా తోడ్పడతాయన్నారు. శనివారం ఇన్ఫోసిస్ వార్షిక అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని 4,000 అగ్ర శ్రేణి పరిశోధకుల్లో (హైలీ సైటెడ్ రీసెర్చర్స్) భారతీయులు 10 మంది మాత్రమే ఉన్నారని క్లారివేట్ అనలిటిక్స్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో వెల్లడించిందని వివరించారు. ఇందులో అమెరికాకు చెందిన భారతీయ మహిళ ఒక్కరే టాప్‌లిస్ట్‌లో ఉన్నారని చెప్పారు. 'భారత్‌లో పరిశోధనల్లో నాణ్యత పెంచాలంటే మహిళా పరిశోధకుల తోడ్పాటు తీసుకోవటం తప్పనిసరి. దేశంలో ఏ విశ్వవిద్యాలయం, ఐఐటీ లేదా ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పట్టాలు ప్రదానం చేయటానికి వెళ్లినా అక్కడ పురుషుల కంటే మహిళలు అందుకున్న బంగారు పతకాలు ఎక్కువగా ఉంటాయి. పరిశోధనలు చేయడానికి మహిళలకు అనువైన వాతావరణాన్ని సృష్టిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. వివాహం అనంతరం కూడా పరిశోధనలు చేయడానికి తోడ్పాటు అందించాలి. ప్రతిభ, నైపుణ్యాలు కలిగిన మహిళలకు ఆటంకాలు కలిగించకుండా ఉంటే.. పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలకు వెళ్లి ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉందన్నా'రు.

'ఇన్ఫోసిస్' అవార్డులు

మహిళా పరిశోధకులను ప్రోత్సహించేందుకు ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్లు, సోషల్ సైంటిస్టులకు అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు మూర్తి తెలిపారు. ఈ ఏడాది కూడా ఆరుగురు ప్రొఫెసర్లకు అవార్డులు అందజేసినట్లు పేర్కొన్నారు. వార్షిక అవార్డుల్లో ఒక బంగారు పతకం, ప్రశంసాపత్రం, లక్ష డాలర్ల నగదు ఇన్ఫోసిస్ అందజేస్తోంది. ఇన్ఫోసిస్ సైన్స్ అవార్డులను గెలుచుకున్న పలువురు.. అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను గెలుచుకున్నారన్నారు. పరిశోధనలకు ప్రభుత్వాలు కూడా తోడ్పాటునందించటమే కాకుండా పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తున్నాయని మూర్తి వివరించారు.

8, 9 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

న్యూఢిల్లీ: ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 8-9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు పది కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. వీరికి మద్దతుగా తామూ సమ్మెలో పాల్గొనబోతున్నట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఐ)లు వెల్లడించాయి. ఈ విషయంపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కు ఇప్పటికే సమాచారమిచ్చాయి. దీంతో ఈ రెండ్రోజులపాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల సేవలకు కొంత విఘాతం కలిగే అవకాశం ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)లో విజయా, దేనా బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ డిసెంబరు 26న పది లక్షల మంది ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు సమ్మె చేసిన విషయం తెలిసిందే.

దుమ్మురేపే వేగం, కళ్లు చెదిరే డిజైన్‌లతో ప్రీమియం బైకులు యువతను ఆకర్షిస్తున్నాయి. దర్జా, దర్పం ప్రదర్శన, లాంగ్ రైడింగ్‌లకు యువత, ఉన్నత ఆదాయ వర్గాల వారు లక్షలు వెచ్చించి ప్రీమియం బైకులను కొనుగోలు చేస్తున్నారు. దేశీయ మార్కెట్లో ప్రీమియం బైకుల విక్రయాలు ఆకర్షణీయంగా పెరుగుతుండడంతో ప్రధాన విదేశీ కంపెనీలన్నీ భారత్‌పై కన్నేస్తున్నాయి. దేశీయ కంపెనీలు సైతం ఈ విభాగంపై దృష్టి పెడుతున్నాయి. కొనుగోలు చేసే వారు ఏటికేడాది పెరుగుతున్నారని.. కంపెనీలు భిన్నమైన మోడళ్లను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం మీద భారత్‌లో ప్రీమియం మోటార్ సైకిళ్ల మార్కెట్ శరవేగంతో దూసుకుపోతోంది.





దుమ్ము రేపేస్తున్నాయ్

ఏటా 30% పెరుగుతున్న విక్రయాలు

- 10 లక్షల బైక్‌లకు చేరిన మార్కెట్!
- విదేశీ కంపెనీల కళ్లన్నీ భారత్‌పైనే
- దృష్టిసారిస్తున్న భారత కంపెనీలు



ఆంధ్రజ్యోతి, బిజినెస్ డెస్క్

దేశ ఆర్థిక వ్యవస్థ ముందడుగువేస్తోంది. వ్యాపార, ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. తత్ఫలితంగా ఆదాయాలు వృద్ధి చెంది అనేక మంది సంపన్నులుగా మారుతున్నారు. వీరి జీవనశైలి భిన్నంగా ఉంటోంది.. ఖర్చుకు వెనుకాడే పరిస్థితి లేదు. అధికాదాయ వర్గాల్లో విదేశాల్లో విద్యను అభ్యసించిన వారే ఎక్కువగా ఉంటారు. సమాజంలో తమ హోదాను ప్రదర్శించుకోవాలనుకునే వారికి కూడా కొదువ ఉండడం లేదు. ఇలాంటి మనస్తత్వాలు ఉన్న వారినే లక్ష్యంగా చేసుకుని విదేశాలకు చెందిన ప్రీమియం మోటార్‌సైకిళ్ల కంపెనీలు భారత్‌లో కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. వారి అభిరుచులకు అనుగుణంగా వాహనాలను రూపొందించి అందిస్తున్నాయి. వచ్చే దశాబ్దకాలంలో సంపన్నుల సంఖ్య వంద శాతానికి పైగా పెరిగే అవకాశాలు ఉన్నందున ప్రీమియం మోటార్ సైకిళ్ల కంపెనీలు భారత్‌పై దృష్టి పెడుతున్నాయి. కొనుగోలు చేస్తున్న వారితో ప్రత్యేక క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. లాంగ్ డ్రైవ్‌లను ప్రోత్సహిస్తున్నాయి. ఇలాంటి మార్కెటింగ్ వ్యూహాలు ఫలితాలనిస్తున్నాయి. ఫైనాన్స్ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నాయి.

లక్షల్లో ధరలు

ప్రీమియం బైకుల ధర లక్షల రూపాయల్లో ఉంటుంది. కొన్ని కంపెనీల బైకుల ప్రారంభ ధరనే రూ.7 లక్షలు ఉంది. ఎంవీ అగస్టా (ఇటలీ), నార్టన్ (బ్రిటిష్), ఎస్‌డబ్ల్యూఎం (ఇటలీ), ఎఫ్‌బీ మాండియల్ (ఇటలీ), హ్యోసంగ్ (దక్షిణ కొరియా) కంపెనీలకు చెందిన 250 సీసీ నుంచి 1000 సీసీ వరకు ఇంజన్ సామర్థ్యం కలిగిన బైక్‌ల ధర రూ.3 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుంది. రూ.లక్ష మించిన ధరతో ఉన్న బైకులకు డిమాండ్ అధికంగానే ఉంది. వీటితో కలిపితే మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో దేశీయ మార్కెట్లో 10 లక్షలకు పైగా ప్రీమియం మోటార్‌సైకిళ్లు అమ్ముడయ్యాయని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. ఈ బైకుల్లో క్రూజర్, స్పోర్ట్స్, అడ్వెంచర్, స్ట్రీట్ బైక్ వంటి విభాగాలున్నాయి. మొత్తం విక్రయాల్లో 150సీసీ నుంచి 500 సీసీ వరకు ఇంజన్ సామర్థ్యం కలిగిన ప్రీమియం బైకుల అమ్మకాలే అధికంగా ఉంటాయని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. ఈ మార్కెట్లో రాయల్‌ఎన్‌ఫీల్డ్ వాటాయే అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రీమియం బైకులను తీసుకురావాలని హీరో మోటోకార్ప్ కూడా ఆలోచిస్తోంది. నాలుగేళ్ల క్రితం నుంచి ప్రీమియం మోటార్‌సైకిళ్లకు గిరాకీ జోరుగా పెరుగుతోంది. కొత్త కంపెనీల అరంగేట్రంలో కంపెనీల మధ్య పోటీ పెరుగుతోంది. అత్యాధునిక టెక్నాలజీ, అధిక ఇంజన్ సామర్థ్యం కలిగిన బైక్‌లను కంపెనీలు మార్కెట్లోకి తెస్తున్నాయి. ఇవి అమ్మకాలు పెరిగేందుకు దోహద పడుతున్నాయి. ఈ నేపథ్యంలో 2014-19 సంవత్సరాల మధ్యకాలంలో ఈ బైక్‌ల సగటు వార్షిక అమ్మకాల్లో 30 శాతం వృద్ధి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

500-800 సీసీ విభాగం పైనే కంపెనీల దృష్టి

భారత్‌లో రోడ్ల పరిస్థితిపై ముందే అధ్యయనం చేసిన ప్రీమియం బైకుల తయారీ కంపెనీలు అందుకు తగిన మోడళ్లను తెస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడి మార్కెట్లో 1,600 సీసీ వరకు ఇంజన్ సామర్థ్యం కలిగిన బైకులు అందుబాటులో ఉన్నాయి. అయితే 500-800 సీసీ బైకులకు మాత్రమే ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ శ్రేణి బైకులపైనే కంపెనీలు దృష్టిసారిస్తున్నాయి.

భారత్‌లోనే తయారీ..

భారత్‌లో ప్రీమియం బైకులను విక్రయిస్తున్న విదేశీ కంపెనీలు ఇక్కడే బైక్‌లను తయారు చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. విదేశాల్లోనే బైక్‌ను తయారు చేసి భారత్‌కు దిగుమతి చేసుకుంటే దానిపై పన్నుల మోత మోగుతుంది. ఈ నేపథ్యంలో బైక్‌లకు సంబంధించి విడిభాగాలను దిగుమతి చేసుకుని భారత్‌లోని ప్లాంట్లలో అసెంబుల్ చేస్తున్నారు. కొన్ని కంపెనీలు సొంతంగా యూనిట్లను ఏర్పాటు చేసుకుంటుంటే.. మరి కొన్ని కంపెనీలు మాత్రం దేశీయ కంపెనీల భాగస్వామ్యంతో తయారు చేస్తున్నాయి. మోటోరోయాల్ సంస్థ తాను విక్రయించే ఐదు కంపెనీల బైక్‌ల విడిభాగాలను దిగుమతి చేసుకుని తన ప్లాంట్‌లోనే అసెంబుల్ చేస్తోంది. ఇటలీకి చెందిన సూపర్ బైక్‌ల తయారీ కంపెనీ బెనెల్లీ.. మహావీర్ గ్రూప్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌కు సమీపంలోని ప్లాంట్‌లో వాహనాల అసెంబ్లింగ్‌ను ప్రారంభించింది.



భారత మార్కెట్లో ప్రీమియం బైకులను విక్రయిస్తున్న కంపెనీలు..	
బెనెల్లీ	బీఎండబ్ల్యు మోటరాడ్
యూఎం మోటార్‌సైకిల్స్	రాయల్ ఎన్‌ఫీల్డ్
జావా	ఎంవీ అగస్టా
ఇండియన్	నార్టన్
కేటీఎం	ఎస్‌డబ్ల్యూఎం
డుకాటీ	ఎఫ్‌బీ మాండియల్
హార్లేడేవిడ్సన్	హ్యోసంగ్

ఎనిమిదేళ్లకు ముందు..

ప్రపంచ మార్కెట్లలో ప్రీమియం మోటార్‌సైకిళ్లు ఎన్నో ఏళ్ల క్రితం నుంచే అందుబాటులో ఉన్నాయి. వీటిపై మోజు ఉన్న భారతీయులు ఆయా మార్కెట్ల నుంచి దిగుమతి చేసుకునే వారు. 2011 సంవత్సరం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. దిగుమతుల కోసం అయ్యే ఖర్చులను కూడా వాహన కొనుగోలుదారులే భరించాల్సి వచ్చేది. ఫలితంగా ధర భగ్గుమనేది. కస్టమర్ల సంఖ్య కూడా తక్కువే ఉండేది. అయితే భారత్‌లో ప్రీమియం బైకులను కొనాలన్న ఆసక్తిని విదేశీ కంపెనీలు గ్రహించాయి. ఇక్కడ వ్యాపార అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి దేశీయంగానే వాహనాలను అసెంబ్లింగ్ చేసే ప్రణాళికలను రూపొందించాయి. దేశీయ తయారీతో ధరలు తగ్గడానికి, కస్టమర్లను పెంచుకోవడానికి అవకాశం ఏర్పడింది. ముందు 2010 సంవత్సరంలో అమెరికాకు చెందిన హార్లేడేవిడ్సన్ భారత్‌లోకి ప్రవేశించింది. ఇక్కడే తన బైకులను అసెంబ్లింగ్ చేసేందుకు ప్లాంట్ ఏర్పాటు చేసింది. దీంతో మార్కెట్లో పరిస్థితి మారిపోయింది. అమ్మకాలు ఊపందుకున్నాయి.

జావా పునరాగమనం

గత ఏడాది చెక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ జావా మళ్లీ భారత మార్కెట్లోకి మళ్లీ ప్రవేశించింది. ఈ కంపెనీ 293 సీసీ సామర్థ్యం కలిగిన మూడు బైక్‌లను విడుదల చేసింది.



భెల్ రికార్డు!

తెలంగాణలో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ 46 నెలల్లో పూర్తి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) మరో రికార్డును సొంతం చేసుకుంది. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (టీఎస్‌జెన్‌కో)కు చెందిన కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) వద్ద 800 మెగావాట్ల ప్లాంట్‌ను కేవలం 46 నెలల్లో పూర్తి చేసినట్లు శనివారం భెల్ ప్రకటించింది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిన ఈ ప్లాంట్ నిర్మాణానికి టీఎస్‌జెన్‌కో నుంచి భెల్ కాంట్రాక్టు పొందింది. టీఎస్‌జెన్‌కో ఏర్పాటు చేయబోతున్న యాదాద్రి ప్రాజెక్ట్(800మెగావాట్ల చొప్పున ఐదు యూనిట్లు), భద్రాద్రి ప్రాజెక్టు (270 మెగావాట్ల చొప్పున 4 యూనిట్లు) నిర్మాణ కాంట్రాక్టులను సైతం భెల్ దక్కించుకుంది. ఇవి ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	32,660	---	32,850	31,430	31,700
క్రితం ముగింపు	32,980	---	32,850	32,590	31,940
22 క్యారెట్లు	30,240	---	30,220	30,090	30,240
క్రితం ముగింపు	30,540	---	30,220	30,180	30,480
వెండి (కిలో)	39,900	---	40,000	40,000	42,200
క్రితం ముగింపు	40,100	---	40,000	40,100	42,400

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.05		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	447	చిత్తూరు	448
వరంగల్	449	చెన్నై	455
విజయవాడ	453	నమక్కల్	440
గోదావరి	453	బెంగళూరు	445
విశాఖపట్నం	458	ముంబై	502

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	87	విజయవాడ	90
కరీంనగర్	87	గుంటూరు	91
వరంగల్	87	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	93
కర్నూలు	87	నెల్లూరు	93
విశాఖపట్నం	80	అనంతపురం	89
గోదావరి	86		



మూడు రోజుల్లోనే ఫిర్యాదు చేయాలి

అప్పుడే సొమ్ము వాపస్.. ఈ-వాలెట్ మోసాలపై ఆర్‌బీఐ

మీరు ఎలక్ట్రానిక్ వాలెట్ల (ఈ-వాలెట్ల)ను ఉపయోగిస్తున్నారా.. అయితే ఈ విషయాన్ని గుర్తుంచుకోండి. ఒకవేళ మీ వాలెట్ల ద్వారా మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం అవ్వండి. మోసం జరిగిందని మీరు గుర్తించినట్లయితే మూడు రోజుల్లోనే ఫిర్యాదు చేయండి. లేదంటే మీ సొమ్ముపై ఆశలు వదులుకోవాల్సి వస్తుంది. ప్రీ పెయిడ్ సాధనాల ద్వారా చెల్లింపులు చేపట్టే వినియోగదారులు.. మోసపోయినట్లు గుర్తిస్తే మూడు రోజుల్లోనే ఫిర్యాదు చేయాలని, లేనిపక్షంలో ఆ సొమ్ముకు నీళ్లు వదులుకోవాల్సిందేనని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. బ్యాంక్ మోసాలకు ఇవే నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది.

ప్రీ పెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ)లో మొబైల్ వాలెట్స్, ప్రీ పెయిడ్ పేమెంట్స్ కార్డులు, సోడెక్సో వంటి పేపర్ వోచర్స్ ఉన్నాయి. వినియోగదారులకు మరింత రక్షణ కల్పించే ఉద్దేశంతో ఆర్‌బీఐ ఈ మేరకు మార్గదర్శకాలను రూపొందించింది. మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు వెల్లడైతే మూడు రోజుల్లో ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును వెనక్కు తీసుకువచ్చే వెసులుబాటు ఉంటుందని ఆర్‌బీఐ భావిస్తోంది. ఇదే సమయంలో బ్యాంకులు కూడా ఈ తరహా మోసాలకు సంబంధించి వినియోగదారులను అప్రమత్తం చేయాలని సూచించింది. అంతేకాకుండా కొత్త నోటిఫికేషన్‌ను ఖాతాదారులకు అందుబాటులో ఉంచాలని తెలిపింది. ఒకవేళ వినియోగదారుడు తన అజాగ్రత్తతో నష్టపోతే మాత్రం ఆ మొత్తాన్ని వారే భరించాల్సి ఉంటుందని, పీపీఐ జారీదారు ఈ లావాదేవీలకు ఎలాంటి బాధ్యత వహించదని ఆర్‌బీఐ తెలిపింది. ఫిర్యాదు చేసిన తర్వాత అనధికారిక లావాదేవీ ఏదైనా జరిగితేనే పీపీఐ బాధ్యత వహిస్తాడని పేర్కొంది. మోసాలకు సంబంధించిన ఫిర్యాదులను చేసేందుకు పీపీఐలు అన్ని రకాలైన సేవలు, సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకులు, కార్డులతో సమానంగా ఈ-వాలెట్ల లావాదేవీలకు రక్షణ కల్పిస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని పరిశ్రమ నిపుణులు అంటున్నారు. ఆర్థిక మోసాల నుంచి రక్షణ కల్పిస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం వినియోగదారుల్లో విశ్వాసాన్ని పాదుగొల్పుతుందని వారు పేర్కొన్నారు.

ఆసియా మార్కెట్లకు రాంరాం

3,360 కోట్ల డాలర్లను వెనక్కు తీసుకున్న ఎఫ్ఐఐలు



ముంబై: భారత్ సహా ఆసియా ఈక్విటీ మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున విదేశీ నిధులు తరలిపోతున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధ భయాలు, స్టాక్ మార్కెట్లలో లాభాలు తగ్గిపోవటం వంటి కారణాలతో గత ఏడాది ఆసియా మార్కెట్ల నుంచి సుమారు 3,360 కోట్ల డాలర్ల (రూ.2.35 లక్షల కోట్లు) విదేశీ పెట్టుబడులు (ఎఫ్ఐఐ) వెనక్కు వెళ్లిపోయాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గడచిన ఏడేళ్లలో ఈ స్థాయిలో నిధులు తరలిపోవటం ఇదే తొలిసారని సింగపూర్‌కు చెందిన మార్కెట్ వ్యూహకర్త, ఐజీ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రొవైడర్ జింగీ పాన్ వెల్లడించారు. భారత్, దక్షిణ కొరియా, తైవాన్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, వియత్నాం స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి జింగీ ఈ గణాంకాలు సేకరించారు. 2018లో విదేశీ పెట్టుబడిదారులు.. ఈ మార్కెట్ల నుంచి 3,360 కోట్ల డాలర్ల విలువైన షేర్లను విక్రయించారని, 2012 తర్వాత ఈ స్థాయిలో నిధులు తరలిపోవటం ఇదే మొదటి సారని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది తైవాన్ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు నికరంగా 1,170 కోట్ల డాలర్లను ఉపసంహరించుకున్నారని చెప్పారు. తైవాన్ తర్వాతి స్థానాల్లో థాయ్‌లాండ్ (890 కోట్ల డాలర్లు), దక్షిణ కొరియా (560 కోట్ల డాలర్లు) ఉన్నాయి.

వాణిజ్య యుద్ధ భయాలతోనే..

చైనా, అమెరికా వాణిజ్య యుద్ధ భయాలతో 2018లో నికర విదేశీ పెట్టుబడులు పూర్తిగా ప్రతికూల ధోరణిలోకి సాగాయని జింగ్ వెల్లడించారు. ఆసియా మార్కెట్లలో మూడేళ్ల తర్వాత విదేశీ పెట్టుబడులు నెగటివ్‌లోకి జారుకోవటం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. చైనా దిగుమతులపై అమెరికా సుంకాలు విధించటంతో ఆసియా రీజియన్‌లో వృద్ధిపై ప్రభావం పడిందని, ఇదే సమయంలో ఆసియాలోని ప్రధాన స్టాక్ మార్కెట్లన్నీ బేర్ పట్టులోకి జారుకున్నాయని చెప్పారు. 2018లో జపాన్ షేర్లు 16 శాతం కుప్పకూలగా చైనా షేర్లు దాదాపు 29 శాతం మేర పడిపోయాయని ఆయన పేర్కొన్నారు.

5 ఏళ్ల మినహాయింపు

- కొత్త పేటెంట్ ఔషధాలపై ధరల నియంత్రణ ఎత్తివేత

న్యూఢిల్లీ: కొత్తగా ఆవిష్కరించిన ఔషధాలకు కేంద్ర ప్రభుత్వం ధరల నియంత్రణ నుంచి 5 ఏళ్లపాటు మినహాయింపు కల్పించింది. రసాయనాలు, ఎరువుల శాఖ విడుదల చేసిన 'ఔషధ (ధరల నియంత్రణ) సవరణ ఆదేశం, 2019' ప్రకారం.. భారత పేటెంట్ చట్టం కింద కొత్తగా పేటెంట్ పొందిన ఔషధాలు వాటి మార్కెటింగ్ తేదీ నుంచి ఐదేళ్లపాటు ధరల నియంత్రణ పరిధిలోకి రావు. సాధారణంగా ప్రభుత్వం షెడ్యూల్డ్ ఫార్ములేషన్ల ధరలను నిర్ణయించడంతోపాటు మార్కెట్లోని అన్ని రకాల ఔషధాల గరిష్ఠ చిల్లర ధరలను పర్యవేక్షిస్తుంటుంది. కానీ తాజా నోటిఫికేషన్‌తో కొత్త ఔషధాలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయే అవకాశం ఉందని ఎన్‌జీఓలు విమర్శిస్తున్నాయి.

వేతన చెల్లింపుల్లో జెట్ మళ్లీ విఫలం!

ముంబై: సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించే విషయంలో జెట్ ఎయిర్‌వేస్ మరోసారి విఫలమైంది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఈ విమాన సంస్థ గతంలో సీనియర్ మేనేజ్‌మెంట్‌తోపాటు పైలెట్లు, ఇంజనీర్లకు జీతాలు చెల్లించడంలో వరుసగా విఫలమవుతూ వచ్చింది. డిసెంబరు నెలకు వీరితోపాటు మరిన్ని విభాగాల సిబ్బందికి సైతం చెల్లించలేకపోయిందని విశ్వసనీయ వర్గాల తెలిసింది. నరేశ్ గోయల్‌కు చెందిన జెట్ ఎయిర్‌వేస్‌లో ప్రస్తుతం 6,000 మంది పనిచేస్తున్నారు. అందులో దాదాపు 15 శాతం మంది (మేనేజర్, ఆపై స్థాయి) ఉద్యోగులకు సంస్థ ఆగస్టు నుంచి జీతాలను సకాలంలో చెల్లించలేకపోతోంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు అవసరమైన నిధుల కోసం గోయల్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులోభాగంగా రూ.1500 కోట్ల రుణం కోసం ఈ సంస్థ ఎస్‌బీఐతో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది.

మూడు ఆర్ఆర్‌బీల విలీనం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ)ను విలీనం చేసింది. పంజాబ్ గ్రామీణ్ బ్యాంక్, మాల్వా గ్రామీణ్ బ్యాంక్, సట్లెజ్ గ్రామీణ్ బ్యాంక్‌ల ఏకీకరణ ద్వారా పెద్ద ఆర్ఆర్‌బీని ఏర్పాటు చేసింది. ఈ విలీనం ఈనెల 1 నుంచి అమలులోకి వచ్చింది.


యూబీఐతో శ్రేయా జట్టు

కోల్‌కతా: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)తో శ్రేయా ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), వ్యవసాయ రంగాలకు రుణాలందించనున్నాయి. ఎంఎస్ఎంఈలకు చౌకగా రుణాలు లభించేందుకు ఈ ఒప్పందం తోడ్పడనుందని యూబీఐ ఎండీ, సీఈఓ అశోక్ కుమార్ ప్రధాన్ అన్నారు.



గ్రామమన్నది స్వయం సమృద్ధమైనదిగా ఉండాలి. ఆహారం, వస్త్రాలు, మంచి నీరు, పరిశుభ్రత, ఇళ్లు, విద్య తదితర అవసరాలను స్వయంగా తీర్చుకోగలగాలి. స్వావలంబన సాధించగలిగినదే నా దృష్టిలో ఆదర్శ గ్రామం

- మహాత్మాగాంధీ



సీఎం స్వగ్రామంలో వేలం పాట!

▸ సర్పంచ్ కోసం ఓ కుల సంఘం పాట 12.6 లక్షలు

▸ చింతమడకలో ఆసక్తికరంగా 'పంచాయతీ'

సిద్దిపేట రూరల్, జనవరి 5: ముఖ్యమంత్రి కేసీఆర్ సొంతూరైన సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో సర్పంచ్ పదవి కోసం హోరాహోరీ పోటీ తప్పేట్లు లేదు. సీఎం స్వగ్రామం కావడం.. అక్కడ టీఆర్ఎస్ తప్ప ఇతర పార్టీలు లేకపోవడంతో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని భావించారు. అయితే.. రెండు కులసంఘాలు మినహా మిగతా కుల సంఘాలు ఏకమై సమిష్టిగా అభ్యర్థిని నిలబెట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. గ్రామంలో మెజారిటీ ఓట్లు ఉన్న కులసంఘమైతే సర్పంచ్ అభ్యర్థి కోసం ఏకంగా వేలంపాటనే నిర్వహించింది. రూ.2లక్షల నుంచి మొదలైన వేలంపాట రూ.12.6లక్షల వద్ద ముగిసింది. సదరు మెజారిటీ ఓట్లు ఉన్న కులసంఘానికి మద్దతునిచ్చేందుకు మరో సామాజిక వర్గం ఒప్పందం కూడా కుదుర్చుకుంది. కాగా చింతమడకను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాన్నాళ్లుగా గ్రామస్థుల నుంచి వ్యక్తమవుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు చింతమడకకు వచ్చిన సీఎం కేసీఆర్.. 15రోజుల్లో మళ్లీ గ్రామానికి వస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. నెల గడుస్తున్నా గ్రామానికి సీఎం రాలేదు. ఇటీవల ప్రకటించిన నూతన మండలాల్లో చింతమడక లేదు. దీనిపై గ్రామస్థులు అసంతృప్తితో ఉన్నారు. నిరసనగా రిలే నిరాహారదీక్షకు పూనుకున్నారు. తమ నిరసనలను తీవ్రతరం చేసేందుకు సర్పంచ్‌గా బలమైన అభ్యర్థి ఎన్నిక కావడం అవసరమని స్థానికులు కోరుకుంటున్నట్లు తెలిసింది.

ఓటర్ల జాబితా సవరించాకే ఆ ఊర్లో ఎన్నికలు

▸ గుర్రంపాడ్ పంచాయతీపై హైకోర్టు ఆదేశాలు



హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా గుర్రంపాడ్ గ్రామంలో ఓటర్ల జాబితాను భౌగోళికంగా వార్డుల వారీగా ఉండేలా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. గ్రామపంచాయతీ కార్యదర్శి ఇచ్చిన జాబితాలోని దోషాలను సరిచేసి వార్డులవారీగా ఓటర్ల జాబితా రూపొందించాలని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా ఓటర్ల జాబితా సవరణ కాకపోతే ఆ గ్రామపంచాయతీ ఎన్నికలను నిబంధనల మేరకు తర్వాత దశకు వాయిదా వేయవచ్చని తేల్చిచెప్పింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. నల్గొండ జిల్లా చములోనిబావి గ్రామానికి చెందిన మంతిపల్లి దుర్గయ్య తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యంపై జడ్జి ఈ ఉత్తర్వులు ఇచ్చారు. ఒకే ఇంట్లో ఉంటున్న కుటుంబసభ్యుల్లోని యజమాని ఓటును మూడో వార్డులోనూ, భార్య కుమార్తె ఓట్లను ఆరవ వార్డులో ఓటర్లుగా నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. ఓటర్ల జాబితా సవరించే వరకు ఎన్నికలు నిలుపుదల చేయాలని కోరారు. పిటిషనర్ల తరపున వాదనలు విన్న న్యాయమూర్తి పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన జాబితాపైనే ఆధారపడకుండా ఎన్నికల కమిషన్ స్వతంత్ర పర్యవేక్షణలో ఓటర్ల జాబితా రూపొందించాలని అభిప్రాయపడింది.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ వంగాల ఈశ్వరయ్య

బీసీలను గెలిపించుకుంటాం


▸ రిజర్వేషన్ల తగ్గింపుపై సుప్రీంలో పిటిషన్: బీసీ సంఘాలు

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో బీసీ అభ్యర్థులను బరిలోకి దించి గెలిపించుకుంటామని బీసీ సంఘాల నేతలు వెల్లడించారు. రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించి ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసినందుకు న్యాయపోరాటం, సామాజిక ఉద్యమాల్ని ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఈ నెల 7న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సందర్భంగా జిల్లా కేంద్రాల్లో ఆర్డినెన్స్ పత్రాలను దహనం చేసి నిరసన తెలుపుతామని చెప్పారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పలు బీసీ సంఘాలు బషీర్‌బాగ్‌లో సమావేశమయ్యాయి. జాతీయ బీసీ ఫెడరేషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం, న్యాయవ్యవస్థ బీసీలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు చెప్పారు. ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ అభ్యర్థుల విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

స్వరాజ్యమనలేనీ..!

అధికారాలకు దూరంగా పంచాయతీలు.. ఉత్సవ విగ్రహాల్లా సర్పంచ్‌లు, పాలకవర్గాలు

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నేటికీ అందని ద్రాక్షలానే మారింది. చట్టాల్లో మార్పులు చేసినా, కమిటీలు వేసినా, ప్రభుత్వాలు.. పాలకులు మారినా పంచాయతీలు మాత్రం బలోపేతం కావడం లేదు. అధికారుల్లో జవాబుదారీతనం లోపించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 36 శాఖల అధికారులు, సిబ్బంది గ్రామస్థాయిలో పని చేస్తున్నా.. వారు సర్పంచ్‌కి జవాబుదారీగా ఉండడం లేదు. ఇందుకు కారణం.. అధికారాలను పంచాయతీలకు బదిలీ చేయక పోవడమే! పంచాయతీ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి 1957లో బల్వంతరాయ్ కమిటీ వేశారు. దాని సూచనలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తర్వాత అర్ధ దశాబ్ద కాలంలో మరో ఆరు కమిటీలు వేశారు. వాటి సిఫారసులు ఏవీ కూడా అమలుకాలేదు. కాగా, మొట్టమొదటిసారిగా 1959లో తొలుత రాజస్థాన్‌లో తర్వాత ఏపీలో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత దశలవారీగా అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటైంది. ఆ మేరకు చట్టాలు రూపొందించారు. కానీ, పంచాయతీలకు నిధులు, అధికారాలు పూర్తిస్థాయిలో కల్పించలేదు. దాంతో, గ్రామ స్వరాజ్యం కలగానే మిగిలింది. పంచాయతీలను బలోపేతం చేయటానికి 1992లో 73వ రాజ్యాంగ సవరణ చేశారు. పంచాయతీలకు 29 అధికారాలను బదలాయించాలని, రాష్ట్ర ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేసి.. వాటి ద్వారా నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ, ఆ 29 అధికారాల్లో తెలంగాణ ప్రభుత్వం పంచాయతీలకు 10 అధికారాలనే బదలాయించింది. వెరసి, సింహభాగం సర్పంచ్‌లు 'పంచాయితీ' పెద్దలుగా మారుతున్నారు. కుటుంబ, ఆస్తి, భార్యాభర్తల తగాదాలు, ఇతరత్రా సెటిల్‌మెంట్లకు పరిమితమవుతున్నారు.



దారి మళ్లుతున్న నిధులు

14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు.. గత నాలుగేళ్లుగా కేంద్రం నుంచి నిధులు విడుదలవుతున్నా.. అవి పంచాయతీలకు చేరడం లేదు. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. సరికదా.. కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లోనే కోత పెడుతోంది. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధి, ప్రత్యేక అభివృద్ధి నిధి పేరుతో ఎమ్మెల్యేలు, మంత్రులు వందల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారు. ఈ పనుల్లో ఎలాంటి పారదర్శకత లేదు. అవే నిధులను నేరుగా పంచాయతీలకు విడుదల చేస్తే అవసరమైన పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. కాగా, 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసి, దాని ద్వారా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి. అయితే, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్థిక సంఘం ఏర్పాటులో తెలంగాణ ప్రభుత్వం కొంత జాప్యం చేసింది. దాంతో, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కోర్టుకెళ్లింది. కోర్టు ఆదేశాల మేరకు, ప్రభుత్వం 2015 మార్చిలో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఇప్పటి వరకూ దానికి నిధులు విడుదల చేయలేదు. దాంతో, ఆర్థిక సంఘం ఉత్సవ విగ్రహమైంది.

73వ రాజ్యాంగ సవరణలో కల్పించిన అధికారాలు

- వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
- భూసారాన్ని పెంపొందించడానికి చర్యలు తీసుకోవడం, భూ సంస్కరణలు అమలు చేయడం
- చిన్న నీటిపారుదల నిర్వహణ, నీటి నిర్వహణ
- జంతువుల సంరక్షణ, కోళ్ల పెంపకం, పశు సంరక్షణ
- ఉపాధి కోసం చేపల పెంపకం
- సామాజిక అడవుల నిర్వహణ
- అటవీ ఉత్పత్తులు.. ● చిన్న తరహా పరిశ్రమలు
- ఖాదీ, గ్రామీణ, కుటీర పరిశ్రమలు
- గ్రామీణ ఇండ్ల నిర్మాణం
- గ్రామీణ ప్రజలకు తాగునీటి సరఫరా
- ఇంధనం, పశుగ్రాసం
- రోడ్లు, వంతెనలు, ఇతర ప్రసార మార్గాలు
- గ్రామీణ విద్యుత్తు, విద్యుత్తు పంపిణీ
- సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి
- పేదరిక నిర్మూలన పథకం
- ప్రాథమిక, మాధ్యమిక విద్య
- సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య
- అనియత విద్య.. ● గ్రంథాలయాలు
- సాంస్కృతిక కార్యక్రమాలు
- మార్కెట్ సంఘాల నిర్వహణ
- ఆరోగ్యం, పారిశుద్ధ్యం, వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, బాధ్యత
- కుటుంబ సంక్షేమం.. ● స్త్రీ, శిశు సంక్షేమం
- సాంఘిక, వికలాంగుల సంక్షేమం
- బలహీనవర్గాలు.. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం
- ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వహణ
- సామాజిక ఆస్తుల నిర్వహణ

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

సమన్వయంతో పనిచేయండి.. అధికారులకు సీఎస్ ఆదేశం.. పూర్తి సన్నద్ధతతో ఉండండి: ఎస్ఈసీ నాగిరెడ్డి

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 3 విడతలుగా జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణలో జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఎస్‌కే జోషి ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కమిషనర్ నాగిరెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి శనివారం సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కడైనా పోలింగ్ సిబ్బందికి అనుకోని సంఘటన ఎదురైనప్పుడు తక్షణమే స్పందించేలా ప్రత్యేకాధికారిని నియమించాలని, ఆ అధికారి వివరాలను పోలింగ్ సిబ్బందికి తెలపాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు 25 రోజుల్లో పూర్తి కావాల్సి ఉన్నందున కలెక్టర్లు పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఎస్ఈసీ కమిషనర్ నాగిరెడ్డి సూచించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన అనుభవం జిల్లాల ఎస్పీలకు ఉందని, అదే లక్ష్యంతో పంచాయతీ ఎన్నికలకు ముందుకెళ్లాలని పోలీసు అధికారులను ఉద్దేశించి డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు.



కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి

పంచాయతీ అభ్యర్థులకు జీరో ఖాతాల తంటా!

▸ ఎన్నికల సంఘం స్పష్టత ఇస్తేనే సమస్య కొలిక్కి

వనపర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు బ్యాంకుల్లో జీరో ఖాతాలు తెరవాలన్న నిబంధన చర్చకు తెరలేపింది. ఖాతా వివరాలను నామినేషన్ సమయంలో ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. అయితే.. ఇప్పటికే బ్యాంకుల్లో జీరో ఖాతాలు ఉన్న ఆశావహులకు.. మళ్లీ కొత్తగా జీరో ఖాతాలు తెరవడానికి బ్యాంకు అధికారులు అంగీకరించడంలేదు. ఈ పరిస్థితుల్లో పాత ఖాతాలను అనుమతించాలని, లేదంటే కొత్తగా ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పించేలా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని ఆశావహులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను కోరుతున్నారు. పంచాయతీ ఎన్నికలకు సోమవారం మొదటి నోటిఫికేషన్ వెలువడనుండటంతో ఖాతాపై సత్వరమే స్పష్టత ఇవ్వాలని విన్నవిస్తున్నారు.

ఏకగ్రీవానికి 15 లక్షలు నిబంధనలకు విరుద్ధం

▸ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, జనవరి 5: స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం చేసిన పంచాయతీలకు 15 లక్షలు ఇస్తామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘనే అని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలలో ఓటర్లను మభ్యపెట్టడానికి ఇలాంటి హామీలు ఇస్తున్నారన్నారు. ఇదిలావుండగా, మండల కమిటీల విషయంలో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం, పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చింతకుంట విజయరమణారావు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మృత్యుంజయం....విజయరమణారావును చూసి షటప్ అనడంతో వెంటనే విజయరమణారావు ఆగ్రహంతో మృత్యుంజయంపైకి లేచారు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరగగా అక్కడే ఉన్న శ్రీధర్‌బాబు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు.

మరో 11 పంచాయతీలు ఏకగ్రీవం

▸ ప్రభుత్వ నజరానాపై గ్రామస్థుల మొగ్గు

▸ గ్రామాభివృద్ధికి ఏకగ్రీవ తీర్మానాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పంచాయతీ సర్పంచ్‌ల ఏకగ్రీవ ఎంపికలు జోరుగా కొనసాగుతున్నాయి. ఏకగ్రీవమైతే వచ్చే నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చనే ఉద్దేశంతో చాలాచోట్ల ప్రజలు ఏకాభిప్రాయానికి వస్తున్నారు. శనివారం మరో 11 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెదక్ జిల్లా గూడెంగడ్డ సర్పంచ్‌గా జనుముల నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేశారు, దౌలాపూర్‌లోనూ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కుప్పన్‌కోట్ తండా సర్పంచ్‌గా పద్మాబాయిని, బాబునాయక్‌తండాలో జె.సూర్యను ఎన్నుకుంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బాబాచెరువు తండా సర్పంచ్‌గా భూక్య లక్ష్మీ, ఉపసర్పంచ్‌గా రాములు.. ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లి చెరువుతండా సర్పంచ్‌గా మాలోతు సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో నూతన పంచాయతీగా ఏర్పడిన హుస్సేన్‌నగర్ సర్పంచ్‌గా సయ్యద్ హైదర్ ఏకగ్రీవమయ్యారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాయిగూడ తొలి సర్పంచ్‌గా జుగ్నక్ లక్ష్మీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం సోనాపూర్ సర్పంచ్‌గా రాథోడ్ రామారావును తండా వాసులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సోమారం తండా సర్పంచ్‌గా కిషన్‌నాయక్‌ను ఎంపిక చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా గుర్రంగడ్డ సర్పంచ్ పదవిని రూ.13.50లక్షలకు వేలం వేశారు. ఇదే జిల్లా కేటీదొడ్డి మండలంలోనూ సర్పంచ్ పదవిని రూ.25లక్షలకు వెలకట్టారు. ఈ విషయంలో ఎమ్మెల్యేతో పాటు గ్రామస్థులు అడ్డుకోవడంతో వేలంపాట ఆగిపోయింది.

పంచాయతీ ఎన్నికలు లేని మండలం

రాష్ట్రమంతటా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నా సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలో మాత్రం ఆ ఊసే కనిపించడం లేదు. వాస్తవానికి బండ్లగూడ, కొల్లూరు, ఉస్మాన్‌నగర్, ఈదుల నాగులపల్లి, వెలిమల గ్రామ పంచాయతీలతో ఈ మండలం ఏర్పాటైంది. అయితే ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపాలిటీల పునర్విభజనలో బండ్లగూడను జీహెచ్ఎంసీలో విలీనం చేశారు. మిగిలిన ఐదు గ్రామ పంచాయతీలతో తెల్లాపూర్ కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటైంది. దీంతో ఈ మండలంలో గ్రామ పంచాయతీలు లేకుండా పోయాయి.

అద్దమా.. అద్భుతమా!

▸ సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థుల ఆవిష్కరణ



మొహం చూసుకునే అద్దాన్ని మొబైల్ స్క్రీన్‌లా వాడుకోగలిగితే! అంతేకాదు స్థానిక ఉష్ణోగ్రతలు, క్యాలెండర్ నోటిఫికేషన్లు చూడగలిగితే.. నిజంగా అద్భుతమే కదా! సుజిత్, వాస్ అనే విద్యార్థులు తమ ఉపాధ్యాయుడు భూషణ్ సాయంతో ఈ స్మార్ట్ మిర్రర్‌ను రూపొందించారు. దీన్ని మన చేతిలోని మొబైల్‌తో ఆపరేట్ చేసుకునేందుకు వీలుగా ఒక డివైస్‌ను కూడా తయారు చేశారు. దాదాపు రెండడుగులు ఉండే ఈ స్మార్ట్ మిర్రర్‌ను వేరే దేశంలో ఉండి కూడా ఆపరేట్ చేయవచ్చు.

బోటు వస్తే విడిపోయే వంతెన

▸ ఆటోమెటిక్ బ్రిడ్జికి ఉత్తరాఖండ్ విద్యార్థి రూపకల్పన



నది లేదా సరస్సుపై వంతెన ఉంటే దాన్ని దాటుకుంటూ బోటు, ఓడలు వెళ్లడం కష్టం అవుతుంది. బోటుకు దారిచ్చేందుకు రెండు భాగాలుగా విడిపోయే వంతెనలు విదేశాల్లో ఇప్పటికే ఉన్నాయి. ఇవి మ్యాన్యువల్‌గానే పనిచేస్తాయి. కానీ సెన్సార్ల ద్వారా బోటును గుర్తించి ఆటోమేటిక్‌గా బ్రిడ్జి రెండుగా విడిపోయే టెక్నాలజీని ఉత్తరాఖండ్‌కు చెందిన వికాస్ అనే విద్యార్థి రూపొందించారు. బోటును ఇది సెన్సర్ల ద్వారా గుర్తించి వంతెనపైకి వచ్చే వాహనాలకు అలారం రూపంలో ఇండికేషన్ ఇస్తుంది. ఆ సమయంలో వంతెనపైకి వాహనాలు వెళ్లకుండా గేటు పడుతుంది. బోటు వెళ్లిపోగానే బ్రిడ్జి ఆటోమేటిగ్గా మళ్లీ కలిసిపోతుంది. ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక కావడం పట్ల వికాస్ ఆనందం వ్యక్తం చేశాడు.

వినూత్న ఆలోచనలకు స్వాగతం

వ్యక్తిగత, స్టార్టప్‌లకు ప్రతిభ నిరూపించుకునే ఛాన్స్.. డేర్ టు డ్రీమ్ స్కీం ప్రకటించిన డీఆర్‌డీఓ

జలంధర్, జనవరి 5: రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కొత్త ఆలోచనలకు స్వాగతం పలుకుతోంది రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ). మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అనేక సందర్భాల్లో చేసిన సూచనలు దృష్టిలో ఉంచుకుని 'డేర్ టు డ్రీమ్' (స్వప్నించు-సాహసించు) పథకం పేరిట కొత్త ఆలోచనలతో నెలకొల్పిన స్టార్టప్‌లకు సాయం అందించనున్నట్లు ప్రకటించింది. దేశఅవసరాలను దృష్టిలో ఉంచుకుని రక్షణ రంగంలో పనికొచ్చేలా ఏ స్టార్టప్‌కైనా దీన్ని అందిస్తారు. "సమస్యాత్మక అంశాలు చాలానే ఉన్నాయి. వాటిని పరిష్కరించే రిసెర్చ్ జరగాలి. ఆలోచన నుంచి ఆచరణ దాకా అన్నింటికీ ఆర్థిక సాయం అందిస్తాం. అయితే అవి నిర్దిష్ట కాలావధిలో పూర్తికావాలి" అని డీఆర్‌డీఓ ఓ ప్రకటనలో వెల్లడించింది. అత్యుత్తమమైన ఆలోచనలకు అవార్డులు కూడా డీఆర్‌డీఓ ఇస్తుంది. వ్యక్తిగత స్థాయిలో అయితే మొదటి, రెండు, మూడు ర్యాంకులకు 5, 4, 3 లక్షల చొప్పునసొమ్ము ఇస్తారు. స్టార్టప్‌లైతే.. రూ 10, 8, 6 లక్షల చొప్పున సాయం అందిస్తారు.

డార్విన్ కంటే దశావతారాలు బెస్ట్

▸ ఆంధ్ర వర్సిటీ వీసీ అభిప్రాయం



జలంధర్, జనవరి 5: మానవ జీవ పరిణామ క్రమాన్ని చార్లెస్ డార్విన్ కంటే శ్రీకృష్ణుడి భగవద్గీతలో ఉద్ఘాటించిన దశావతారాల్లో మెరుగ్గా వివరించారని ఆంధ్రా యూనివర్శిటీ వీసీ ఆచార్య జీ నాగేశ్వరరావు అభిప్రాయపడుతున్నారు. "సముద్ర జీవులు- జంతువుల నుంచి మనిషి పుట్టుక జరిగిందని 17వ శతాబ్దిలో డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం చెబుతోంది. గీత దీనికంటే మరింత ముందుకు వెళ్లింది. దశావతారాలు ఏం చెబుతున్నాయి? మత్స్యావతారం. అంటే సముద్ర జీవి. రెండోది కూర్మావతారం అంటే భూమిపైనా, నీటిలోనూ మనగలిగే అవతారం. మూడోది వరాహావతారం. అంటే భూదేవి రక్షణకు విష్ణువు వరాహరూపమెత్తాడు. నాలుగోది నారసింహ అవతారం. అంటే సగం మనిషి, మిగిలిన సగం సింహం. ఐదోది వామనావతారం. అంటే బహు చిన్న రూపం, పరిణితి చాలా తక్కువ గల వ్యక్తి అన్న అర్థంలో తీసుకోవచ్చు. ఆరోది పరశురామ అవతారం. ఆగ్రహానికి, ఆలోచనారాహిత్యానికి సంకేతం. ఏడోది రామావతారం. సంపూర్ణ మానవుడు, సకల సద్గుణ సంపన్నుడిగా పేరు. ఎనిమిదోది శ్రీకృష్ణావతారం. దైవ స్వరూపంలో రాజనీతిజ్ఞత, ధర్మం, న్యాయం, తర్కం ...వీటన్నింటి కలబోత. అధర్మ శిక్షణ, ధర్మ రక్షణ చేసినవాడు.. మనిషికి మంచీ చెడూ బోధించినవాడు. సమాజరీతిని ఉద్ఘోషించినవాడు. తరువాత వచ్చిన బలరామ, బుద్ధ, కల్కి అవతారాల గురించి మనం పెద్దగా చర్చించుకోవాల్సిన పనిలేదు. అంటే మనిషి రూపాంతరీకరణను దశావతారాలు వివరించినంత సశాస్త్రీయంగా, సముచితంగా డార్విన్ సిద్ధాంతం చెప్పదు. పురాణాలని తీసిపారేయడం కాదు.. అందులో మన పరిణామక్రమం విశదీకరించారు" అని ప్రొఫెసర్ నాగేశ్వరరావు 106వ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు.

తుక్కు నుంచి రోబో తయారీ



ట్రాఫిక్ సంకేతాలు ఇచ్చే మరమనిషి

జలంధర్, జనవరి 5: పనికి రాని ముక్కలు, ఇతర చెత్త నుంచి ఓ రోబోనే తయారుచేశారు జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీ విద్యార్థులు. దీన్ని మెటల్ మాగ్నా రోబో అంటున్నారు. 20 టన్నుల బరువు, 30 అడుగుల ఎత్తు ఉన్న ఈ రోబోను కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతీ ఇరానీ శనివారం నాడు ప్రారంభించారు. 106వ సైన్స్ కాంగ్రెస్ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఈ రోబో- ఏ వైపు ఏమున్నాయి, ఎక్కడెక్కడ ఏమేం జరుగుతున్నాయో వివరిస్తోంది. దీన్ని ట్రాఫిక్ కూడళ్లలో కూడా ఏర్పాటు చేసి సిగ్నలింగ్‌కు అనుసంధానం చేస్తే మంచి ట్రాఫిక్ నిర్వహణ రోబోగా కూడా పనిచేయగలదు. దీని కళ్ల దగ్గర మిణుకు మిణుకు లైట్లు పెట్టారు. నిజానికవి రికార్డ్ చేసే కెమెరాలు. వంద మీటర్ల దూరంలో చీమ చిటుక్కుమన్నా దాన్ని రికార్డు చేయగలదు. చీకటిగా ఉన్న చోట కాంతినిచ్చే ఎల్ఈడీలు కూడా దీనికి అమర్చారు. సెన్సర్లు ఎక్కడికక్కడ అమర్చడం వల్ల ఆటోమేటిక్‌గా ఇది పనిచేసుకు పోతుంది.

ఐటీ +ఐటీ = ఐటీ

▸ రవిశంకర్ వ్యాఖ్య



సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఓ కొత్త భాష్యం చెప్పారు. ఐటీ+ ఐటీ ఈక్వల్ టు ఐటీ అన్నది ఆయన వ్యాఖ్య. అంటే ఇండియాస్ టాలెంట్ + ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ = ఇండియా ఆఫ్ టుమారో అన్నది ఆయన వివరణ. దేశంలోని యువత... సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని పురోగతి సాధిస్తే నవ భారతావని నిర్మించవచ్చని ఆయన విశదీకరించారు. జలంధర్‌లో జరుగుతున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో శనివారం నాడు "సైన్స్ కమ్యూనికేటర్స్ మీట్"ను ఆయన ప్రారంభించారు.

మైదాన్

MYDAN

నిజామాబాద్ • ఆదివారం 6 జనవరి 2019



గాళ్‌ఫ్రెండ్స్‌తో..

ఫ్లాయిడ్ మేవెదర్ జూనియర్.. సమకాలీన బాక్సింగ్‌లో మొనగాడు.. బాక్సింగ్ ఆల్‌టైమ్ గొప్ప ఫైటర్లలో ఒకడు. రెండు దశాబ్దాల తన బాక్సింగ్ కెరీర్‌లో 12 వరల్డ్ టైటిల్స్‌తో పాటు మరెన్నో ప్రపంచ చాంపియన్‌షిప్ బెల్టులు సొంతం చేసుకున్న దిగ్గజం.. ప్రొఫెషనల్ కెరీర్‌లో తలపడిన 50 బౌట్లలో ఓటమి ఎరుగని ధీరుడు. ఇందులో 27 నాకౌట్లున్నాయంటే అతడి 'పంచ్' పవర్ ఏపాటిదో అర్థమవుతుంది. బాల్యంలో దుర్భర దారిద్ర్యం అనుభవించిన అతడు చదువును మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. అయితే బాక్సింగ్‌పై చిన్ననాటి నుంచి ఉన్న మక్కువకు కఠోర శ్రమ తోడవడంతో అతడు గొప్ప బాక్సర్లలో ఒకడిగా ఎదిగాడు. బాక్సర్‌గా మేవెదర్ ఎంతటి కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించాడో తన వైఖరితో అంతే అపకీర్తి మూటగట్టుకున్నాడు. కొద్దిరోజుల కిందట జపాన్ కుర్ర బాక్సర్‌ను మూడు నిమిషాల్లోపే చిత్తు చేసి మళ్లీ వార్తల్లో నిలిచాడీ అమెరికా స్టార్ బాక్సర్.

అనుభవించు రాజా..!

మేవెదర్ జూనియర్ వైభోగం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ప్రస్తుతం భోగభాగ్యాలతో విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్న 41 ఏళ్ల మేవెదర్ జూనియర్ చిన్ననాటి జీవితం కష్టాలు, కన్నీళ్ల మయం. మేవెదర్ సీనియర్, డెబోరా సింక్లైర్‌లకు 1977 ఫిబ్రవరి 24న మిచిగాన్‌లోని గ్రాండ్ ర్యాపిడ్స్‌లో జూనియర్ మేవెదర్ జన్మించాడు. 'పుట్టుకతోనే పరిమళిస్తారు' అన్న నానుడి మేవెదర్ జూనియర్ విషయంలో నిజమని చెప్పాలి. అతడు నెలల పసిగుడ్డుగా ఉన్నప్పుడే తండ్రి సీనియర్ మేవెదర్



మేవెదర్.. ఆ మధ్య పుట్టినరోజు నాడు సరదాగా ఓ జెట్ విమానం కొనుక్కున్నాడు. బయటి ప్రాంతాలకు ఎక్కడికి వెళ్లినా ప్రైవేట్ జెట్ (జి-5)లో వెళ్తుంటాడు. తన బాడీ గార్డులకు ఒకటి, ఇతర సిబ్బందికి మరో విమానం ఉన్నాయట.

కొడుకు చేతులను బాక్సింగ్‌లో మాదిరి పైకి ఎత్తుతుండేవాడు! అతడు వాటిని త్వరగా నేర్చుకొనేవాడని సీనియర్ మేవెదర్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. మేవెదర్ జూనియర్ చిన్నతనంలో ఇంట్లో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉండేవి. తండ్రి బాక్సర్ అయినా అతడిది నేర నేపథ్యం. కొకైన్ అమ్ముతుండేవాడు. తల్లి డ్రగ్స్‌కు బానిస. తల్లి అనారోగ్యంతో ఏడెనిమిదేళ్ల వయస్సులో అమ్మమ్మ ఊరు న్యూజెర్సీలో జూనియర్ ఉండేవాడు. వారిది పెద్ద కుటుంబం. చిన్న ఇంటిలో ఏడెనిమిదిమంది ఉండేవారు. ఇంట్లో కరెంటు కూడా సరిగ్గా ఉండేది కాదు. తండ్రితోపాటు బాబాయిలు జెఫ్, రోజర్ మేవెదర్‌లు ప్రొఫెషనల్ బాక్సర్లు కావడంతో ఈ క్రీడపై మేవెదర్ జూనియర్‌కు చిన్నప్పటినుంచే ఆసక్తి కలిగింది. తల్లితో కలిసి అమ్మమ్మవాళ్లింట్లో ఉండడంతో టీనేజ్‌లో జూనియర్ మేవెదర్‌కు తండ్రితో అంతగా సాన్నిహిత్యం ఉండేదికాదు. తండ్రీకొడుకు ఎక్కడికైనా కలిసి వెళ్లారంటే..అది బాక్సింగ్ ట్రెయినింగ్ కోసమే. తోటి వారంతా తల్లిదండ్రులతో కలిసి సరదాగా ఉండడం, వారితో సినిమాలకు, షికార్లకు వెళుతుండడం చూసిన జూనియర్ తనకు అలాంటి సరదాలు లేకపోవడంతో ఎంతో బాధపడేవాడు. మేవెదర్ 16 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు డ్రగ్స్ కేసులో తండ్రి అరెస్ట్ కావడం అతడిపై ప్రతికూల ప్రభావం చూపింది. ఆర్థిక ఇబ్బందులు, ఇంట్లో పరిస్థితులవల్ల మేవెదర్ జూనియర్ చదువును మధ్యలో ఆపేశాడు. ఇవన్నీ తనలో కసిని పెంచాయి. ఆ కసితో బాక్సింగ్‌లో కఠోర సాధన చేసి అనతికాలంలో చక్కటి బాక్సర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 1993లో 'గోల్డెన్ గ్లోవ్స్' చాంపియన్‌షిప్ గెలిచాడు. తండ్రి అరెస్ట్ కావడంతో బాబాయి రోజర్ అతడి ట్రెయినింగ్ బాధ్యతలు స్వీకరించాడు. మేవెదర్‌ను మేటి బాక్సర్‌గా రూపొందించడంలో రోజర్‌ది కీలకపాత్ర. 1994, 1996లోనూ 'గోల్డెన్ గ్లోవ్స్' చాంపియన్‌షిప్ సాధించిన మేవెదర్.. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌కు అమెరికా జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆ పోటీల్లో ఫెదర్ వెయిట్ విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఇక్కడినుంచి మేవెదర్ కెరీర్ ఒక్కసారిగా ఊపందుకుంది. అమెచ్యూర్‌గా అతడి రికార్డు 84-6 కావడం విశేషం.



వావ్వో.. వాచీ..!


మేవెదర్‌కు చాలా వాచీలున్నాయ్. వాటిలో ఒకదాని ఖరీదు 126 కోట్ల రూపాయలట. జాకబ్ అండ్ కో కంపెనీకి చెందిన బిలియనీర్ వాచ్ అది. 260 క్యారెట్ల ఎమరాల్డ్-కట్ డైమండ్స్‌తో కూడిన ఈ వాచ్ ధరతో బెవర్లీ హిల్స్‌లో ఓ పేద్ద ఇల్లు కొనుక్కోవచ్చు.



మేవెదర్ అత్యంత విలాసవంతమైన జీవితం గడుపుతూ, విపరీతంగా ఖర్చుపెడుతున్నా సంపద మాత్రం తరగడం లేదు. విచిత్రమైన విషయం ఏమిటంటే ఫ్లాయిడ్ ఏ పార్టీలకు వెళ్లినా, షాపింగ్‌కు బయల్దేరినా క్రెడిట్ కార్డులూ గట్రా వాడడు. ఓ జిప్‌లాక్

ఎంత ఖర్చు పెట్టినా తరగదే..!

బ్యాగ్‌నిండా డబ్బు నింపుకొని, స్కూల్ బ్యాగ్‌లా వీపునకు తగిలించుకుని అవసరమైన చోటల్లా కట్టలు కట్టలు వెదజల్లి షాపింగ్ చేస్తుంటాడు. అన్నట్టు అతనికి ఒకే బ్యాంక్ అకౌంట్ ఉంది. డబ్బంతా ఆ బ్యాంక్‌లోనే ఉంటుందట.



ప్రొఫెషనల్‌గా..

19 ఏళ్ల వయస్సులో ప్రొఫెషనల్‌గా తొలి బౌట్‌లోనే అదిరిపోయే ప్రదర్శన చేశాడు మేవెదర్. 1996లో రొబెర్టొ అపోడాకాను రెండో రౌండ్‌లోనే నాకౌట్ చేసి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. మేవెదర్ లాంటి నైపుణ్యం కలిగిన యువ బాక్సర్లు ప్రపంచంలో అతి కొద్ది మంది ఉంటారని అతని కెరీర్ ఆరంభంలోనే పలువురు ప్రముఖ బాక్సర్లు, కామెంటేటర్ల నుంచి అతడు ప్రశంసలు అందుకున్నాడు. మొదటి బౌట్ తర్వాత ఎదుర్కొన్న ప్రతి ప్రత్యర్థినీ చిత్తుచేస్తూ వచ్చిన మేవెదర్.. 1998లో వరల్డ్ బాక్సింగ్ కౌన్సిల్ (డబ్ల్యూబీసీ) సూపర్ ఫెదర్‌వెయిట్‌లో అప్పటి నెంబర్ వన్ బాక్సర్ గెనారొ హెర్నాండెజ్‌ను ఎనిమిదో రౌండ్‌లో టెక్నికల్ నాకౌట్ చేసి మొదటి వరల్డ్ టైటిల్‌ను అందుకున్నాడు. అనంతరం వెనుదిరిగి చూడని మేవెదర్ 2017 వరకూ 50 బౌట్లలో ఓటమి ఎరుగకుండా బాక్సింగ్ మేరునగధీరుడిగా నిలిచాడు. రెండుసార్లు రిటైర్మెంట్ ప్రకటించి మళ్లీ రింగ్‌లోకి దిగినా అతడి సత్తా ఏమాత్రం తగ్గకపోవడం గమనార్హం.



అజేయంగా..

- ఆడిన బౌట్లు 50- విజయాలు 50
- నాకౌట్లు 27
- అంపైర్ల నిర్ణయం-23



బారులు తీరిన కార్లు

మేవెదర్‌కున్న కార్ల సంఖ్య 100కు పైమాటే. వాటిలో నలుపు రంగు కార్లు లాస్‌వెగాస్ గ్యారేజ్‌లో, తెలుపు రంగు కార్లు మియామీలోని గ్యారేజ్‌లో ఉంటాయి. అన్నట్టు ఈమధ్యే ఆరు నల్లరంగు కార్లు కొన్నాడట. వీటి లో రోల్స్‌రాయిస్, ఫెరారీ, మే బాక్ కంపెనీలకు చెందినవి ఉన్నాయి. అతని గ్యారేజ్‌లో ఇంకా మెర్సిడెజ్ బెంజ్, లంబోర్గిని, పోర్షే, బుగాటి తదితర కార్లున్నాయ్. వీటిలోని కోనిక్‌జెగ్ ట్రెవిటా అనే కారు ఖరీదు సుమారు రూ. 33 కోట్లు. ఓ దశలో ప్రపంచంలో ఈ కార్లు రెండే ఉండగా వాటిలో ఒకటి మేవెదర్ గ్యారేజ్‌లో ఉండడం విశేషం.



ఇంద్రభవనమే..!

మేవెదర్ ఈ మధ్యే రూ.70 కోట్లు వెచ్చించి ఓ ఇల్లు కొనుక్కున్నాడు. 11 బెడ్‌రూమ్‌లు, 14 బాత్‌రూములు, ఇండోర్, అవుట్‌డోర్ స్విమ్మింగ్ పూల్స్, 20 కార్లు పట్టేంత గ్యారేజ్ ఈ ఇంట్లో ఉన్నాయి.



మేవెదర్‌పిల్లలు

తరతరాలు తిన్నా తరగని రీతిలో బాక్సింగ్ ద్వారా మేవెదర్ ఆస్తిని సంపాదించాడు. ఇటీవల జపాన్ కిక్‌బాక్సింగ్ సంచలనం టెన్షిన్ నసూకావాను రెండు నిమిషాల్లోపే నాకౌట్ చేయడం ద్వారా రూ. 63 కోట్లు సంపాదించాడు. బాక్సర్‌గా, మేవెదర్ ఆస్తుల విలువ రూ. 6,500 కోట్లకుపైనే ఉంటుందని అంచనా. అతని బెడ్‌రూమ్‌ల నిండా డాలర్లు, వజ్రవైఢూర్య మరకత మాణిక్యాలు రాశులు పోసి ఉంటాయి. తన నలుగురు పిల్లలంటే మేవెదర్‌కు ప్రాణం. చిన్నతనంలో తాను అనుభవించిన కష్టాలు పిల్లలకు తెలియకుండా పెంచుతున్నాడు. డబ్బులు లేక చదువును మధ్యలోనే ఆపేసిన మేవెదర్ తన పిల్లలు కోరుకున్న కోర్సులను ఖరీదైన స్కూళ్లలో చదివిస్తున్నాడు.

సంపద రూ. 6,500 కోట్లు!



వివాదాలు..

గొప్ప బాక్సర్‌గా ఎంత పేరు సంపాదించుకున్నాడో.. తన ప్రవర్తనతో మేవెదర్ అంతకంటే ఎక్కువగా అపఖ్యాతి పాలయ్యాడు. వ్యక్తిగత జీవితమంతా వివాదాలమయం. గృహహింస, లైంగిక హింసకు సంబంధించి అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. వీటిలో మాజీ గాళ్ ఫ్రెండ్ జోసీ హ్యారిస్ పెట్టిన ఒక కేసులో అతడు రెండు నెలలు జైలుకు కూడా వెళ్లాడు. మొత్తంగా 41ఏళ్ల ఫ్లాయిడ్ మేవెదర్ జూనియర్ జీవితం వివాదాలు, విలాసాల సమాహారం.

అంతులేని విలాసాలు..!



నెక్లెస్‌లు, ఉంగరాలు, ఇతరత్రా వజ్రఖచిత ఆభరణాలపై విపరీతంగా ఖర్చుపెడుతుంటాడు మేవెదర్. ఓసారి అతని ఇంటినుంచి సుమారు 49 కోట్ల రూపాయల ఖరీదైన ఆభరణాల్ని దొంగలు దొంగిలించుకుపోయారు.

ఒకసారి వేసిన బూట్లు మళ్లీ వేయడు. హోటల్ రూముల్లో దిగినప్పుడు వాటిని అక్కడి సిబ్బంది కోసం వదిలేసి వెళ్తుంటాడు.

మేవెదర్ నిక్కర్ల(షార్ట్స్)కే ఏడాదికి రూ. 4.5 లక్షలు ఖర్చుచేస్తాడు. వాటిని ఒకసారి వాడి పడేస్తుంటాడు.

క్రీడలపై బెట్టింగ్‌లు విపరీతంగా కాస్తుంటాడు. అతని బెట్టింగ్‌లన్నీ ఏడంకెల సంఖ్యలే. ఓ బాస్కెట్‌బాల్ ప్లే ఆఫ్ పోటీ సందర్భంగా మియామీ హీట్ జట్టుపై రూ. 40 కోట్ల దాకా బెట్టింగ్ కాసినట్టు చెబుతుంటారు.

ఎంత విలాసవంతమైన జీవితం గడిపినా బాక్సర్‌గా కఠోరంగా శ్రమిస్తాడు. ఒక్కోసారి తెల్లవారుజాము 3 గంటలకే లేచి ప్రాక్టీస్ ప్రారంభిస్తాడు. ఒక్కరోజైనా ప్రాక్టీస్ చేయకుండా ఉండలేడు.

అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం.. మేవెదర్ మద్యం ముట్టకపోవడం. కోట్ల రూపాయలు వెదజల్లి మిత్రులు, గాళ్ ఫ్రెండ్స్‌కు పార్టీలు ఇస్తుంటాడు. కానీ తాను మాత్రం మద్యానికి దూరం. ఇదే బాక్సర్‌గా అతని సక్సెస్‌కు కారణమని అంటుంటారు.

ప్రస్తుత గాళ్‌ఫ్రెండ్ యహిరాతో..




మేవెదర్ పలువురు మహిళలతో సంబంధాలు నెరిపాడు. వీరిలో మెలిస్సా బ్రిమ్‌తో ఒకరు, హారిస్ జోసీతో ముగ్గురు సంతానం.

గతేడాది ప్యారిస్‌లో మొసలి చర్మంతో చేసిన బ్యాగుల్ని కొనుక్కున్నాడట. వాటి ఖరీదు సుమారు 2 కోట్ల 75 లక్షల రూపాయలు.

ఐపీఎల్‌లో తెలుగు కెరటం

చూడటానికి సాదాసీదాగా ఉంటాడు కానీ తనదైన బౌన్సర్లతో బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తిస్తాడు. ఈ రంజీ సీజన్‌లో ఆంధ్ర తరఫున అత్యధిక (18) వికెట్లు తీసి.. ఐపీఎల్ వేలంలో ఢిల్లీ జట్టుకు ఎంపికైన అతడి పేరు బండారు అయ్యప్ప.

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజోలు అయ్యప్ప స్వస్థలం. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈ కుడిచేతివాటం మీడియం పేసర్.. కెరీర్ ప్రారంభంలో అనేక ఒడుదుడుకులు ఎదుర్కొన్నాడు. తండ్రి సత్యనారాయణ ఇస్త్రీ పని చేసి కుటుంబాన్ని పోషించేవాడు. క్రికెట్ గురించి ఏమీ తెలియని ఆయన అయ్యప్పను చదువుకోమని, ఆటకు దూరంగా ఉండమని తరచూ చెప్పేవారు. తల్లిదండ్రులు ఎన్ని మొట్టికాయలు వేసినా అతడు క్రికెట్ ఆడడం మాత్రం మానలేదు. అయ్యప్ప చిన్నతనంలో టెన్నిస్ బంతితోనే క్రికెట్ ఆడేవాడు. దీంతో టెన్నిస్ బంతితోనే బౌలింగ్ నేర్చుకున్నాడు. స్థానిక క్రికెట్ పోటీల్లో అయ్యప్ప అదరగొట్టడంతో స్వల్ప కాలంలోనే తూర్పు గోదావరి తరఫున అండర్-16లో ఆడే అవకాశం లభించింది. ఈ దశలో కోచ్ నిర్మల్ కుమార్ సూచనలతో అయ్యప్ప తన బౌలింగ్ శైలిలో కొన్ని మార్పులు చేసుకున్నాడు. ఆ తర్వాత జిల్లాస్థాయి నుంచి కూచ్ బెహర్, దులీప్ ట్రోఫీ, ఇండియా బ్లూ, ఆంధ్ర రంజీ జట్టు తరఫున అతడు విశేషంగా రాణించాడు.



కెరీర్ బెస్ట్: *ఇప్పటివరకు 28 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అయ్యప్ప 76 వికెట్లు పడగొట్టాడు. 2015లో ఆంధ్ర-ముంబై మధ్య రంజీ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అయ్యప్ప (6/71) ఆరు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు. ఆ తర్వాత 2017లో మధ్యప్రదేశ్‌తో జరిగిన రంజీలో అయ్యప్ప (7/99) ఏడు వికెట్లు తీసి ఆంధ్ర జట్టును గెలిపించాడు.*

ఆటుపోట్లు: *ఎనిమిదేళ్ల క్రితం తండ్రి చనిపోవడంతో అయ్యప్పపై కుటుంబ బాధ్యతలు పడ్డాయి. క్రికెట్ ఆడుతూనే ఏదో ఒక పనిచేస్తూ కుటుంబ పోషణలో సాయం చేసేవాడు. కుటుంబ భారంతో పాటు కీలక టోర్నీల ముందు గాయాల బారినపడడంతో అయ్యప్ప కొంతకాలం కెరీర్‌లో వెనకపడ్డాడు. ఇటీవల హైదరాబాద్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావడంతో కొంతమేర ఆర్థిక ఇబ్బందులను అధిగమించాడు. ఫిట్‌నెస్ కూడా మెరుగుపరుచుకున్నాడు. ప్రస్తుతం సూపర్‌ఫామ్‌లో ఉన్న అయ్యప్ప తన ప్రతిభతో ఆంధ్ర జట్టు బౌలింగ్ దళానికి తురుపుముక్కగా మారాడు.*

నాన్న మాటలు వెంటాడతాయి

'నేను పడుతున్న కష్టాలు నువ్వు నీ తర్వాతి వాళ్లు పడకూడదు' అని నాన్న చెప్పిన మాటలు నన్ను వెంటాడుతుంటాయి. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు సాగుతున్నా. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నన్ను అన్ని విధాలా ప్రోత్సహించింది. జాతీయ జట్టులో స్థానం సంపాదించడానికి కఠోరంగా శ్రమిస్తున్నా. **- బండారు అయ్యప్ప**

పీబీఎల్‌లో నేడు
ఢిల్లీ x పుణె (సా. 4 గం.)
హైదరాబాద్ x అహ్మదాబాద్ (రాత్రి 7 గం.)
స్టార్ స్పోర్ట్స్-1లో

బోపన్న జోడీదే టాటా ఓపెన్



పుణె: భారత స్టార్ జోడీ రోహన్ బోపన్న-దివిజ్ శరణ్ సొంతగడ్డపై అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఈ జంట టాటా ఓపెన్‌లో డబుల్స్ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో బోపన్న జోడీ 6-3, 6-4తో బ్రిటన్ ద్వయం ల్యూక్ బాంబ్రిడ్జ్-జానీ ఒమారాలపై గెలుపొందింది. బోపన్నకిది 18వ ఏటీపీ టూర్ టైటిల్ కాగా, శరణ్‌కు నాలుగవది. బోపన్న తన సర్వీసులో కేవలం నాలుగు పాయింట్లను కోల్పోయాడు. పదునైన సర్వీసులతోపాటు, బ్యాక్‌హ్యాండ్ విన్నర్స్‌తో బోపన్న మ్యాచ్ ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించాడు. పురుషుల సింగిల్స్‌లో కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా) విజేతగా నిలిచాడు. ఫైనల్లో కెవిన్ 7-6, 6-7, 7-6తో ఇవో కార్లోవిక్ (క్రొయేషియా)ను ఓడించి టైటిల్‌ను నెగ్గాడు.

భళా.. బెంగళూరు

తొలిసారి ప్రొ కబడ్డీ టైటిల్ కైవసం
ఫైనల్లో గుజరాత్‌పై గెలుపు



ప్రైజ్ మనీ
విజేతకు రూ. 3 కోట్లు
రన్నరప్ రూ. 1.80 కోట్లు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో బెంగళూరు బుల్స్ అదరగొట్టింది. ఈ జట్టు ఫైనల్లో గుజరాత్‌ను చిత్తుచేసి తొలిసారి లీగ్ చాంపియన్‌గా అవతరించింది. శనివారం హోరాహోరీగా సాగిన తుదిపోరులో బెంగళూరు 38-33తో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌ను ఓడించింది. దీంతో వరుసగా రెండో ఏడాది కూడా గుజరాత్ రన్నరప్‌తోనే సరిపెట్టుకోక తప్పలేదు. ఈ హైఓల్టేజ్ మ్యాచ్‌లో బుల్స్‌ను విజయ తీరాలకు చేర్చడంలో స్టార్ రైడర్ పవన్ (25) ప్రధాన పాత్ర పోషించాడు. ఆట తొలి అర్ధ భాగంలో గుజరాత్ రైడర్ సచిన్ (10) రాణించడంతో ఆ జట్టు 17-9తో ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయ అర్ధభాగంలో రైడర్ పవన్ చెలరేగడంతో 10వ నిమిషానికి బుల్స్ 23-22 స్కోరుతో రేసులోకి దూసుకొచ్చింది. అక్కడ నుంచి ఆధిక్యం ఇరు జట్ల మధ్య చేతులు మారింది. ఈ క్రమంలో 16వ నిమిషంలో 29-29తో స్కోర్లు సమమయ్యాయి. ఈ దశలో బుల్స్ రైడర్ పవన్ వరుస రైడ్లలో పాయింట్లు సాధించి జట్టును గెలిపించాడు. ఇక, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డును పవన్ కుమార్ (బెంగళూర్) దక్కించుకున్నాడు. రైడర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును ప్రదీప్ నర్వాల్ (పట్నా) దక్కించుకోగా డిఫెండర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును నితీష్ కుమార్ (యూపీ యోధ) సొంతం చేసుకున్నాడు.

షూటర్ మను భాకర్‌కు అవమానం



అనిల్ విజ్

చండీగఢ్: 'అబద్ధపు హామీ లేనా' అంటూ టీనేజ్ షూటర్ మను భాకర్ చేసిన ట్వీట్ వివాదాస్పదమైంది. ఆమె వ్యాఖ్యలు తనను అవమానపరిచే విధంగా ఉన్నాయంటూ హరియాణా క్రీడా మంత్రి అనిల్ విజ్.. ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అనవసరంగా వివాదాన్ని సృష్టించినందుకు భాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే, అనిల్ తీరును భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షుడు నరీందర్ బాత్రా తప్పుబట్టారు. షూటర్‌ను భయపెట్టే విధంగా ప్రవర్తించడాన్ని ఆపాలన్నారు. గతేడాది యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన భాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 2 కోట్ల నజరానాను విజ్ ప్రకటించారు. అయితే, అది ఇంతవరకు అందకపోవడంపై మను అసంతృప్తి వ్యక్తం చేస్తూ 'సార్, ఆ హామీ నిజమేనా?.. లేదా ఉత్తుత్తిదేనా స్పష్టత ఇవ్వండి?' అని ట్వీట్ చేసింది. దీనిపై విజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రచ్చకెక్కే బదులు క్రీడాశాఖను సంప్రదించాల్సింది. మను వాడిన భాష రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చే విధంగా ఉంది. దీనికి ఆమె పశ్చాత్తాపపడతారు' అని రిప్లై ట్వీట్‌లో అనిల్ విరుచుకుపడ్డారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం ఈ ఏడాది నెగ్గిన వారికి తర్వాతి ఏడాది ప్రోత్సాహకాలు అందజేస్తున్నామనే విషయాన్ని గుర్తు చేశారు.

సెమీస్‌కు ముంబై

పీబీఎల్‌లో చెన్నైపై విజయం



సమీర్ వర్మ

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో ముంబై రాకెట్స్ సెమీస్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై రాకెట్స్ 5-0తో చెన్నై స్మాషర్స్‌ను చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్‌గా జరిగిన తొలి మ్యాచ్‌లో ఆండ్రెస్ యాంటన్‌సెన్ 15-14, 15-11తో రాజీవ్ ఓసెఫ్‌పై గెలిచి ముంబైకి శుభారంభం అందించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో కిమ్ జి జంగ్-పయా బెర్నాడ్ట్ జోడీ 15-14, 15-14తో క్రిస్ ఎడ్‌కాక్-గాబ్రియెల్ ఎడ్‌కాక్ జంటపై నెగ్గింది. ఈ మ్యాచ్‌ను చెన్నై ట్రంప్‌గా ఎంచుకోవడంతో ఓ పాయింట్ కోత పడింది. మహిళల సింగిల్స్‌లో సన్ జి హ్యూన్ 15-7, 15-8తో అనురాపై గెలిచి చెన్నైకి తొలి పాయింట్ అందించింది. కానీ, ట్రంప్ మ్యాచ్ ఓడడంతో ఆ పాయింట్ కూడా పోయింది. ముంబై ట్రంప్‌గా ఎంచుకున్న రెండో పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ 12-15, 15-13, 15-9తో కశ్యప్‌పై నెగ్గాడు. పురుషుల డబుల్స్‌లో రాకెట్స్ జోడీ కిమ్ జి జుంగ్-లీ యోంగ్ డే 15-8, 15-10తో సుమీత్ రెడ్డి-చిన్ చుంగ్‌పై నెగ్గింది.

సైనా గెలిచినా..: కెప్టెన్ సైనా నెహ్వాల్ నెగ్గినా నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌కు ఓటమి తప్పలేదు. నార్త్ ఈస్ట్రన్ వారియర్స్ 3-4తో బెంగళూరు ర్యాప్టర్స్ చేతిలో ఓడింది. ట్రంప్‌గా ఎంచుకున్న మహిళల సింగిల్స్‌లో సైనా 15-10, 15-7తో టి ర్యాంగ్ వూపై నెగ్గి రెండు పాయింట్లు అందించింది. అంతకుముందు పురుషుల డబుల్స్‌ను బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకోగా.. అహ్‌సాన్-సెథియవాన్ జంట 15-14, 15-11తో లి మిన్ చుంగ్-యె యి సెయింగ్‌పై నెగ్గి 2-0 ఆధిక్యంలో నిలిపింది. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 15-11, 15-12తో తనోంగ్‌సన్ సయిన్‌సోంబూమ్‌సన్‌పై నెగ్గి ర్యాప్టర్స్‌కు మరో పాయింట్ అందించాడు. ట్రంప్ మ్యాచ్‌ను నెగ్గిన సైనా.. వారియర్స్‌ను 2-3తో నిలబెట్టింది. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్ 12-15, 15-6, 15-7తో టియాన్ హో వీను ఓడించి 4-2తో బెంగళూరును గెలిపించాడు. మిక్స్‌డ్‌లో మిన్ చున్-కిమ్ జోడీ 15-11, 15-9తో లారెన్-మార్కస్‌పై గెలిచి వారియర్స్‌కు ఓదార్పు పాయింట్ అందించింది. ఈ విజయంతో సెమీస్ బెర్త్‌కు బెంగళూరు మరింత చేరువైంది.

ఈసారి బౌలర్లు

ముచ్చటగా మూడోరోజు భారత్‌దే హవా. తొలి రెండు రోజులు బ్యాట్స్‌మెన్ భారీ స్కోర్లతో సిరీస్ గెలుపు ఖాయమే అనేలా చేయగా.. ఆసీస్‌కు ఇంకేమైనా ఆశలు ఉంటే వాటిని తుంచేసే ప్రయత్నం భారత బౌలర్లు చేశారు. వీరి జోరుకు ఆతిథ్య జట్టు పోరాటం తొలి సెషన్‌కే పరిమితమైంది. ముఖ్యంగా కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా స్పిన్ ఉచ్చులో పడిన ఆతిథ్య జట్టు ఇప్పటికే సగం వికెట్లు కోల్పోగా ఇంకా 386 పరుగులు వెనకబడి ఉంది. అలాగే ఆ జట్టును ఫాలో ఆన్ ప్రమాదం కూడా వెంటాడుతోంది. ఓపెనర్ మార్కస్ హ్యారిస్ ఒక్కడే కాస్త నిలబడగలిగాడు. మరోవైపు వర్షం అంతరాయం కారణంగా ఆటను గంటన్నర ముందుగానే ముగించాల్సి వచ్చింది. లేకుంటే ఆసీస్ పరిస్థితి మరింత దీనంగా ఉండేదేమో!

కంగారెత్తించారు

● ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 236/6 ● హ్యారిస్ అర్ధ సెంచరీ
● కుల్దీప్‌కు మూడు వికెట్లు ● నాలుగో టెస్టు



కుల్దీప్ యాదవ్ (3/71)

సిడ్నీ: చిరస్మరణీయ విజయం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న భారత జట్టు సమష్టిగా ఆస్ట్రేలియాను దెబ్బకొడుతోంది. బ్యాట్స్‌మెన్ సూపర్ షోకు ఏమాత్రం తగ్గని విధంగా మూడో రోజు శనివారం భారత బౌలర్లు ఆధిపత్యం చెలాయించారు. కుల్దీప్ (3/71), జడేజా (2/62) సుడులు తిరిగే బంతులతో ఆసీస్‌ను కష్టాల్లోకి నెట్టారు. అయితే ఆఖర్లో వెలుతురులేమి, వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించగా ఇంకా 16.3 ఓవర్లు మిగిలి ఉండగానే ముగించారు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 83.3 ఓవర్లలో 6 వికెట్లకు 236 పరుగులు చేసింది. ఇంకా భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 386 పరుగులు వెనకబడి ఉండగా చేతిలో నాలుగు వికెట్లున్నాయి. అలాగే ఫాలో ఆన్ తప్పించుకోవాలంటే ఆ జట్టు మరో 187 రన్స్ చేయాల్సి ఉంది. ఓపెనర్ మార్కస్ హ్యారిస్ (120 బంతుల్లో 8 ఫోర్లతో 79) భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కోగలిగాడు. లబుషేన్ (38) ఫర్వాలేదనిపించగా క్రీజులో హ్యాండ్స్‌కోంబ్ (28 బ్యాటింగ్), కమిన్స్ (25 బ్యాటింగ్) ఉన్నారు. షమికి ఓ వికెట్ దక్కింది. ఇక చివరి రెండు రోజులు మ్యాచ్‌ను అరగంట ముందుగానే ఆరంభించనున్నారు.

ఆరంభం ఆసీస్‌దే..: 24/0 ఓవర్‌నైట్ స్కోరుతో ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌ను ధాటిగానే ఆరంభించింది. హ్యారిస్ చక్కటి షాట్లతో ఎదురుదాడికి దిగి ఈ సెషన్‌లో ఆసీస్ ఆధిపత్యాన్ని చాటాడు. భారత బౌలర్లు కేవలం ఒకే వికెట్ పడగొట్టి 98 పరుగులు సమర్పించుకున్నారు. ఆరంభం నుంచే ఖవాజా, హ్యారిస్ చక్కటి స్ట్రోక్‌ప్లేతో చెలరేగి స్కోరును వేగంగా పెంచారు. తొలి వికెట్‌కు 72 పరుగులు జోడించిన తర్వాత ఖవాజాను కుల్దీప్ అవుట్ చేశాడు. అటు చూడముచ్చటైన కవర్ డ్రైవ్స్‌తో చెలరేగిన హ్యారిస్ 67 బంతుల్లోనే అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. జోరు తగ్గించని అతడు కుల్దీప్ వేసిన ఇన్నింగ్స్ 28వ ఓవర్‌లో మూడు ఫోర్లతో సవాల్ విసిరాడు. రెండో వికెట్‌కు హ్యారిస్, లబుషేన్ మధ్య 50 పరుగుల భాగస్వామ్యం జత చేరిన తర్వాత జట్టు లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

బౌలర్ల జోరు షురూ..: బ్రేక్ తర్వాత ఆసీస్ ఆటలో తడబాటు కనిపించింది. చెలరేగిన భారత బౌలర్లు నాలుగు వికెట్లతో ఆ జట్టును దెబ్బతీశారు. స్వల్ప వ్యవధిలోనే జడేజా రెండు వికెట్లు తీసి ఒత్తిడి పెంచాడు. సెషన్ ఆరంభమైన మూడో ఓవర్‌లోనే హ్యారిస్‌ను బౌల్డ్ చేయగా కొద్దిసేపటికే షాన్ మార్ష్ (8) ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో ఉన్న రహానే పట్టేశాడు. మరో రెండు ఓవర్ల తర్వాత క్రీజులో నిలదొక్కుకుంటున్న లబుషేన్.. షమి బౌలింగ్‌లో రహానె మెరుపు క్యాచ్‌తో నిష్క్రమించాడు. ఈ దశలో జట్టు రక్షణాత్మకంగా ఆడగా పరుగులు తగ్గాయి. అయితే టీ బ్రేక్‌కు ముందు ఓవర్‌లో ట్రావిస్ హెడ్ (20)ను కుల్దీప్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపగా ఆసీస్ 198/5 స్కోరుతో విరామానికి వెళ్లింది.

వర్షం అంతరాయం: ఆఖరి సెషన్‌ను ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఆరంభించగా తొలి ఓవర్‌లోనే కుల్దీప్ ఓ క్లాసిక్ బంతితో కెప్టెన్ పెయిన్ (5)ను బౌల్డ్ చేశాడు. ఈ పరిస్థితిలో హ్యాండ్స్‌కోంబ్, ప్యాట్ కమిన్స్ నిలకడగా ఆడి ఆదుకునే ప్రయత్నం చేశారు. 84వ ఓవర్‌లో మూడో బంతి తర్వాత భారీ వర్షం కురవగా ఆట నిలిపివేశారు.

శభాష్.. రాహుల్



తక్కువ ఎత్తులో వచ్చిన క్యాచ్‌లపై నిర్ణయం తీసుకోవడం అంపైర్లకు అంత సులువు కాదు. అటు క్యాచ్ పట్టిన ఆటగాళ్లు కూడా తమకు విషయం తెలిసీ అవుట్ కోసం అప్పీల్ చేస్తుంటారు. దీంతో టెక్నాలజీ సహాయంతో నిర్ణయం తీసుకోవాల్సి వస్తుంది. కానీ ఈ విషయంలో కేఎల్ రాహుల్ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి క్రికెట్ అభిమానుల మెప్పు పొందాడు. మూడో రోజు జడేజా వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో తొలి బంతిని ఓపెనర్ హ్యారిస్ మిడాన్‌లో ఆడే ప్రయత్నం చేశాడు. అయితే టైమింగ్ మిస్ కావడంతో బంతి రాహుల్ వైపు వెళ్లింది. దీన్ని అతడు కుడివైపు డైవ్ చేస్తూ పట్టేశాడు. అంతా క్యాచ్ అవుట్ అనుకున్నా, అంతకన్నా ముందే బంతి నేలకు తాకిన విషయాన్ని గ్రహించి రాహుల్.. నాటౌట్‌గా సంకేతాలిచ్చాడు. దీంతో జట్టు సభ్యులతో పాటు అంపైర్ కూడా రాహుల్‌ను అభినందించారు. అలాగే సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కూడా శభాష్.. రాహుల్ అని కొనియాడుతున్నారు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హ్యారిస్ (బి) జడేజా 79; ఖవాజా (సి) పుజారా (బి) కుల్దీప్ 27; లబుషేన్ (సి) రహానె (బి) షమి 38; షాన్ మార్ష్ (సి) రహానె (బి) జడేజా 8; హెడ్ (సి అండ్ బి) కుల్దీప్ 20; హ్యాండ్స్‌కోంబ్ (బ్యాటింగ్) 28; పెయిన్ (బి) కుల్దీప్ 5; కమిన్స్ (బ్యాటింగ్) 25; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 83.3 ఓవర్లలో 236/6. వికెట్ల పతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198. **బౌలింగ్:** షమి 16-1-54-1; బుమ్రా 16-4-43-0; జడేజా 27.3-9-62-2; కుల్దీప్ యాదవ్ 24-6-71-3.

భారత్ బోణీ కొట్టేనా?

● ఏఎఫ్‌సీ కప్‌లో థాయ్‌లాండ్‌తో ఢీ నేడు



రాత్రి 7గం నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో

అబుదాబి: ఆసియా ఫుట్‌బాల్ (ఏఎఫ్‌సీ) కప్‌లో భాగంగా ఆదివారం జరిగే గ్రూప్-ఎ మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో భారత్ తలపడనుంది. ఇప్పటి వరకూ రెండు జట్లు 24సార్లు తలపడగా.. భారత్ 5 మ్యాచ్‌ల్లో మాత్రమే నెగ్గింది. థాయ్‌లాండ్ 12సార్లు గెలుపొందగా, మిగిలిన 7 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. గత రికార్డులు ఎలా ఉన్నా ఈసారి సత్తా చాటుతామని భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి ఆశాభావం వ్యక్తం చేశాడు.



ఫైనల్లో నిఖత్ జరీన్

విజయనగర (కర్ణాటక): తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటింది. నిజామాబాద్‌కు చెందిన నిఖత్ 57 కిలోల విభాగంలో ఫైనల్ చేరింది. నిఖత్ సెమీఫైనల్లో వన్‌లాయ్ దౌతీని ఓడించి కామన్వెల్త్ క్రీడల చాంపియన్ పింకీ జాంగ్రాతో టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది.

గులాబీ టోపీలతో కోహ్లీ సేన

ఆసీస్ మాజీ పేసర్ మెక్‌గ్రాత్‌కు చెందిన ఫౌండేషన్‌కు భారత క్రికెటర్లు తమవంతు సహకారం అందించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన, చికిత్సకోసం తోడ్పడుతున్న 'ది మెక్‌గ్రాత్ ఫౌండేషన్'కు తమ సంతకాలతో కూడిన పింక్ టోపీలను వారంతా అందించారు. అటు ఆసీస్ ఆటగాళ్లు కూడా ఇలాగే మద్దతు పలికారు. వీటిని వేలం వేసి వచ్చిన నిధులు ఫౌండేషన్‌కు అందిస్తారు. మెక్‌గ్రాత్ భార్య జేన్ క్యాన్సర్‌తో బాధపడి 2008లో మరణించింది. దీంతో పదేళ్లుగా నూతన ఏడాది ఆరంభంలో సిడ్నీలో జరిగే టెస్టును పింక్ టెస్టుగా జరుపుతూ నిధుల సేకరణ చేపడుతున్నారు. తొలి రోజు బ్యాటింగ్‌లో కోహ్లీ తన గ్లోవ్స్, బ్యాట్ లోగో.. హ్యాండిల్‌ను కూడా గులాబీ రంగుతో మార్చాడు.



పంత్‌తో మెక్‌గ్రాత్

పంత్.. మరో గిల్‌క్రిస్ట్: రిషభ్ పంత్‌ను మరో గిల్‌క్రిస్ట్ అని ఆసీస్ మాజీ కెప్టెన్ పాంటింగ్ కొనియాడాడు. 'పంత్ సహజ నైపుణ్యం కలిగిన ఆటగాడు. మేం కామెంట్రీ బాక్స్‌లో ఉన్నప్పుడు అతడిని మరో గిల్‌క్రిస్ట్‌గానే పేర్కొంటాం. భవిష్యత్‌లో ధోనీకన్నా ఎక్కువ శతకాలు చేస్తాడు' అని పాంటింగ్ తెలిపాడు.

సఫారీల విజయ లక్ష్యం 41

కేప్‌టౌన్: రబాడ (4/61), డేల్ స్టెయిన్ (4/85) విజృంభించడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్థాన్ ఓటమి అంచులకు చేరింది. మూడో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 294 పరుగులకు ఆలౌటైంది. దీంతో పర్యాటక జట్టుకు 40 పరుగుల స్వల్ప ఆధిక్యం మాత్రమే లభించింది. అసద్ షఫీక్ (88), బాబర్ ఆజమ్ (72) మాత్రమే రాణించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 382/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా మరో 49 పరుగులు మాత్రమే జోడించి 431కి ఆలౌటైంది. ఆమిర్, షహీన్ అఫ్రీది చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే ఆలౌటైంది.

పెరీరా పోరాటం వృథా

● రెండో వన్డేలో లంక ఓటమి ● న్యూజిలాండ్‌దే సిరీస్



తిసారా పెరీరా (140)

మౌంట్ మాంగనూయి: తిసారా పెరీరా (74 బంతుల్లో 8 ఫోర్లు, 13 సిక్సర్లతో 140) వీరోచితంగా పోరాడినా న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో శ్రీలంక 21 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ మరో మ్యాచ్ ఉండగానే 2-0తో కైవసం చేసుకుంది. 320 రన్స్ ఛేదనలో.. లంక 46.2 ఓవర్లలో 298 పరుగులకే ఆలౌటైంది. 112/2తో పటిష్ఠంగా ఉన్న సమయంలో లంక ఆరు ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే మలింగతో కలసి 8వ వికెట్‌కు 75, 9వ వికెట్‌కు సండకన్‌తో కలసి పెరీరా 51 పరుగులు జోడించి ఆశలు రేపాడు. కానీ, 47వ ఓవర్‌లో అవుట్ కావడంతో లంక పోరాటం ముగిసింది. అంతకు ముందు కివీస్ 50 ఓవర్లలో 319/7 రన్స్ స్కోరు చేసింది.



ఈ చేప ధర రూ.21 కోట్లు..!

టోక్యో, జనవరి 5: కిలో చేపల ధర ఎంతుంటుంది? రెండు మూడు వందలు. కొర్రమీనులైతే ? ఇంకాస్త ఎక్కువుంటుంది. గోదావరి నదిలో దొరికే పులస చేపలైతే కిలోకు రూ.10 వేల వరకు పలుకుతాయి. కానీ ఈ చేప ఖరీదెంతో తెలుసా? అక్షరాలా రూ.21 కోట్లు! దీని ప్రత్యేకత ఏంటను కుంటున్నారా? సముద్ర చేపల్లో అత్యంత రుచికరంగా ఉండే ఈ చేప పేరు టూనా ఫిష్! జపాన్‌లోని టోక్యోలో జరిగిన వేలంలో 282 కిలోల బరువున్న ఈ బ్లూఫిన్ టూనా చేపను స్థానిక సుషి రెస్టారెంట్ యజమాని కియోషి కిమురానే రూ.21 కోట్లకు దక్కించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా టొయోసు మార్కెట్లో ఏటా ఈ చేపల వేలం జరుగుతుంది. 2013లో జరిగిన వేలంలోనూ కిమురా రూ.9కోట్లు చెల్లించి టూనా చేపను దక్కించుకున్నారు.



ఆంజనేయస్వామికి లక్ష వడమాలలతో అలంకారం

చెన్నై అశోక్‌నగర్‌లోని శ్రీకరుమారి త్రిపురసుందరి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రపంచ శాంతి, రాష్ట్రాభివృద్ధి కోసం 1,00,008 వడలతో తయారుచేసిన మాలలతో సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను అలంకరించారు. వడమాలల మధ్య కొలువుదీరిన స్వామిని దర్శించేందుకు నగరం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మీ హయాంలో మధ్యవర్తులదే హవా

మిషెల్ కోసం దేశ భద్రతనే పణంగా పెట్టారు.. ఇప్పుడు 'కాపలాదారు'ను తప్పించాలనుకుంటున్నారు

- దొంగలు ఎంతకైనా తెగిస్తారు
- కుట్రలు బయటికొస్తున్నాయ్
- కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ధ్వజం

భువనేశ్వర్, రాంచి, జనవరి 5: అత్యంత కీలకమైన రక్షణ రంగంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశ భద్రత కోసం కాకుండా మధ్యవర్తుల ప్రయోజనాల కోసమే పని చేశాయని ప్రధాని మోదీ ఆరోపించారు. రక్షణ రంగాన్ని బలహీనం చేసేందుకు 2004-14 మధ్య కుట్ర జరిగిందన్నారు. నాటి వాస్తవాలు ఇప్పుడు బయటపడుతుండడంతో కాంగ్రెస్‌కు నొప్పిగా ఉందని చెప్పారు. శనివారం ఒడిసాలోని బారీపడాలో ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ నేతలు తమ మార్గానికి అడ్డొచ్చే 'కాపలాదారు'ను ఎలాగైనా సరే తప్పించేయాలని చూస్తున్నారు. అది సమాజం అయినా, ఫ్యాక్టరీలైనా దొంగలు ఎప్పుడూ తమ పనిని సులభంగా కానిచ్చుకునేందుకు కాపలాదారును తొలగించాలనే చూస్తారు" అని అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణాన్ని ఉద్దేశించి కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మధ్యవర్తి మిషెల్‌కు అప్పట్లో ప్రధాని కార్యాలయంలో ఏం జరుగుతుందో కూడా తెలిసిపోయిందని మోదీ ఆరోపించారు. రక్షణ రంగం గురించి బహుశా నాటి ప్రధాని(మన్మోహన్) కంటే కూడా ఎక్కువ సమాచారం అతని దగ్గర ఉండొచ్చని పేర్కొన్నారు. మధ్యవర్తి లబ్ధి కోసం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టిన వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని, ఈ విషయంలో దోషులను వదిలేది లేదని మోదీ స్పష్టం చేశారు. ఇక రాఫెల్ ఒప్పందం విషయంలో కాంగ్రెస్ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైనాన్ని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో చక్కగా బయటపెట్టారని కితాబిచ్చారు. అంతకుముందు ఆయన జార్ఖండ్‌లో రూ.2,391 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన కోయల్ కారో మండల్ డ్యాం సహా పలు సాగునీటి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రుణమాఫీ పేరిట కాంగ్రెస్ పార్టీ రైతులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. వారిని కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తోందని ధ్వజమెత్తారు. "గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుల కోసం సాగునీటి ప్రాజెక్టులు, కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో వారు తప్పనిసరిగా రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడేమో రుణాలు మాఫీ చేస్తామంటూ హామీలిచ్చి వారిని తప్పుదోవ పట్టిస్తున్నారు. నేను కూడా రైతులను ఓటు బ్యాంకుగా పరిగణిస్తే వారికి రూ.లక్ష రుణమాఫీ చేసేవాడ్ని. కానీ, రైతులకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించి వారి పంట ఉత్పత్తులను పెంచడం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి మేం ప్రాధాన్యమిస్తాం" అని మోదీ పేర్కొన్నారు. "కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి కోయిల్ అంటే ఏంటో తెలియదు. అది సాగునీటి ప్రాజెక్టా లేక నది పేరా లేక పక్షి పేరా.. అనే విషయం కూడా తెలియదు" అని ఎద్దేవా చేశారు.



ఒడిసాలోని మయూర్‌భంజ్ జిల్లా బరిపద సభలో అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

ప్రధానిని నిలదీయండి: రాహుల్



న్యూఢిల్లీ, జనవరి 5: ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. మోదీ ఒక అసమర్థుడని, ఎవరి మాట వినరని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వ హయాంలో గత ఏడాది 1.10 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. రాఫెల్ ఒప్పందానికి సంబంధించి ప్రతి ఒక్కరూ పార్లమెంటులో తాను అడిగిన ప్రశ్నలతో ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం రెండుగంటల పాటు పార్లమెంటులో చెలరేగి మాట్లాడినప్పటికీ.. తాను అడిగిన రెండు ప్రశ్నలకు మాత్రం ఇంకా సమాధానమివ్వలేదని విమర్శించారు. అనిల్ అంబానీ సంస్థకు సెట్ ఆఫ్ కాంట్రాక్టు ఇచ్చిందెవరు? మోదీ సిఫారసు మేరకు హాల్‌ను తప్పించి ఈ కాంట్రాక్టును అంబానీ సంస్థకు కట్టబెట్టినప్పుడు రక్షణ శాఖ అధికారులు ఎవరైనా అడ్డు చెప్పారా? లేదా? అనే అంశాలపై సమాధానాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక వీడియో పోస్టు చేశారు.

ఉద్యోగుల జీతాలకు వెయ్యికోట్ల రుణం!

- ఆర్థిక సంక్షోభంలో హెచ్‌ఏఎల్
- సంస్థ సీఎండీ మాధవన్ వెల్లడి

బెంగళూరు, జనవరి 5: రాఫెల్ డీల్‌తో అందరి దృష్టిలో పడిన దేశ ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. సంస్థలో పని చేస్తున్న 29వేల మందికి పైగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి నిధులు లేక ఇబ్బందులు పడుతోంది. దీని కోసం సుమారు రూ.వెయ్యి కోట్లు అప్పు చేయాలని నిర్ణయించింది. ధనిక సంస్థగా ఉన్న హాల్ మూడు దశాబ్దాల్లో తొలిసారి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకుందని ఆ సంస్థ సీఎండీ ఆర్ మాధవన్ అన్నారు. మార్చి నాటికి నగదు ప్రతికూలత భరించలేని స్థాయిలో దాదాపు రూ.6వేల కోట్లకు చేరుకోనుందని ఆందోళన వ్యక్తం చేశారు. హాల్‌కు అతిపెద్ద కస్టమర్‌గా ఉన్న భారత వైమానిక దళం నుంచి భారీగా బకాయిలు పేరుకుపోవడం కంపెనీని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. సంస్థకు రూ.15,700 కోట్ల వరకూ బకాయిలున్నట్లు చెప్పారు. ఇందులో ఐఏఎఫ్ నుంచి రూ.14,500కోట్లు, మిగిలిన మొత్తం భారత ఆర్మీ, నేవీ, కోస్టల్ గార్డ్ విభాగాల నుంచి రావాల్సి ఉందని వివరించారు. ఈ బాకీల మొత్తం మార్చినాటికి రూ.20వేల కోట్లకు చేరుకోనుందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఏప్రిల్‌లో నూతన కొనుగోళ్లకు నిధులు ఉండవంటున్నారు.



చేతులు కలిపిన మాయా, అఖిలేశ్

- పొత్తు కుదుర్చుకున్న ఎస్పీ, బీఎస్పీ.. ఢిల్లీలో ఇద్దరు నేతల భేటీ

లఖ్‌నవూ, జనవరి 5: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఒంటరి కానుందా? వచ్చే లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలో కూటమిగా వెళ్లాలని ప్రధాన పార్టీలైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ నిర్ణయించాయి. దేశంలోనే అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో చెరో 37 స్థానాల్లో పోటీకి రెండు పార్టీలు అంగీకరించాయి. ఢిల్లీలో శుక్రవారం సమావేశమైన ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి ఈ మేరకు ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు ఎస్పీ జాతీయ ప్రతినిధి రాజేంద్ర చౌదరి శనివారం చెప్పారు. చిన్న పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, మహాకూటమి ప్రకటన ఈ నెలాఖరులోగా వస్తుందన్నారు. ఈ మహాకూటమిలో కాంగ్రెస్ పార్టీని చేర్చుకోవడంపై అఖిలేశ్, మాయావతిలదే తుది నిర్ణయమన్నారు. మరోవైపు మహాకూటమి ఏర్పాటుకు అఖిలేశ్, మాయావతి ఏకపక్షంగా సన్నద్ధమవుతుండటం పట్ల కాంగ్రెస్ పార్టీ ఆగ్రహంతో ఉంది. తామూ ఒంటరి పోరుకు సిద్ధమేనని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పీఎల్ పూనియా తెలిపారు.

అఖిలేశ్‌పై సీబీఐ అస్త్రం?

న్యూఢిల్లీ, జనవరి 5: ఎస్పీ, బీఎస్పీల పొత్తు ఖాయమైన మరుసటి రోజే ఆ రెండు పార్టీల నేతలపై మోదీ సర్కారు సీబీఐ అస్త్రాన్ని ప్రయోగించింది. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలతో ఎస్పీ ఎమ్మెల్సీ రమేశ్ మిశ్రా, బీఎస్పీ నేత రామ్ అవతార్ రాజ్‌పుత్‌ల ఇళ్లతో సహా 12 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. సీబీఐ చర్యలను స్వాగతిస్తున్నామని, అఖిలేశ్, మాయావతి చేతులు కలిపిన మరుసటి రోజే సోదాలు జరపడం అనుమానాలకు తావిస్తోందని ఎస్పీ ప్రతినిధి అబ్దుల్ హఫీజ్ తెలిపారు.

తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారిణి.. చంద్రకళ ఇంట్లో సీబీఐ సోదాలు

- యూపీలో ఇసుక అక్రమ తవ్వకాల్లో ప్రమేయంపై ఆరోపణలు

లఖ్‌నవూ/న్యూఢిల్లీ/ఎల్లారెడ్డిపేట, జనవరి 5: సోషల్ మీడియాలో ఆమె అవినీతిపరుల పాలిట సింహస్వప్నం. తప్పు చేసే అధికారులు, కాంట్రాక్టర్లను రోడ్డుపైనే నిలదీసే డైనమిక్ ఆఫీసర్. యూపీలో ఇటీవల ఓ అవినీతి కాంట్రాక్టర్‌ను అందరి ముందే కడిగి పారేసి సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందారు. అలాంటి ఐఏఎస్ అధికారిణి చంద్రకళపైనే అవినీతి ఆరోపణలొచ్చాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన చంద్రకళ నివాసంలో సీబీఐ శనివారం సోదాలు జరిపింది. యూపీలోని హమీర్‌పుర్, మధుర, బులంద్‌శహర్ జిల్లాల కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఇసుక అక్రమ తవ్వకాల కాంట్రాక్టుల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు జరిగాయి. యూపీలోని చంద్రకళ నివాసంతో పాటు 14 చోట్ల, ఢిల్లీలోనూ పలువురు సీనియర్ అధికారుల ఇళ్లలో సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. కాగా, యూపీ కేడర్ ఐఏఎస్ భూక్య చంద్రకళ స్వస్థలం పెద్దపల్లి జిల్లా రామగుండం. ఆమె పెళ్లి రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా రాములు నాయక్‌తో 30 ఏళ్ల క్రితం జరిగింది. సీబీఐ అధికారులు శనివారం గర్జనపల్లిలోని ఆమె ఇంటికి కూడా వచ్చినట్లు తెలుస్తోంది. రెండు వాహనాల్లో వచ్చిన అధికారులు చంద్రకళ ఇంటికి తాళం ఉండటంతో వెనుదిరిగినట్లు స్థానికులు తెలిపారు. యూపీలో మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, ఎస్పీ అధినేత్రి మాయావతి చేతులు కలపడంతో మైనింగ్ అక్రమాలు అంటూ కేంద్రం ప్రతీకార చర్యలు చేపట్టిందని, చంద్రకళ ఇళ్లలో సోదాలు అందులో భాగంగానే చర్చించుకుంటున్నారు.

● బెంగళూరు సెంట్రల్ నుంచి ప్రకాశ్‌రాజ్ పోటీ



బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూర్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయనున్నట్లు బహుభాషా నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రకటించారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి పనులు చేయిస్తున్న ఆయన- ఈ మూడు రాష్ట్రాల్లో ఎక్కడ్నుంచైనా పోటీ చేయవచ్చని మొదట్లో వినిపించింది. అయితే స్వరాష్ట్రం నుంచే ఆయన పోటీచేస్తానని ట్విటర్ ద్వారా ప్రకటించారు. తనకు మద్దతు తెలిపిన అభిమానులకు కృతజ్ఞతలు చెప్పారు. కాగా, ప్రకాశ్‌రాజ్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ప్రకటించింది. తమ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ మేరకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారని ఆప్ ప్రతినిధులు తెలిపారు.

● మహారాష్ట్రలో ఎన్సీపీ-కాంగ్రెస్ జోడి

ముంబై, జనవరి 5: మహారాష్ట్రలో బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు సమయం ముంచుకొస్తున్న నేపథ్యంలో.. సీట్ల సర్దుబాటుపై పార్టీల మధ్య చర్చలు కొలిక్కి వస్తున్నాయి. 48 ఎంపీ స్థానాలు గల మహారాష్ట్రలో.. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ చెరో 20 సీట్లలో పోటీ చేయనున్నాయి. మిగిలిన 8 స్థానాలను మహా కూటమిలోని ఇతర పార్టీలకు కేటాయించనున్నారు.

● మన్మోహన్ విజయవంతమైన ప్రధాని: శివసేన

న్యూఢిల్లీ, జనవరి 5: మన్మోహన్‌సింగ్ విజయవంతమైన ప్రధాని' అని శివసేన వ్యాఖ్యానించింది. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో జరిగిన సంఘటనల ఆధారంగా తీసిన 'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమాపై వివాదం చెలరేగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'దేశానికి పదేళ్లు సేవ చేసిన ప్రధానిని మనమంతా గౌరవించాలి. పీవీ తర్వాత.. ఆ స్థాయిలో విజయవంతమైన ప్రధాని ఎవరైనా ఉన్నారంటే అది మన్మోహనే!' అని శివసేన నేత సంజయ్ రౌత్ అభిప్రాయపడ్డారు.

● భారత్‌లో నాకు ప్రాణహాని: నీరవ్ మోదీ

ముంబై, జనవరి 5: తనకు ప్రాణహాని ఉన్న దృష్ట్యా భారత్‌కు రాలేనని పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ ప్రత్యేక కోర్టుకు తెలిపారు. తన కేసును రాజకీయం చేశారని ఆయన పేర్కొన్నారు. నీరవ్‌ను పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటించాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన వ్యాజ్యానికి మోదీ తరఫున న్యాయవాది ఈ మేరకు సమాధానమిచ్చారు.

ఏటా 20 ఈఎల్‌లు వాడేసుకోవాలి

- 10 ఎర్న్‌డ్ లీవులే దాచుకోవచ్చు
- ఏడో వేతన సంఘం సిఫారసు... త్వరలో సర్క్యులర్

న్యూఢిల్లీ, జనవరి 5: ఆర్జిత సెలవుల (ఎర్న్‌డ్ లీవుల) నిబంధనలు త్వరలో పూర్తిగా మారిపోయే అవకాశాలున్నాయి. కేంద్ర ప్రభుత్వోద్యోగి ఇక నుంచి ఏటా తనకు వచ్చే ఆర్జిత సెలవుల్లో (ఈఎల్స్) 20 సెలవులను తప్పనిసరిగా వాడేసుకోవాలని, కేవలం పది సెలవులను మాత్రమే అట్టేపెట్టుకోవాలని ఏడో వేతన సంఘం సిఫారసు చేసింది. అంటే ఉద్యోగికి ఏటా వచ్చే 30 ఆర్జిత సెలవుల్లో పది సెలవులు మాత్రమే తదుపరి ఏడాదికి కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇంతకాలం.. ఆర్జిత సెలవులను ఇకపై 300 రోజుల వరకూ మాత్రమే దాచుకోడానికి (ఎక్యుములేట్ చేసుకోడానికి) అనుమతి ఇచ్చేలా నిబంధనలను సవరించాలని వేతనసంఘం సూచించింది. ఉద్యోగి తనకున్న సీఎల్స్‌కు ఒకట్రెండు ఈఎల్స్ జోడించి- వాటికి వారాంతపు సెలవులు కలుపుకొని -లాంగ్‌లీవు మీద వెళ్లేట్లు ప్లాన్ చేసుకుంటున్నారనీ, ఈ పద్ధతికిక స్వస్తి పలకాలనీ కూడా సూచించింది. సీఎల్స్‌తో ఈఎల్స్‌ను కలిపే నిబంధనలు కూడా సవరించాలని పే కమిషన్ కోరుతోంది. "దాని పేరులోనే ఉన్నట్లు పెయిడ్ లీవ్ లేదా ఎర్న్‌డ్ లీవ్ అంటే ఉద్యోగి తాను చేసిన సేవలకు పొందే సెలవు. దీన్ని గిఫ్ట్‌గా చూడరాదు. ఒక ఉద్యోగి (ఆర్జిత) సెలవు తీసుకొని పునరుత్తేజితుడైతే ఇంకా బాగా పనిచేయగలడనీ, తద్వారా పనిచేస్తున్న సంస్థకు నాణ్యమైన ఔట్‌పుట్ వస్తుందన్న ఉద్దేశంతో దీన్ని రూపొందించారు. చాలా ప్రభుత్వేతర సంస్థలు ఇప్పటికే ఈ నిబంధన అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో మాత్రం ఇంకా జరగడం లేదు. కంపల్సరీగా తీసుకొనేట్లు త్వరలోనే ఓ సర్క్యులర్ వెలువడుతుంది" అని వేతన సంఘం వెల్లడించింది.



కన్నూరులో కేరళ సీఎం విజయన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

కేరళలో ఆగని అల్లర్లు!

- అట్టుడుకుతున్న కన్నూరు.. బీజేపీ ఎంపీ ఇంటిపై బాంబుదాడి
- లెఫ్ట్ నేతల ఇళ్లపైనా బాంబులు.. ఇప్పటికి 3178 మంది అరెస్టు

కొచ్చిన్, జనవరి 5: బాంబు దాడులు, అల్లర్లు, ఆందోళనలతో కేరళ అట్టుడుకుతోంది. నిషేధిత వయసులో ఉన్న ఇద్దరు మహిళలు శబరిమల ఆలయ ప్రవేశం చేసిన అనంతరం బుధవారం మొదలైన అల్లర్లు శనివారం కూడా కొనసాగాయి. రాజకీయంగా సమస్యాత్మకమైన కన్నూరులో బీజేపీ, లెఫ్ట్ కార్యకర్తల మధ్య దాడులు, ప్రతిదాడులు జరిగాయి. తలస్సేరి సమీపంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు వి.మురళీధరన్ పూర్వీకుల ఇంటిపై శుక్రవారం రాత్రి పొద్దుపోయాక గుర్తు తెలియని వ్యక్తులు నాటు బాంబు విసిరారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడనప్పటికీ భవంతి కొంతమేరకు దెబ్బతినిందని ఎంపీ తెలిపారు. దీనికి సమాధానంగా అన్నట్లు శనివారం తలస్సేరి సీపీఎం ఎమ్మెల్యే ఎన్.షంషీర్, ఆ పార్టీ నేత పి.శశి, కార్యకర్త విశాక్ నివాసాలపై కొందరు నాటుబాంబులు విసిరారు. ఇక ఆదూర్‌లో శుక్రవారం సీపీఎం స్థానిక నేత ఇల్లు, రెండు దుకాణాలపై బాంబులు విసిరారు. హింసాత్మక ఘటనలతో కన్నూర్ జిల్లాలో జనజీవనం స్తంభించింది. కోజికోడ్, మలప్పురం, పథనంతిట్ట ప్రాంతాల్లోనూ దాడులు జరిగాయి. బుధవారం నుంచి జరిగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు 3178 మందిని అరెస్టు చేశారు. 1286 కేసులు నమోదు చేశారు.

'శబరిమల'పై నివేదిక ఇవ్వండి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ/లండన్, జనవరి 5: శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఆందోళనలు హింసాత్మకం కావడంతో తాజా పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించారు. సీపీఎం ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ ఇళ్లపై ఆందోళనకారులు బాంబులతో దాడి చేయడంపై రెండు పార్టీలూ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో డీజీపీ లోక్‌నాథ్ బెహెర రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత హెచ్చరికలు జారీ చేశారు. దాడిచేసినవారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. మరోవైపు ఐక్యరాజ్యసమితి కూడా తాజా పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది.



మాల్యా పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు

ప్రత్యేక కోర్టు ప్రకటన

ముంబై, జనవరి 5: మద్యం వ్యాపారి విజయ్ మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ముంబైలోని ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఈడీ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎంఎస్ ఆజ్మీ శనివారం ఈ మేరకు ఆదేశాలిచ్చారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల(ఎఫ్‌ఈవో) కొత్త చట్టం నిరుడు ఆగస్టులో అమల్లోకి వచ్చిన తర్వాత కోర్టు ప్రకటించిన మొదటి నేరస్థుడు మాల్యాయే కావడం విశేషం. కాగా, కోర్టు ఆదేశంపై బీజేపీ హర్షం వ్యక్తం చేసింది. అవినీతిపై పోరాటంలో బీజేపీ కీర్తికిరీటంలో ఇది కలికితురాయి అని ఆ పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర అన్నారు.

ఇండిగో ఇంజిన్‌లో భారీ శబ్దం

- అత్యవసరంగా చెన్నైలో ల్యాండింగ్

చెన్నై, జనవరి 5: ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. విమానం గాల్లో ఉన్న సమయంలో ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని అత్యవసరంగా చెన్నైలో దించారు. ఈ ఘటన గురువారం జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చింది. చెన్నై నుంచి కోల్‌కతాకు వెళుతున్న ఇండిగో ఎయిర్‌బస్ 320 విమానం ఇంజిన్‌లో భారీ శబ్దంతో పాటు నిప్పు రవ్వలు వెలువడ్డాయి. వెంటనే అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని అత్యవసరంగా చెన్నైలో దించారు.

మా అమ్మపైనా 6 గంటల నిర్బంధమా?

- 'ఐటీ' తీరుపై కర్ణాటక మంత్రి డీకే కన్నీటి పర్యంతం

బెంగళూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక జలవనరుల మంత్రి డీకే శివకుమార్ కన్నీటి పర్యంతమయ్యారు. 80 ఏళ్ల వృద్ధురాలైన తన మాతృమూర్తిని ఐటీ అధికారులు 6 గంటలపాటు ఇంట్లోనే నిర్బంధించి ప్రశ్నల వర్షం కురిపించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పన్నుల ఎగవేతకు సంబంధించి ఐటీ అధికారులు మంత్రి శివకుమార్ ఇంట్లో సహా ఆయన వ్యాపార సంస్థలపై దాడులను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి సహా ఆయన మాతృమూర్తిని శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రశ్నించారు. దీనిపై మంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, శాండల్‌వుడ్‌లో 3 రోజులుగా పలువురు నటులు, నిర్మాతల నివాసాలు, కార్యాలయాలపై 50 గంటల పాటు కొనసాగిన ఐటీ తనిఖీలు శనివారం మధ్యాహ్నం ముగిశాయి. ఇక రూ.1000 కోట్లకుపైగా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను, రూ.12 కోట్ల నగదును సీజ్ చేసినట్లు సమాచారం.

● ఇంజనీరింగ్ విద్యార్థి కిడ్నాప్.. హత్య

- తమిళనాడులోని కుంభకోణంలో దారుణం

చెన్నై, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థిని కిడ్నాప్ చేసిన దుండగులు.. తాము అడిగిన డబ్బు ఇవ్వకపోవడంతో దారుణంగా గొంతు కోసి చంపేశారు. తమిళనాడులోని తంజావూరు జిల్లా కుంభకోణంలో ఈ ఘోరం జరిగింది. కుంభకోణం సమీప అవనియాపురంలో నివసిస్తున్న సాహుల్ హమీద్, ముంతాజ్ బేగం దంపతులకు కుమారుడు ముంతజీర్(19), కుమార్తె ఉన్నారు. ముంతజీర్ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి సోదరి ఇంటికి వెళుతున్నట్లు తల్లికి చెప్పి ముంతజీర్ బయటికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటినా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి అన్ని చోట్లా ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. శనివారం వేకువజామున ముంతజీర్ సెల్‌ఫోన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ముంతాజ్‌బేగంకు ఫోన్ చేశారు. ముంతజీర్‌ను కిడ్నాప్ చేశామని, రూ.5లక్షలు ఇవ్వకుంటే చంపుతామని బెదిరించారు. ఈ విషయాన్ని వెంటనే ఆమె పోలీసులకు తెలిపింది. రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ముంతజీర్ మృతదేహాన్ని తిరుభువనం వీరచోళన వాగు సమీపంలో స్థానిక పోలీసులు కనుగొన్నారు.

● పర్రీకర్‌కు భద్రత పెంచండి: కాంగ్రెస్

పనాజి, జనవరి 5 : గోవా సీఎం మనోహర్ పర్రీకర్ ప్రాణాలకు ముప్పు ఉందని, ఆయనకున్న భద్రతను మరింత పెంచాలని కాంగ్రెస్ కోరింది. ఈ మేరకు రాష్ట్రపతికి గోవా కాంగ్రెస్ లేఖ రాసింది. రాఫెల్ ఒప్పందానికి సంబంధించి పర్రీకర్ వద్ద కొన్ని కీలక పత్రాలు ఉన్నాయని, ఈ ఒప్పంద వివరాలు బయటకు రాకూడదనుకున్న కొన్ని స్వార్థపూరిత శక్తులు.. ఆయన వద్ద నుంచి పత్రాలను తస్కరించే ప్రయత్నం చేయవచ్చని ఆరోపించింది.

● కుంభమేళా గ్రామంలో కాంగ్రెస్ శిబిరాలు

న్యూఢిల్లీ, జనవరి 5: మితవాద హిందుత్వ అజెండాతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలలే ఉన్నాయనగా, ఈనెల 14న ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న అర్ధ కుంభమేళాలోనూ కాంగ్రెస్ భాగస్వామ్యం కానుంది. మేళా జరిగే పరిసరాల్లో 16,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో భక్తుల సౌకర్యార్థం 2 శిబిరాలు ఏర్పాటు చేయనుంది. మరోవైపు బీజేపీ 90 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో శిబిరాల ఏర్పాటుపై దృష్టిసారించింది.

● అగస్టా కేసులో జ్యుడీషియల్ కస్టడీకి మిషెల్

న్యూఢిల్లీ, జనవరి 5: అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కేసులో అరెస్టయిన మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్‌ను ప్రత్యేక కోర్టు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అరవింద్ కుమార్ ఎదుట పోలీసులు మిచెల్‌ను శనివారం ప్రవేశపెట్టారు. మనీ లాండరింగ్‌పై విచారణ జరిపేందుకు మిచెల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాల్సిందిగా ఈడీ ప్రత్యేక కోర్టును కోరింది. ఈడీ కేసులో ఫిబ్రవరి 26 వరకు, సీబీఐ కేసులో ఫిబ్రవరి 27 వరకు మిచెల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ కోర్టు ఆదేశాలిచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.